thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 109 కరీంనగర్ శనివారం, 28 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.

# దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పీవీ : సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(శుక్రవారం) ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారని ఉద్ఘాటించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పీవీ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై మంత్రుల కీలక వ్యాఖ్యలు

సిద్దిపేట: హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని.. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. అక్కన్నపేట నుంచి జనగాం వరకు నాలుగు లైన్‌ల రోడ్డు త్వరలోనే వస్తుందని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, ఇంజనీరింగ్ కాలేజ్, టూరిజ్ ప్రాజెక్టులు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇవాళ హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు.

**హుస్నాబాద్ ప్రజల గౌరవాన్ని పెంచుతా: మంత్రి పొన్నం ప్రభాకర్ :** 'రెండు సంవత్సరాల కింద ఇదే వేదిక మీద బడిపండగ జరిగింది. అప్పుడు ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలో లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు , కేబినెట్ మంత్రుల సహకారంతో శాతవాహన యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్ తరగతులు




ఈ సంవత్సరం నుంచి ప్రారంభం అవుతున్నాయి. రూ. 82.00 కోట్లతో 150 పడకల ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశాం. రూ. 77.20 కోట్లతో రాజీవ్ రహదారి కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రెండు వరుసల రహదారుల నుంచి నాలుగు వరుసల రహదారికి ఫేజ్ 2కు శంకుస్థాపన చేశాం. నూతనంగా రూ. 11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాం. ఫేజ్ - 1 త్వరలోనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాం. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు జరుగుతున్నాయి. నన్ను గెలిపించిన హుస్నాబాద్ ప్రజల గౌరవాన్ని పెంచుతా. హుస్నాబాద్‌ని అభివృద్ధి అన్నిరంగాల్లో ముందుంచుతా. ఇక్కడికి వచ్చిన మంత్రులు హుస్నాబాద్ అభివృద్ధికి అభయం ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో పంట పెట్టుబడి సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నవడ్లకు రూ. 500 బోనస్ ,రుణమాఫీ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




## అప్పుడే మొదలైన జూబ్లీహిల్స్...

# ఉప ఎన్నిక వేడి..!

## కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నేతలు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో తెలంగాణలో మరో ఉప ఎన్నిక రాబోతుంది. ఆరు నెలల్లో బైపోల్ రావాల్సి ఉన్నా..రెండు మూడు నెలల్లోపే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. దీంతో ఇప్పటి నుంచే మూడు ప్రధాన పార్టీలు జూబ్లీహిల్స్ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. ముఖ్యంగా కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సీటును కూడా కైవసం చేసుకోవాలనే గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. మరో వంక బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యంగా.. వరసగా మూడుసార్లు అదే నియోజకవర్గం నుంచి గెలిచిన మాగంటితో పార్టీకి, పార్టీ కంటే మిన్నగా, పార్టీ అధినేత కేసీఆర్‌కు ఉన్న అనుబంధం దృష్ట్యా..నియోజకవర్గంలో మాగంటి పేరు నిలిచేలా గెలిచి తీరాలని గులాబీ బాస్ వ్యూహ రచన చేస్తున్నట్లు చెపుతున్నారు. మాగంటి కుటుంబం నుంచి ఎవరినైనా బరిలోకి దించుతారా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. వారి కుటుంబం నుంచి పోటీకి ఎవరూ సుముఖంగా లేకపోతే..మరో నేతను పోటీలో పెట్టనున్నారు. పీజేఆర్ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందన్న ప్రచారం జరుగుతోంది. ఆయనకు దాదాపు కన్ఫామ్ చేశారని అంటున్నారు. ఇక గతంలో జూబ్లీహిల్స్ నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రావుల శ్రీధర్‌రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నారు. ఆయన కూడా టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**టికెట్లు ఆశిస్తున్నది వీరే?...** ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారుతోందట. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజారుద్దీన్ మళ్లీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నారట. ఆయనతో పాటు చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ కూడా ఈసారిలో బరిలో నిలవాలని ప్లాన్ చేస్తున్నారట. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిధిలో నవీన్ యాదవ్‌కు మంచి పట్టుంది. 2014 ఎన్నికలలో నవీన్ యాదవ్‌మజ్లిస్ పార్టీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 41వేల 656 ఓట్లు సాధించారు. 2018లో AIMIMకు రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 18వేల 817 ఓట్లు పడ్డాయి. ఇక పీజేఆర్ కూతురు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కూడా కాంగ్రెస్ నుంచి జూబ్లీహిల్స్ టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ రెడ్డి, ఇంకోవైపు బీసీ, మరోవైపు మైనార్టీ ఈక్వేషన్‌లో హస్తం పార్టీకి ఎవరికి టికెట్ కేటాయిస్తుందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం, మైనార్టీ ఓటర్లు డిసైడింగ్ ఫ్యాక్టర్స్‌గా ఉన్నాయి. ఈనేపథ్యంలో ఎంఐఎం సపోర్ట్ ఎవరికన్నది కూడా చర్చనీయాంశం అవుతోంది. ఇక బీజేపీ విషయానికి వస్తే..ఏపీలో విజయవంతమైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రయోగాన్ని తెలంగాణాలో పరీక్షించుకునేందుకు ఇదొక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి మాగంటి గోపీనాథ్ టీడీపీ ప్రొడక్ట్. రాష్ట్ర విభజన తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టీడీపీ టికెట్ పైనే గెలిచారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితులతో 2016లో బీఆర్ఎస్‌లో చేరి వరుసగా 2018, 2023 ఎన్నికల్లో విజయ సాధించారు. అయినా..టీడీపీతో, ముఖ్యంగా చంద్రబాబుతో ఆయనకు చివరి వరకు మంచి సంబంధాలున్నాయి. అందుకే.. మాగంటి చనిపోయినప్పుడు లోకేష్ దంపతులు మాగంటి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున అభ్యర్థిని నిలబెట్టాలన్న యోజనలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఉన్నారని తెలుస్తోంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దీపక్‌రెడ్డి..బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కలిసి విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ఆ సమావేశంలో జూబ్లీహిల్స్ బైపోల్‌పై చర్చించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాల వారుండే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈసారి పార్టీల వ్యూహాలు, ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.




# ఖయ్యానికి కాలుదువ్వుతున్నారా!?

## భారత్‌పై భారీ కుట్రకు సిద్ధమవుతున్న పాక్..?

## ధ్వంసమైన ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం..?

పహల్గామ్ దాడి తర్వాత తీవ్రంగా నష్టపోయిన పాకిస్థాన్ తన బుద్ధిని మాత్రం మార్చుకోవడం లేదు. పాక్ మరోసారి భారతదేశంపై పెద్ద కుట్రకు పాల్పడుతోందని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దాయాది దేశంలో ధ్వంసమైన ఉగ్రవాద లాంచింగ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలను పునర్నిర్మిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ముఖ్యంగా పీవోకే లోని దట్టమైన అడవుల్లో ఈ కార్యకలాపాలు కనిపిస్తున్నాయని ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. నివేదిక ప్రకారం.. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆదేశ సైన్యం, ప్రభుత్వం ఈ ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తున్నాయి. ఇటీవల బహవల్పూర్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ శిబిరాలను తిరిగి స్థాపించాలని నిర్ణయించారు. జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, టీఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద సంస్థల అగ్ర కమాండర్లతో పాటు పాక్ సైన్యం, ఐఎస్ఐ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిఘా సంస్థల సమాచారం ప్రకారం.. ఈసారి ఉగ్రవాద శిబిరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు అమర్చనున్నారు. తద్వారా భారత నిఘా సంస్థలు వాటిని చేరుకోవడం కష్ట తరంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ శిబిరాల భద్రతా బాధ్యతను పాకిస్థాన్ సైన్యంలోని ప్రత్యేక భద్రతా గార్డులకు అప్పగించారు. వారు డ్రోన్లు, థర్మల్ సెన్సార్లు, నైట్ విజన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో ఈ ప్రాంతాలను పర్యవేక్షిస్తారు. ఈసారి ఉగ్రవాద సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి.

ఇప్పుడు ఒక శిబిరంలో 200 కంటే తక్కువ మంది ఉగ్రవాదులను ఉంచుతారట. భారతీయ ఏజెన్సీలకు ట్రాక్ చేయడం కష్టతరం అయ్యేలా అనేక చిన్న శిబిరాలను నిర్మిస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే, ఉగ్రవాదులను వెంటనే సరిహద్దు వైపు పంపుతారు. ఈ సమాచారం అందిన తర్వాత, భారత భద్రతా సంస్థలు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో కార్యకలాపాలపై తమ పర్యవేక్షణను మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, నిఘా సంస్థలు హై అలర్ట్ జారీ చేశాయి. పీఓకేలో ఈ స్థావరాలను తిరిగి ఏర్పాటు చేస్తున్న వారిపై ఉపగ్రహ చిత్రాలు, గ్రౌండ్ ఇంటెలిజెన్స్ ద్వారా నిఘా పెంచారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ కింద భారత భద్రతా సంస్థలు పాకిస్థాన్‌లోని అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాయి.

వాటిలో లూని, పుత్వాల్, భైరోనాథ్, పిపి ధన్‌ధర్, టిప్పు, ముంతాజ్ కాంప్లెక్స్, జమీల్, సైధ్వాలి, ఉమ్రాన్‌వాలి బంకర్, చాప్రార్ ఫార్వర్డ్, చోటా చక్ పోస్ట్, అఫ్జల్ షహీద్ పోస్ట్, జంగ్లోరా పోస్ట్ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఈ ప్రదేశాలన్నింటిలోనూ వాటిని కొత్త మార్గాల్లో తిరిగి సిద్ధం చేసే కసరత్తు ప్రారంభమైంది.

చురకలు







# పార్ట్ టైమ్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త

హైదరాబాద్ : ప్రస్తుతం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్స్ పెరిగిపోతున్నారు. పార్ట్ టైమ్ ఉద్యోగాలు అధికం అవుతున్నాయి. స్విగ్గీ, జొమాటో, జెప్టో దగ్గర్నుంచి ర్యాపిడో,ఓలా,ఉబర్ ఇలా ప్రతి రంగంలో పార్ట్ టైమ్ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు. తక్కువ సమయం ఎక్కువ డబ్బు అన్న కాన్సెప్ట్ కారణంగా యువత ప్రభుత్వ ఉద్యోగాలు, సాఫ్ట్ వేర్ కంపెనీలకు వెళ్లకుండా పార్ట్ టైమ్ ఉద్యోగాలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. రోజులో ఓ పూట పార్ట్ టైమ్ ఉద్యోగం చేసి.. మరో పూట వారి చదువులు, కోచింగ్స్, ఇతర ఆటలు, ఇష్టమైన పనులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సంఖ్య పెరిగిపోతోంది. నీతి ఆయోగ్ డేటా ప్రకారం 2020లో దేశంలో 70 నుంచి 80 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉండగా.. 2029–30 నాటికి ఆ సంఖ్య 2 కోట్లు దాటనుందని ప్రముఖ సంస్థల సర్వేల ద్వారా వెల్లడవుతోంది. ఇక ప్రస్తుతం తెలంగాణలో 4.5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నట్లు సమాచారం. అయితే గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలోనే గిగ్ వర్కర్ల కోసం ఓ బోర్డును ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తుందని కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ పార్టీ యువతకు హామీ ఇచ్చిందని.. త్వరలోనే గిగ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివేక్ వెంకట స్వామి గుడ్ న్యూస్ చెప్పారు. ఎన్నికల ముందు వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త చట్టం తెస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికే రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లోని గిగ్ వర్కర్లకు ప్రత్యేకంగా ఓ చట్టాన్ని రూపొందించారని మంత్రి వివేక్ గుర్తు చేశారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా త్వరలోనే తెలంగాణలోనూ గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురానున్నట్లు రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. ఈ మేరకు పార్ట్ టైమ్ ఉద్యోగుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తొలి అడుగు వేయబోతోందని తెలిపారు. గిగ్ వర్కర్లకు సంబంధించిన కొత్త చట్టాన్ని కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నామని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల బిల్లు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదం పొందాక అసెంబ్లీలో ఈ బిల్లును ప్రవేశపెడతామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. దీంతో తెలంగాణలోని 4.5 లక్షల మంది గిగ్ వర్కర్లకు లబ్ధి చేకూరుతుందని వివరించారు.





హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను అధికారులు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 38,741 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 24,415మంది (73.35 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.

# ఫోన్ ట్యాపింగ్.. రోజుకొకరి విచారణ.. ఇదేమన్న డైలీ సీరియలా: ఎంపీ రఘునందన్



హైదరాబాద్, జూన్ 27: దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తనదన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు గుప్పించారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు...** కాంగ్రెస్ పార్టీకి ప్రచార ఆర్భాటాలు తప్ప మరొక్కటి లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బెదిరింపు కాల్స్‌పై విచారణ జరుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సమాచారం ఇస్తే ఎస్కార్ట్, ముగ్గురు సిబ్బందిని ఇస్తామన్నారన్నారు. కాంగ్రెస్ 18 మాసాల పాలనపై సమీక్షించుకోకుండా రోజుకొక కొత్త కథతో ముందుకు వస్తోందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ మేయర్ ఐదు రూపాయల భోజనం పేరు మారుస్తున్నట్లు ప్రకటించారని.. అన్నపూర్ణ క్యాంటీన్ పేర్లను ఇందిరమ్మ పేరు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే ఇంగిత జ్ఞానం లేకుండా ఇందిరమ్మ పేరు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మేయర్ దృష్టి పెట్టాల్సింది కుక్కల బెడద, సమస్యలపైన కానీ పేర్ల మార్పు మీద కాదు అంటూ హితవుపలికారు. పథకాల పేర్లు మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పితే ఇళ్ళు లేని వాళ్లకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సవాల్ విసురుతున్న.. ఇళ్లులేని వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని నిరూపించాలన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైనా వెళ్లి పరిశీలించాలన్నారు. 'కవిత ఎవ్వరూ.. కవిత బీసీనా. అధికారంలో ఉన్న పదేళ్లు ఎందుకు బీసీలు గుర్తుకురాలేదు. బీసీలకు అధ్యక్ష పదవి, ఎల్పీనేత పదవులు ఇవ్వకుండా బీసీ ఉద్యమం చేస్తామంటే ఎట్లా? మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే.. రాజ్యాంగ సవరణ చేస్తాం' అని ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు.




హైదరాబాద్: అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు చేసిన భూ కేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను హైకోర్టు కొట్టేసింది. ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై జనవరిలో వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా.. బయట కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయన్నారు. ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు, ప్రస్తుత భవనం నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను కూడా హైకోర్టు కొట్టేసింది.

# మావోయిస్టుల లేఖపై స్పందించిన మంత్రి సీతక్క



ములుగు, జూన్ 27: ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు.

జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నా యంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

# బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని సీఎం రేవంత్.. హరీష్ ఎద్దేవా



హైదరాబాద్, జూన్ 27: బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఏబీఎన్ – ఆంధ్రజ్యోతితో మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పోరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలవలేదని చెప్పుకొచ్చారు.చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం.. ప్రత్యేక ఇన్సెంటివ్‌లపై చర్చ

హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ముగిసింది. బోర్డు ఛైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన హైబ్రిడ్ విధానంలో ఈ సమావేశం నిర్వహించారు. దిల్లీ నుంచి అతుల్ జైన్, తెలంగాణ, ఏపీ అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

కృష్ణా బోర్డు లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్, కేంద్ర జలశక్తి శాఖ మార్గదర్శకాలు, హైకోర్టు ఆదేశాలపై చర్చించారు. ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వరాదని, ఉద్యోగుల నుంచి రికవరీ చేయరాదని నిర్ణయించారు.




# జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.302 కోట్లతో నిర్మిస్తున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనుల గురించి ఆరా తీశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**హుస్నాబాద్‌లో నలుగురు మంత్రుల పర్యటన..** మరోవైపు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నలుగురు మంత్రులు పర్యటించారు.

తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ కలిసి ఇక్కడ మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

# హైదరాబాద్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర



హైదరాబాద్: భాగ్యనగరంలో జగన్నాథుడి రథయాత్ర ఘనంగా కొనసాగుతోంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్, లోయర్ ట్యాంక్ బండ్ వద్దనున్న ఇస్కాన్ మందిరాల నుంచి వేర్వేరుగా ఈ కార్యక్రమాలు కొనసాగాయి. నగరవాసులు భారీగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్ నుంచి బయల్దేరిన రథయాత్ర మోండామార్కెట్ నుంచి వెళ్తుండగా.. మహిళలు అందమైన రంగవల్లులు వేసి జగన్నాథుడికి స్వాగతం పలికారు.




# సీఎం కాన్వాయ్‌లోని 19 కార్లు ఒకేసారి బ్రేక్‌డౌన్.. ఎందుకంటే

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు మార్గమధ్యంలో అనూహ్యమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కాన్వాయ్‌లోని 19 వాహనాలు ఒకదాని వెంట మరొకటి రోడ్డుపైనే నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి షెడ్యూల్ ప్రకారం రత్లాంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి శుక్రవారంనాడు బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక 19 ఎస్‌యూవీలతో కూడిన కాన్వాయ్‌లో సమస్యలు తలెత్తాయి. వాహనాలు జర్కులు ఇస్తూ నిలిచిపోయాయి. వాహనాలను నెట్టే ప్రయత్నం చేసినప్పటికీ అవి స్టార్ట్ కాలేదు. దీంతో మరో ప్రత్యేక వాహనంలో సీఎం ముందుకు సాగారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనాలు రోడ్డుపైనే మొరాయించడానికి స్థానిక పెట్రోల్ పంప్‌లో డీజిల్ కల్తీ కావడమే కారణంగా అధికారులు అనుమానిస్తున్నారు. తొలుత ఒకటి, రెండు కార్లలో సమస్య తలెత్తినా ఆ తర్వాత అన్ని వాహనాలు నిలిచిపోయినట్టు కాన్వాయ్ డ్రైవరు శుభం వర్మ తెలిపారు. స్థానిక పెట్రోల్ పంప్‌లో 350 లీటర్ల డీజిల్ నింపామని, అయితే కల్తీకి అవకాశమే లేదని సిబ్బంది చెబుతున్నారని పేర్కొన్నారు. కాగా, స్థానిక యువకుడు ఒకరు ఇదే పెట్రోల్ పంప్ నుంచి నింపుకున్న డీజిల్‌లో వాటర్ లేయర్లు కనిపించడంతో డీజిల్ శాంపుల్స్ సేకరించిన ఫుడ్ అండ్ సివిల్ సప్లై అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఆ శాంపుల్స్‌లో నీళ్లు కలిసినట్టు గుర్తించారు. దీనిపై మరింత విచారణ జరిపి సమగ్ర నివేదకను రత్లాం కలెక్టర్‌కు అందజేస్తామని ఫుడ్ డిపార్ట్‌మెంట్ అధికారి ఆనంద్ గోలే తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ పంప్‌ను అధికారులు సీజ్ చేశారు.

# ఆంధ్రరాష్ట్ర తొలి శాసన సభాపతి నల్లపాటి వెంకటరామయ్య



నల్లపాటి వెంకటరామయ్య ( 1901 మార్చి 1 – 1983 జూన్ 28) న్యాయవాది, రాజకీయవేత్త, ఆంధ్రరాష్ట్ర తొలి శాసన సభాపతి. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేట సమీపంలోని జొన్నలగడ్డ గ్రామంలో అంకమ్మ, కోటమ్మ దంపతులకు 1901, మార్చి 1న జన్మించారు. నరసరావుపేటలో ఎస్ ఎస్ యల్ సి, గుంటూరులో ఇంటర్ పూర్తి చేశారు. మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో బిఏ పట్టభద్రుడయ్యారు. వినుకొండ రెవెన్యూ ఆఫీసులో గుమాస్తాగా చేరి బ్రిటిష్ వారి కొలువులో ఇమడలేక ఉద్యోగం వదిలివేశారు. తిరిగి మద్రాసు వెళ్ళి న్యాయశాస్త్రం అభ్యసించి న్యాయవాది అయ్యారు. గుంటూరులో న్యాయవాది అన్నవరాజు సీతాపతిరావు వద్ద సహాయకునిగా కొంతకాలం పనిచేసి 1928లో నరసరావుపేటలో న్యాయ వాదిగా కొనసాగారు. పల్నాడు ప్రాంతంలో న్యాయవాదిగా కీర్తిప్రతిష్టలను పొందారు. 1932లో వెంకటరామయ్య తాలూకా బోర్డు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ మెంబరుగా నియమితులై విద్యావ్యాప్తికి కృషి చేశారు. 1952లో నరసరావుపేట నియోజకవర్గం నుండి కాసు వెంగళరెడ్డిపై పోటీ చేసి శాసనసభ్యునిగా గెలిచారు. 1953 అక్టోబరు 1న స్పీకర్ పదవికి ఎన్నిక జరగగా కందవల్లి కృషారావుపై వెంకటరామయ్య గెలుపొందారు. 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడి ప్రకాశం ముఖ్యమంత్రిగా ఎన్నుకొన బడగా, 1953 నవంబరు 23న వెంకటరామయ్య సభాపతిగా ఎన్నికయ్యారు. వెంకటరామయ్య గెలుపును ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు ప్రతిషాత్మ కంగా భావించారు. తొలి శాసనసభ స్పీకర్ గా వెంకటరామయ్య చరిత్రలో నిలిచి పోయారు. 25 సంవత్సరాలు న్యాయవాద వృత్తిలో కొనసాగిన వెంకటరామయ్య శాసనసభను కూడా న్యాయబద్ధంగా నడిపారు. శాసనసభను నిబంధనల మేరకు సజావుగా నడిపించి అన్ని పార్టీల వారి అభిమానాన్ని చూరగొన్నారు. 1955లో కరణం రంగారావుపై ఐక్య కాంగ్రెస్ అభ్యర్థిగా, శాసనసభ్యునిగా గెలిచారు. 1962లో రాజకీయాల నుండి వైదొలగి 1978వరకు న్యాయవాది వృత్తిలో కొనసాగారు. 1983 జూన్ 28న నరసరావుపేటలో కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# 2027లో నియోజకవర్గాల పునర్విభజన

## - తెలంగాణలో 153 శాసనసభ స్థానాల అవకాశంపై సమగ్ర చర్చ



భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో నియోజకవర్గాల పునర్విభజన ఒక ముఖ్యమైన వ్యవస్థాపక ప్రక్రియ. ఇది జనాభా ప్రాతిపదికన ప్రజలకు సముచితమైన ప్రాతినిధ్యాన్ని కల్పించేందుకు అవసరమవుతుంది. దేశంలోని పార్లమెంటు మరియు శాసనసభ నియోజకవర్గాల భౌగోళిక విభజనను, పరిమాణాన్ని సమయానుకూలంగా పునర్నిర్వచించడమే ఈ ప్రక్రియ యొక్క లక్ష్యం. రాజ్యాంగంలోని అధికరణ 82 మరియు 170 ప్రకారం, ఇది సవరణల ద్వారా అమలవుతుంది. చివరిసారిగా 2002లో పునర్విభజన జరిగి, 2008లో అమలులోకి వచ్చింది. కానీ రాజ్యాంగ 84వ సవరణ (2002) ప్రకారం, తదుపరి పునర్విభజనను 2026 వరకు నిలిపివేశారు. అంటే, 2026 తర్వాత జరగనున్న జనాభా గణన ఆధారంగా కొత్త డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, 2027 నాటికి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరగవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో తెలంగాణలో శాసనసభ స్థానాలు 119 నుండి 153కి పెరగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై 2014లో వెలువడిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 26వ విభాగంలో స్పష్టంగా ప్రస్తావించ బడింది. అయితే, 2026లోని రాజ్యాంగ పరిమితి పూర్తయ్యే దాకా కేంద్ర ప్రభుత్వం ఈ పెంపును ఆమోదించ లేని స్థితి ఏర్పడింది. ఇక, 2027 పునర్విభజన అనంతరం దీనికి చట్టబద్ధంగా మార్గం సిద్ధమవుతుంది. తెలంగాణలో 2023 జనాభా అంచనాల ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభా దాదాపు 4 కోట్ల 35 లక్షలు. ఈలోపు హైదరాబాద్ మెట్రో ప్రాంత జనాభానే దాదాపు 1.1 కోట్లు తో ఉంది. శాసనసభ స్థాయిలో చూస్తే, ప్రస్తుతం ఉన్న 119 నియోజకవర్గాల సగటు జనాభా దాదాపు 3.65 లక్షలు. కానీ కొన్ని పట్టణ నియోజకవర్గాల్లో ఇది 5 లక్షలు దాటిన సందర్భాలున్నాయి, అటు పల్లెలోని నియోజక వర్గాల్లో మాత్రం 2 లక్షలకు లోపే ఉన్న ఉదాహరణలు ఉన్నాయి. ఈ అసమానతలను సరిదిద్దేందుకు, జనాభా సమానమైన నియోజక వర్గాలు ఏర్పరచడం అత్యవసరమవుతుంది. నియోజక వర్గాల సంఖ్యను 119 నుండి 153కి పెంచితే, ప్రతి నియోజకవర్గానికి సగటు జనాభా 2.85 లక్షల పరిధిలో ఉంటుంది. ఇది ప్రజలకు ప్రాతినిధ్యాన్ని మరింత సమీపంగా చేస్తుంది. పైగా ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా, కొన్ని జిల్లాల్లో మూడు నియోజక వర్గాలే ఉండగా, ఇతర జిల్లాల్లో ఏడు వరకు ఉన్నాయి. 153 నియోజక వర్గాలు ఏర్పడితే, జిల్లాల వారీగా నియోజకవర్గ పంపిణీ తారతమ్యం తగ్గే అవకాశముంది. పునర్విభజన తర్వాత కొత్త నియోజక వర్గాలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలు %–% మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నిర్మల్, జనగామ, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట మొదలైనవి. అలాగే జడ్చర్ల, కందుకూర్, బూదన్ పోచ్‌ంపల్లి, భువనగిరి, మిర్యాలగూడ, సిద్దిపేట, వంటి అభివృద్ధి చెందిన పట్టణాలు కొత్త నియోజక వర్గాలుగా మారే అవకాశముంది. పునర్విభజన వల్ల కలిగే లాభాలు అనేకం. ప్రథమంగా ప్రజలకు దగ్గరగా ఉండే ప్రజా ప్రతినిధులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ పాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. ప్రజా అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యతలు త్వరగా ప్రభుత్వానికి చేరతాయి. వెనుకబడిన ప్రాంతాల సమస్యలు కూడా శాసనసభలో ప్రాధాన్యతతో చర్చకు వస్తాయి. పట్టణాలలోని వృద్ధి చెందిన మున్సిపాలిటీలకు ప్రత్యేక నియోజకవర్గ ప్రాతినిధ్యం లభిస్తుంది. ఇది మౌలిక సదుపాయాల విస్తరణకు తోడ్పడుతుంది. అయితే సవాళ్లు కూడా తక్కువగా లేవు. శాసనసభ స్థానాల పెంపుతో ప్రతినిధుల ఖర్చులు, సిబ్బంది, కార్యాలయ నిర్వహణ మొదలైనవి ప్రభుత్వంపై ఆర్థిక భారం కలిగిస్తాయి. అంతేగాక, కొత్త నియోజక వర్గాల సరిహద్దులు నిర్ణయించేటప్పుడు సామాజిక, భౌగోళిక, రాజకీయ కోణాలు పరస్పరంగా పోటీ పడే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొన్నిచోట్ల ప్రజల నిరసనలు, సంఘర్షణలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. రాజకీయంగా చూస్తే, స్థానాల పెంపుతో స్థానిక నేతల మధ్య పోటీ పెరగడం వల్ల పార్టీల అంతర్గత సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జరగాలి. కమిషన్ అందుబాటులో ఉన్న తాజా భౌగోళిక, జనాభా గణాంకాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా నియోజక వర్గాలను పునర్విభజించాలి. రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రజలు ఈ ప్రక్రియను అంగీకరించి, భాగస్వామ్యం వహించాలి. 2027లో జరగబోయే ఈ పునర్విభజన తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు, పాలనా స్వరూపానికి గణనీయమైన మలుపు ఇస్తుంది. 153 శాసనసభ స్థానాలవైపు జరిగే మార్పు ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు మార్గం వేయ గలదు. ఇది తగిన సమయంలో, సమగ్రంగా, నిబద్ధతతో జరిగితే, తెలంగాణ ప్రజలకు ఇది మెరుగైన పాలనా వ్యవస్థకు నాంది అవుతుంది. ఈ పునర్విభజన ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రాధాన్యతను కల్పిస్తూ %–% గ్రామీణ, పట్టణ, వలస జనాభా ప్రాంతాలకు సమపాళ్లలో ప్రతినిధ్యం ఇచ్చే విధంగా సాగాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్య లక్ష్యాన్ని సాధించిన ఫలితం రావచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల ... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ధర్మపురితో పాములపర్తి అనుబంధం - జూన్ 28... పి వి జయంతి సందర్భంగా



పాములపర్తి వెంకట నరసింహా రావుకు ధర్మపురి క్షేత్రంతో అవినాభావ సంబంధం ఉంది. బ్రాహ్మణ అగ్రహారమైన ధర్మపురి వాసులతో బంధుత్వం లేకున్నా, ఇక్కడి శ్రీ నృసింహ గురు పీఠంతో, అలాగే సమకాలీన రాజకీయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న నాయకులతో గల సన్నిహిత సంబంధాల దృష్ట్యా తరుచుగా పి.వి. క్షేత్రానికి వస్తూ పోతూ ఉండేవారు. అష్టాదశ పురాణములను ఔపోసనం పట్టి, నిత్య పురాణ ప్రవచనాలతో భక్తులను ఆధ్యాత్మిక లోకాలలో విహరింప చేసిన, అపర వేదవ్యాసులుగా పేరుగాంచిన గుండి రాజర్షి వద్దకు వచ్చి, శ్రద్ధగా విని, సందేహ నివృత్తి చేసుకున్న నేపథ్యం, అపర ధన్వంతరి, నాటక సంస్థ స్థాపకులు, దర్శకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాసర్ల వేంకట రాజయ్య, కొరిడే కిష్టయ్య, వొజ్జల కోటయ్య, పాత కాంతయ్య, పెండ్యాల లక్ష్మీ నరహరి తది తరులతో, కొరిడే కిష్టయ్య ఇంటి అరుగుపై రోజుల కొద్దీ రాజకీయ చర్చలు చేసిన విషయాలు క్షేత్ర పాతతరం వారికి నిత్య జ్ఞాపకాలుగా ఉన్నాయి. 1967లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా, లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న పి.వి. తర్వాత సీఎం బ్రహ్మానంద రెడ్డి, ఆర్థిక మంత్రి మర్రి చెన్నారెడ్డి లతో చర్చించి, స్థానికులు, స్వాతంత్ర్య సమరయోధుడు కే.వీ. కేశవులకు ఏక సభ్య దేవస్థాన పునరుద్ధరణ కమిటీ బాధ్యులుగా నియమింప చేసి, దేవాలయాల అభివృద్ధికి, శ్రీ వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన అది కార్యక్రమాలకు పి.వి. చేయూత అందించారు. ధర్మపురి క్షేత్రం లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో నిర్వహించ బడిన శ్రీ రాజ రాజేశ్వర వెంకటేశ్వర సంస్కృత పాఠశాల కోసం శాశ్వత భవనం నిర్మించాలని, నాటి దేవస్థాన పాలక వర్గ కమిటీకి సూచించి, 1970 అక్టోబర్ 2న రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా, శంకు స్థాపన చేశారు. తర్వాత సదరు పాఠశాల భవనం 1976 ఆగస్టు 11న నాటి రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖల మంత్రి జువ్వాడి చొక్కారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రాజా సాగి సూర్య నారాయణ రాజు చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం జరిగింది. 1971 శాసనసభ సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం హోదాలో నాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి. రాములుకు మద్దతుగా ధర్మపురి లో ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా గోదావరి నుండి త్రాగు నీటి సరఫరా పథకం మంజూరీ ఇచ్చి, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావును నీటి సరఫరా పథకం పనులు చేయాలని కోరారు. తమ సన్నిహితులు రొట్టె విశ్వనాథ శాస్త్రి కోరికపై, స్థానిక లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని నాటి కరీంనగర్ కలెక్టర్ కే. ఎస్. శర్మను ఆదేశించారు. స్థానిక కాంట్రాక్టర్ సంగి కిష్టయ్య నిర్మాణం గావించారు. నాటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్ రావు అభ్యర్థనపై పలు నిధులు మంజూరు చేశారు. 1945 నుండి పి.వి.కి ధర్మపురి నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఆయన సమకాలిక నేత, పలువురు కాంగ్రెస్ అగ్రనాయకు లతో సాన్నిహిత్యం కలిగి ఉన్న దాద గారి కిషన్ రావు చెప్పేవారు. క్షేత్రంలో గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పథకం, తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మశాల, సంస్కృత పాఠశాల భవనం, ఓరియంటల్ డిగ్రీ కళాశాల భవనం పి.వి. చొరవ వల్లనే సాధ్య మైనాయని పి.వి. సన్నిహితులు, ప్రభుత్వ సన్మానితులు, నరసింహ పీఠ నిర్వాహక బాధ్యులు బ్రహ్మశ్రీ రొట్టె విశ్వనాథ శాస్త్రి చెపుతుండేవారు. సాంప్రదాయ పద్య నాటకంలో తన ప్రదర్శన తిలకించి నట కిరీటి బిరుదుతో గౌరవించి, సన్మానించిన సంఘటనను, తమ ఇంటిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యాలయంలో నెల రోజులు బిజీగా పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేసిన, తనతో పాటె నిద్రించిన నేపథ్యాన్ని విశ్వనాథ శాస్త్రి పదే పదే గుర్తు చేసుకునే వారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# బీమా చైతన్యం...భవితకు ఆత్మ విశ్వాసం - జూన్ 28...నేషనల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డే




ప్రతి సంవత్సరం జూన్ 28న నేషనల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డేను పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా బీమా రంగంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఈ ప్రత్యేక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో బీమా యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పడం, భవిష్యత్తు ఆర్థిక భద్రత కోసం బీమా అవసరాన్ని తెలియ జేయడం. అనిశ్చితతలతో నిండిన ఆధునిక జీవన విధానంలో బీమా ఒక ఆర్థిక సాధనంగా కాకుండా, కుటుంబాన్ని కాపాడే రక్షణ కవచంగా, మనసుకు భరోసానిచ్చే ఆశాజ్యోతిగా మారింది. బీమా అనేది భవిష్యత్తులో సంభవించే నష్టాలను, ప్రమాదాలను ఎదుర్కొనడానికి ఆర్థిక భద్రతను కల్పించే విధానము. బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి నిర్దిష్టమైన మొత్తం ప్రీమియంగా చెల్లిస్తే, ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఒప్పందంలోని నిబంధనల ప్రకారం బీమా సంస్థ ఆర్థిక పరిహారం అందిస్తుంది. ఇది వ్యక్తిగత స్థాయిలోనే కాదు, కుటుంబం, వ్యవసాయం, వాహనం, ఆస్తి వంటి అనేక రంగాల్లో రక్షణ కల్పిస్తుంది. ఒకవేళ ఆర్థిక నష్టం జరిగినా, అది వ్యక్తి జీవన ప్రమాణాన్ని పూర్తిగా కూల్చి వేయకుండా అడ్డుకుంటుంది. బీమాపై సరైన అవగాహన లేని ప్రజల శాతం భారత దేశంలో ఇంకా అధికంగానే ఉంది. కొందరికి ఇది అవసరం లేదనిపిస్తుంది, మరికొందరికి ఖర్చు లాగా అనిపిస్తుంది. కొంతమంది బీమా పాలసీ తీసుకున్నా, దాని ప్రయోజనాలు ఎలా పొందాలో తెలియదు. ఈ నేపథ్యంలో బీమా అవగాహన దినోత్సవం అత్యంత ప్రాధాన్యంతో కూడుకున్నదిగా నిలుస్తోంది. ఈ రోజును పురస్కరించుకుని ప్రజలకు బీమా రకాలు, వాటి ప్రయోజనాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎలా నష్టపరిహారం పొందాలో వంటి అంశాలపై వివరంగా తెలియ జేయడం జరుగుతుంది. మన జీవితాల్లో అనేక అప్రమత్తతలు ఉండవలసిన అవసరం ఉంది. అనారోగ్యం, ప్రమాదం, పంట నష్టం, వాహన ప్రమాదం, ప్రకృతి విపత్తులు వంటి అనేక సంఘటనలు మనకు ఎదురవుతుంటాయి. ఇవి వచ్చినప్పుడు పెద్ద మొత్తంలో ఆర్థిక భారం ఎదురవుతుంది. అలాంటి సమయంలో బీమా ఉండటం వల్ల ఆ భారాన్ని స్వల్పంగా చేయవచ్చు. ఉదాహరణకు, ఓ చిన్న ఆరోగ్య సమస్యకు ఆసుపత్రి ఖర్చు లక్షల్లో చేరుతున్న తరుణంలో ఆరోగ్య బీమా ఉండటం ఎంతో ఉపశమనంగా మారుతుంది. అలాగే, కుటుంబ పోషకుడు అకస్మాత్తుగా మృతి చెందితే జీవిత బీమా వల్ల కుటుంబానికి ఆర్థికంగా కుంగిపోకుండా ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. బీమా సేవల పరిధి రోజు రోజుకూ విస్తరిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న అన్ని రకాల బీమాలను ప్రజలు తెలుసుకోవడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, వాహన బీమా, గృహ బీమా, ప్రయాణ బీమా, పంట బీమా వంటి అనేక బీమా రకాలున్నాయి. ప్రతి ఒక్కటి ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు రూపొందించ బడ్డది. ప్రతి వ్యక్తి తన అవసరాన్ని బట్టి సరైన పాలసీ ఎంచుకోవాలి. ఇది కేవలం బీమా సంస్థల పక్కనుండి వెళ్లిపోవడం కాదుబీ భవిష్యత్తు కోసం ముందస్తుగా వేసే భద్రతా అడుగు. బీమా రంగం భారత దేశంలో రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి ఉంది. 1818లో ప్రారంభమైన ఈ రంగం 1956లో జీవ సంస్థలన్నింటినీ ఏకీకృతంగా “భారత జీవిత బీమా సంస్థ”గా కలపడం ద్వారా పునర్ వ్యవస్థీకృతమైంది. 1999లో బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ ఏర్పడి, ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించడంతో బీమా మరింత విస్తృతమైంది. ప్రస్తుతం భారత జీవ బీమా సంస్థ, హెచ్.డి.ఎఫ్.సీ జీవ బీమా, ఎస్.బి.ఐ జీవ బీమా, ఐ.సి.ఐ.సి.ఐ ప్రమాద బీమా, న్యూ ఇండియా అష్యూరెన్స్ వంటి సంస్థలు ప్రజలకు విశ్వసనీయంగా సేవలందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా సామాన్యులకు బీమా అందుబాటులో ఉండేలా అనేక ప్రజా పథకాలను అమలు చేస్తోంది. అందులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ప్రజలకు తక్కువ ఖర్చుతో గరిష్ట ప్రయోజనం అందించేలా రూపొందించ బడ్డాయి. ఇవి ప్రత్యేకించి నిరుపేదలకు, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారికి, గ్రామీణ జనాభాకు అండగా నిలుస్తున్నాయి. ఇన్నాళ్లూ సంప్రదాయ పద్ధతుల్లో కొనుగోలు చేసిన బీమా ఇప్పుడు తంత్ర జ్ఞాన ఆధారిత రూపాన్ని సంతరించుకుంది. ఆధార్ ఆధారిత ధృవీకరణతో, చేతి ఫోనులో నుంచే పాలసీలు కొనుగోలు చేయడం, నష్టపరిహారం పొందడం సులభమైంది. పాలసీ బజార్, డిజిట్, ఆకో వంటి మాధ్యమాల ద్వారా బీమా తీసుకోవడం ఎంతో వేగవంతమైన ప్రక్రియగా మారింది. ఇవి కొత్త తరానికి వినూత్నమైన అవకాశం. బీమా ఉండటం ఎంత ముఖ్యమో, దానిని సక్రమంగా ఉపయోగించుకోవడమూ అంతే ముఖ్యం. పాలసీ నిబంధనలు పూర్తిగా చదవడం, అవసరమైన ఆధారాలు సమకూర్చు కోవడం, ప్రమాదం జరిగిన వెంటనే సంస్థకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలు ప్రతీ పాలసీ దారుడికి తెలియాలి. అప్పుడే నష్ట పరిహారం పొందే ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిగా ప్రయోజనం పొందవచ్చు. ఈ నేషనల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డే మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది %–% బీమా ఉండటం అనేది శుభ సూచకం. అది భయానికి కాదు, భరోసాకు సంకేతం. అది వ్యయానికి కాదు, సంక్షేమానికి సూచిక. మన జీవితంలో ఒక్క అవకాశం తప్పితే జీవితం మారిపోతుంది. అలాంటి సంధిలో బీమా మన కుటుంబానికి నమ్మకమైన నీడలాంటిది. ఈరోజు మనకు ఆదర్శనంగా ఉండాలి. మన కుటుంబం భవిష్యత్తు కోసం, మన పిల్లల భద్రత కోసం, అనుకోని సంఘటనల్లో ఆర్థిక పరంగా వెనుక పడకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం మంచి నిర్ణయం. ప్రతి ఒక్కరూ కనీసం ఒక జీవ బీమా లేదా ఆరోగ్య బీమా పాలసీతో తమ భవిష్యత్తును భద్ర పర్చుకోవాలి. అదే నిజమైన తెలివైన నిర్ణయం. బీమా లేదు అంటే భద్రతా లేదు. బీమా ఉన్న చోటే భరోసా ఉంటుంది. కనుక ఈరోజే బీమా గురించి తెలుసుకోండి. మీ అవసరానికి తగిన పాలసీ ఎంచుకోండి. మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని సురక్షితంగా, సంతోషంగా గడపండి.
**రామ కిష్టయ్య సంగన భట్ల ... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అమెరికాతో అణు చర్చలపై ఇరాన్ క్లారిటీ.. మేటర్ మళ్లీ మొదటికి!


అణుచర్చలకు ఒప్పించడం కోసం ట్రంప్ పలు ప్రయత్నాలే చేశారని చెప్పొచ్చు. ఇందులో భాగంగా తొలుత మాటలతో చెప్పారు.. సుమారు ఐదు దశల్లో చర్చలు జరిపారు.. అయినా ఫలితం రాలేదని అంటారు! కట్ చేస్తే... ఇజ్రాయెల్ ని పంపించి, అనంతరం తాను ఎంట్రీ ఇచ్చి చేయాల్సిన డ్యామేజ్ చేశారు. ఇప్పుడు మరోసారి చర్చల ప్రస్తావన తెచ్చారు. ఈ సమయంలో ఇరాన్ స్పందించింది. అవును... అడిగితే పని అవ్వకపోవడంతో, అణుకేంద్రాలను ధ్వంసం చేశారు ట్రంప్! తానేమిటో చూపించాను కాబట్టి ఇక ఇరాన్ చర్చలకు ముందుకు వస్తుందనే ఆశతో ఉన్నారని అంటారు. ఈ సమయంలో ఇరాన్ స్పందించింది. ఇందులో భాగంగా... అమెరికాతో ఎలాంటి అణుచర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని పేర్కొంది. దీంతో... అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ నెక్స్ట్ స్టెప్ ఏమిటనేది ఆసక్తిగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా స్పందించిన ట్రంప్... వచ్చేవారం టెహ్రాన్ తో అణుచర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. అయితే, తాజాగా ఈ విషయంపై స్పందించిన ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. అణుచర్చలపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ఈ విషయంలో అమెరికాతో సమావేశమయ్యే ఆలోచన తమకు లేదని




ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పందించిన అబ్బాస్ అరాగ్చీ... ఇటీవల తమపై జరిగిన దాడులు గణనీయమైన నష్టాన్ని కలిగించాయని అన్నారు. ఇదే సమయంలో... ఇరాన్ అణు కార్యక్రమం పునరుద్ధరణపై అధికారులు అధ్యయనం చేస్తున్నారని వెల్లడించారు. దీంతో.. ఈ విషయం ఆసక్తిగా మారింది. ఇదే సమయంలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ స్పందించారు. ఇందులో భాగంగా... ప్రస్తుతానికి చర్చల టాపిక్ వంటిది ఏమీ లేదని అన్నారు. అయితే, అణు ఒప్పందానికి సంబంధించిన చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ తో మాట్లాడుతున్నామని తెలిపారు. దీంతో... ఇరాన్ ఈ విషయంలో తగ్గకపోవచ్చని.. తిరిగి అణు కార్యక్రమం పునరుద్ధరణపై సీరియస్ గా దృష్టి సారించొచ్చని చెబుతున్నారు. కాగా... ఇటీవల జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. వచ్చేవారం టెహ్రాన్ తో అణుచర్చలు జరుపుతామని, ఈ చర్చలద్వారా అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్ తో ఒప్పందం చేసుకొనే అవకాశం ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే.. అలాంటి ఉద్దేశ్యం తమకు లేదని ఇరాన్ తాజాగా పేర్కొంది.

# సీరియస్ మేటర్... 'భార్యభర్తల మధ్య ట్రంప్ మధ్యవర్తిత్వం వహించరు'!

ప్రధాన అంతర్జాతీయ సంఘర్షణలకు, యుద్ధాలకు తాను మధ్యవర్తిత్వం వహిస్తున్నానని, ముందుముందు వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్న సంగతి తెలిసిందే. అయితే.. సమస్యను తెరవెనుక మీరే సృష్టించి, తెరముందు మీరే ముగించి, మీకుమీరే చప్పట్లు కొట్టుకుంటున్నారనే కామెంట్లూ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పై వినిపిస్తుంటాయి.. అది వేరే విషయం! ఈ క్రమంలో... భారత్ – పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం విషయంలో అమెరికా పాత్ర లేదని, ట్రంప్ ప్రమేయం లేదని ప్రధాని నరేంద్ర మోడీ పబ్లిక్ గా చెప్పినా... ఆ ఇరు దేశాల మధ్య యుద్ధం.. కాదు కాదు.. అణుయుద్ధం జరగకుండా తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకుంటున్నారు. ఇటీవల మోడీ వ్యాఖ్యలతో ఏకీభవించినట్లే ఏకీభవించి.. మళ్లీ మొదటికొచ్చారు. ఇందులో భాగంగా... తాను వరుస ఫోన్ కాల్స్ తో యుద్ధం ముగించానని.. మీరు ఒకరితో ఒకరు పోరాడితే తాము ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకోమని భారత్, పాక్ లకు తేల్చిచెప్పానని అన్నారు. అనంతరం మోడీ తనకు గొప్ప స్నేహితుడని.. పాక్ జనరల్




ఆకట్టుకునే వ్యక్తి అని చెప్పిన ట్రంప్.. వారు కూడా వాణిజ్య ఒప్పందమే కావాలని చెప్పారని పేర్కొన్నారు. ఇక తాజాగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ పేర్కొన్నారు. వ్యక్తిగత దౌత్యం, బలమైన ఆర్థిక పరపతి తన విజయాలకు కారణమని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా మీమ్స్, ట్రోల్స్ హల్ చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోస్ట్ వైరల్ గా మారింది. అవును... ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘర్షణ వచ్చినా దాన్ని తానే ఆపుతున్నానని, తాను 21వ శతాబ్ధపు శాంతి దూతనని, ఇంత చేసినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని సన్నాయినొక్కులు నొక్కుతూ వైరాగ్యపు మాటలు మాట్లాడుతున్న ట్రంప్... భార్యభర్తల గొడవల్లో మాత్రం మధ్యవర్తిత్వం చేయరంట. ఇది అయన చెప్పలేదు.. మీమ్స్ చెబుతున్నాయి! ఇందులో భాగంగా... “వివాహిత జంటల మధ్య వైవాహిక వివాదాలను పరిష్కరించమని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ కు ప్రాంక్ కాల్స్ వస్తున్నట్లు చూపిస్తుంది. దీంతో... కాస్త కోపంగా మారిన ట్రంప్... “నా నంబర్ మీకు ఎవరు ఇచ్చారు?.. నేను భార్యాభర్తల మధ్య మధ్యవర్తిత్వం వహించను!” అని అన్నారు! దీంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మీమ్ వైరల్ గా మారింది.

చురకలు

## సంపాదకీయం

### 'రాబందులు ఉంటాయి జాగ్రత్త'... శశిథరూర్ ని వెంటాడుతున్న కాంగ్రెస్!

కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ సీనియర్ ఎంపీ శశి థరూర్ కు మధ్య గ్యాప్ రోజు రోజుకీ పెరుగుతున్నట్లు కనిపిస్తున్న సంగతి తెలిసిందే! అనధికారికంగా ఆయన బీజేపీ నేత అయిపోయారని కాంగ్రెస్ చెబుతుంటే.. పక్షిగా స్వేచ్ఛగా ఎగరనివ్వాలన్నట్లుగా థరూర్ రియాక్ట్ అయ్యారు. ఈ నేపథ్యంలో థరూర్ 'ఎక్స్' పోస్టులకు కాంగ్రెస్ నేతల నుంచి వరుస సెటైర్లు పడుతున్నాయి. అవును... గత కొన్ని రోజులుగా శశిథరూర్ కి కాంగ్రెస్ పార్టీకి మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో... పార్టీలో తనపై వస్తున్న విమర్శలు, కండిషన్స్ ని ఉద్దేశిస్తూ అన్నట్లు థరూర్ నిన్న 'పక్షిని స్వేచ్ఛగా ఎగరనివ్వాలి' అని అర్థం వచ్చేలా పోస్ట్ పెట్టారు. దీంతో.. 'రాబందులు ఉంటాయి జాగ్రత్త' అంటు కాంగ్రెస్ నుంచి వచ్చిన హెచ్చరిక వైరల్ గా మారింది. వివరాల్లోకి వెళ్తే... గత కొంతకాలంగా ప్రధాని మోడీతో థరూర్ కి కెమిస్ట్రీ బాగా కుదురుతుందనే కామెంట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీయే తనకు తాను పంపేవరకూ థరూర్ చూస్తున్నారనే చర్చా నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రధాని మోడీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఓ కాలమ్ రాశారు. దీనికి స్పందించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు! ఇందులో భాగంగా... 'మాకు దేశమే తొలి ప్రాధాన్యం కానీ.. కొందరికి మాత్రం మోడీనే ప్రాధాన్యం' అంటూ విమర్శలు గుప్పించారు! దీనికి కౌంటర్ గా 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టారు థరూర్. అందులో ఓ పక్షి ఫోటోను షేర్ చేశారు. ఈ సందర్భంగా... 'ఎగరడానికి ఎవరి అనుమతి అడగకు. రెక్కలు నీవి.. ఆకాశం ఎవరి సొంతం కాదు' అనే సందేశాన్ని పంచుకున్నారు. దీంతో... మల్లికార్జున్ ఖర్గే తాజా వ్యాఖ్యలతో పాటు పార్టీలో తనపై వస్తోన్న విమర్శలకు బదులుగానే ఈ పోస్ట్ చేశారని ప్రచారం మొదలైంది. ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. దీనికి కౌంటర్ పోస్టులతో పలువురు నెటిజన్లు విరుచుకు పడుతున్నారు! ఈ నేపథ్యంలో... 'ఎగరడానికి అనుమతి అడగొద్దు. పక్షులు రెక్కలు విరుచుకునేందుకు ఎవరి ఆమోదం అక్కర్లేదు. కానీ, స్వేచ్ఛగా ఎగిరే పక్షి కూడా ఆకాశాన్ని నిశితంగా గమనిస్తూ ఉండాల్సిందే. గద్దలు, రాబందులు ఎల్లప్పుడూ వేటాడుతూనే ఉంటాయి. స్వేచ్ఛ ఎప్పటికీ ఉచితంగా రాదు.. ముఖ్యంగా వేటగాళ్ళు దేశభక్తిని ఈకలుగా ధరించినప్పుడు' అనే పోస్ట్ తాజాగా ఎక్స్ లో దర్శనమిచ్చింది. ఈ పోస్ట్ ను కాంగ్రెస్ సీనియర్ ఎంపీ మాణికం ఠాగూర్ తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. దీంతో.. శశిథరూర్ పోస్ట్ ను ఉద్దేశించే ఠాగూర్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో... బీజేపీ నేతలతో సాన్నిహిత్యాన్ని ఉద్దేశించి తన సహచరుడికి ఇలా చురకలతో కూడిన సూచనలు ఇచ్చి ఉంటారని అంటున్నారు.

## రంగ స్థలానికి వన్నె తెచ్చిన వెంకట రత్నం నాయుడు - జూన్ 28.. వెంకటరత్నం జయంతి

ఆచంట వెంకటరత్నం నాయుడు (1935 జూన్ 28 - 2015 నవంబర్ 25) ఒక ప్రముఖ రంగస్థల నటుడు. తండ్రి ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచే నీతిశాస్త్రంలో శ్లోకాలు, పద్యాలు కంఠస్థం చేసి, స్పష్టమైన వాచికంతో, చక్కటి గాత్రంతో పాడుతుంటే స్కూల్లో ఉపాధ్యాయులు ప్రశంసించేవారు. తండ్రి రంగస్థల కళాకారుడు. అదే వారసత్వంగా ఈయనకు అబ్బింది. గుంటూరు హిందూ స్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి. పాసైన ఆచంట కొంతకాలం ఆయుర్వేద మందులకి రిప్రెజెంటేటివ్‌గా పనిచేసి, వృత్తికీ, ప్రవృత్తికీ సమన్వయం కుదరక వృత్తిని వదులుకొని నాటకాలలో ప్రవేశించాడు. న భూతో న భవిష్యతిగా ప్రదర్శించిన మయసభ ఏకపాత్రాభినయం నాయుడి నట జీవితంలో ఒక మైలురాయి. సాత్విక పాత్రలంటే తామస పాత్రలు ఆయనకి ఎంతో ఇష్టం. ఈలపాట రఘురామయ్య, షణ్ముఖి ఆంజనేయ రాజు, ఎ.వి. సుబ్బారావు, మాధవపెద్ది సత్యం, పీసపాటి నరసింహమూర్తి మొదలైన ఉద్దండులైన 40 మంది నటులంతా ఒక బృందంగా ఏర్పడి తులసీ జలంధర నాటకం ప్రదర్శించారు. డి.వి. సుబ్బారావు (హరిశ్చంద్ర పాత్రధారి) నెలకు 4 నాటకాలు ప్రదర్శించి, కళాకారులకు నెలకి కచ్చితంగా జీతాలిచ్చే వాడట. కేవలం పద్యనాటకమే కాక అనేక సాంఘిక నాటకాల్లో కూడా ఆచంట తమ ప్రతిభా పాటవాలను తెలుగు దేశ ప్రజలకు తెలియ జేశాడు. గుంటూరు నాట్యసమితి ప్రదర్శించిన రామరాజు, నాయకురాలు, అపరాధి వంటి నాటకాలతో రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులను సంపాదించు కున్నాడు. తనకంటూ ఓ ముద్ర నేర్పరుచుకున్న నాయుడి ప్రతిభ చూసిన పలు నాటక సంస్థలు ఆయనకి పౌరాణిక చారిత్రక నాటకాల్లో కూడా ప్రధాన పాత్రలను ఇచ్చి ప్రోత్సహించాయి. ఆంధ్ర లలిత కళాపరిషత్ ప్రదర్శించిన బొబ్బిలి నాటకంలో హైదర్‌జంగ్, తులాభారం నాటకంలో వసంతకుడు, సక్కుబాయి నాటకంలో కాశీపతి, రామాంజనేయ యుద్ధం లో యయాతి, హరిశ్చంద్రలో విశ్వామిత్ర మొదలైన పాత్రలతో విజయ దుందుభి మోగించాడు. శ్రీకృష్ణ రాయబారం, బొబ్బిలి యుద్ధం, రామరాజు, నాయకురాలు అపరాధి, రామాంజనేయ యుద్ధం సక్కుబాయి, హరిశ్చంద్ర,తులసీ జలంధర తదితర నాటకాలలో నటించాడు. కరంకుడు, దుర్యోధనుడు, జలంధర, జరాసంధ, ద్రోణుడు, అశ్వత్థామ, గయుడు, హైదర్‌జంగ్, వసంతకుడు, కాశీపతి, యయాతి, విశ్వామిత్ర, తాంద్ర పాపారాయుడు మొదలైనవి విభిన్న పాత్రలు పోషించాడు. దేనికైనా క్రమశిక్షణ, పట్టుదల, శ్రద్ధ ముఖ్యం అంటారు ఆచంట. నాయుడు సతీసావిత్రిలో ఒరిజినల్ దున్నపోతుమీద వచ్చేవాడట. విజయవాడకి సుమారు 30 కిలో మీటర్ల దూరంలో నున్న ప్రాంతంలో ఒక చిల్డ్రన్ నట శిక్షణాలయం స్థాపించి భావితరాలకు పద్యనాటక కళాకారులను తీర్చిదిద్దాడు. ఆచంట ప్రతిభకు మెచ్చిన అనేక సంస్థలే కాక రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక సన్మానాలు, సత్కారాలతో ఆయనని అభినందించింది. నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేత సన్మానితుడైన ఆచంట వెంకటరత్నం నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి హంస అవార్డు (2000)బి తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు (2002)బి సి.హెచ్.సాంబయ్య స్మారక పురస్కారం (2009)బి ఎన్.టి.ఆర్. రంగస్థల పురస్కారం (2001) తదితర అవార్డులు అందుకున్నాడు. తెలుగు పౌరాణిక నాటక రంగానికి విశేషమైన




సేవలను అందించిన ఆచంట వెంకటరత్నం నాయుడు ఆయన 1935, జూన్ 28 వ తేదీన కృష్ణాజిల్లా, కొండపల్లిలో జన్మించాడు. వెంకటరత్నం నాయుడు, వెంకట నరసమ్మలకు జన్మించి, తన 81వ యేట 2015, నవంబర్ 25, బుధవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెంలో కుమార్తె గృహంలో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## ముళ్ళపూడి నవ్వులలో నిత్య సత్య సందేశం - జూన్ 28...ముళ్ళపూడి వెంకటరమణ జయంతి

తెలుగు సాహిత్యంలో హాస్యాన్ని ప్రబోధకంగా, సామాజికంగా, మానవీయంగా మలచిన సృజన శీలుల్లో ముళ్ళపూడి వెంకటరమణ అగ్రగణ్యులు. నవ్వుల్లోనూ జీవన పాఠాలు, మాటల్లోనూ మానవతా విలువలు నిక్షిప్తమై ఉండేలా ఆయన రచనలు సాగేవి. హాస్యాన్ని అపహాస్యంగా కాక, ఆత్మ విశ్లేషణకు దారితీసే సాధనంగా మార్చిన కళాకారుడిగా వెంకటరమణ చిరస్మరణీయులయ్యారు. 1931 జూన్ 28న తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించిన ఆయన చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. కుటుంబ పోషణ బాధ్యత తల్లిపై పడి, చిన్ననాటి నుంచే జీవితాన్ని సమీపంగా అనుభవించే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజమండ్రిలో బాల్యం, మద్రాసులో విద్యాభ్యాసం సాగినా - చదువు కన్నా జీవితమే ఆయనకు గొప్ప గురువు అయింది. తెలుగు భాష మీద ప్రేమ, సాహిత్యంపై ఆసక్తి ఆయనను రచయితగా తీర్చిదిద్దాయి. వెంకటరమణ రచనా ప్రస్థానం చిన్న కథలతో మొదలై, నవలలు, వ్యాసాలు, బాల సాహిత్యం, సినీ సంభాషణలు తదితర రంగాలకు విస్తరించింది. మానవ సంబంధాల సౌమ్యత, మధ్య తరగతి జీవన విశేషాలు, సమాజపు ద్వంద్వ ధోరణులపై హాస్యమయం అయిన లోతైన వ్యాఖ్యానం ఆయన రచనల విశిష్టత. తేటతెల్లమైన భాష, సునిశితంగా నైసర్గిక ప్రవాహం, పాత్రల సహజత %-% ఇవన్నీ కలగలిసి ఆయన రచనలను అందరికి ఆప్యాయంగా మలిచాయి. 'బుడుగు' అనే చిన్నారి పాత్ర ఆయనకు అజరామర గుర్తింపును తీసుకు వచ్చింది. పిల్లవాడి అమాయకపు దృష్టికోణం ద్వారా పెద్దల ప్రపంచాన్ని అన్వయించడం, వ్యంగ్యంగా కాక తార్కికంగా చూపడం ఆ రచన విశిష్టత. పిల్లలు నవ్వుతూ చదివే కథల్లో పెద్దలకు జీవితాన్ని అర్థం చేసుకునే సందేశాలుండేవి. 'కొసరు కొమ్మచ్చి', 'చింత చిగురు', 'ఇంట్లో పుట్టిన బిల్లు', 'కొత్త జగత్తు', 'అరగంటా అందాల తీన్నార్' వంటి రచనలు కూడా తనదైన హాస్య




చిత్రణకు నిలువెత్తు ఉదాహరణలు. వెంకటరమణ కలమిస్తుగానూ ఖ్యాతి గాంచారు. ముఖ్యంగా 'ఆంధ్రజ్యోతి'లో 'రమణక్క రామాయణం' శీర్షికతో వచ్చిన వ్యాసాలు సామాజిక అంశాలను సరళంగా, వినోదాత్మకంగా సమీక్షించేవి. ఆయన కలం సామాన్యుడి శబ్దానికి ప్రతిధ్వనిలా మారింది. చక్కటి చమత్కారం, వ్యంగ్యం, విలక్షణమైన హాస్య వర్ణన ఆయన శైలిలో అంతర్గీనంగా కలిసి ఉండేవి. ఆనందవాణి, ఆంధ్రభూమి, విశాలాంధ్ర వంటి పత్రికల పాఠకులందరికీ ఆయన పేరు సుపరిచితమైంది. వెంకటరమణ సాహిత్య జీవితంలో బాపు పాత్ర అనన్య సామాన్యం. బాపు బొమ్మలకు వెంకటరమణ పదాలు జోడైనపుడు ఆ కలయిక కళాపరంగా, సాహిత్యపరంగా ఒక కొత్త తరహా శైలిని తెలుగు ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ఇద్దరి అనుబంధం స్నేహానికి, సృజనాత్మకతకు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచింది. వీరిద్దరి కలయిక వల్లే ఎన్నో బాల సాహిత్య రచనలు, బొమ్మల పుస్తకాలు, ముద్రిత రూపాల్లో వెలుగులోకి వచ్చాయి. సినీరంగంలో కూడా ఆయన ప్రభావం అంతే విస్తృతమైనది. బాపు దర్శకత్వంలో రూపొందిన 'ముత్యాల ముగ్గు', 'సీతాకోక చిలుక', 'పెళ్లి పుస్తకం', 'స్వర్ణ కమలం', 'రాధాకృష్ణ', 'అభిలాష' వంటి చిత్రాలకు ఆయన రచనలు, సంభాషణలు హృదయాన్ని తాకేలా ఉండేవి. తెలుగు భాషకు ఒరిగిన సంభాషణలు, ముద్దు ముద్దుగా పలికే పద ప్రయోగాలు ఆయన సంభాషణల్లో ప్రధాన ఆకర్షణ. ఆ సినిమాల్లో భావోద్వేగం, హాస్యం, సంస్కృతి అన్నీ కలగలిసి ఒక సౌందర్యాన్ని సృష్టించేవి. ఆయన రచనల్లో హాస్యం ఎప్పుడూ హుందాగా, పరిమితి కోల్పోకుండా, చింతనకు ఆహ్వానం ఇచ్చేలా ఉండేది. ద్వేషం లేకుండా విమర్శించ గలిగిన తీరే ఆయన రచనా శైలికి ఉమ్మడి లక్షణం. హాస్యం అనేది ఓ జ్ఞాన పరమైన ప్రకటనగా రూపాంతరం చెందుతుంది. ఈ తత్వాన్ని ప్రతిపాదించిన రచయితలలో ఆయన ముందు వరుసలో నిలిచారు. తెలుగు సాహిత్యంలో హాస్యాన్ని తక్కువ చేసి చూడడాన్ని ఆయన రచనలు ఖండించాయి. ఆయన రచన శక్తి - ఒక హాస్యపు పదంతో కన్నీటి కారక సత్యాన్ని కూడా చెప్పగలిగే సామర్థ్యంలో ఉంది. చిన్న కథలు, కాలమ్ వ్యాసాలు, బాల కథలు, సినిమాల సంభాషణలు %-% అన్ని రూపాల్లోనూ ఆయన తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన రచనా సంపద తెలుగుకు ఒక సాంస్కృతిక సంపద. అవి భాషను శుద్ధంగా, సహజంగా వినిపించగలిగే ఉత్కృష్ట నమూనాలు. పాఠకుల హృదయంలో చిరకాలం నిలిచిపోయేలా చేసిన శక్తి ఆయన పదాల్లో, భావాల్లో, హాస్యంలో ఉంది. 2011 ఫిబ్రవరి 24న ఆయన భౌతికంగా కన్ను మూసినా, ఆయన కలం సృష్టించిన సాహిత్యం మాత్రం కాల గమనాన్ని మించి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ముళ్ళపూడి వెంకటరమణ రచయితగా మాత్రమే కాకుండా, ఒక యుగ కర్తగా, తెలుగు హాస్యానికి ఓ అపూర్వ, అపురూప పాత్రధారుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు. తెలుగు పాఠకుల హృదయంలో నవ్వుల వెనక నిగూఢమైన సత్యాన్ని ప్రతిబింబించిన చిరస్థాయి కాంతివంతమైన కలం - ముళ్ళపూడి వెంకటరమణకే సొంతం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## "రాజకీయ దురంధరుడు పాములపర్తి" .... పి.వి. జయంతి సందర్భంగా

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సామరస్య వాతావరణం ఏర్పరుచుకొని పరిపాలన సాగించిన వాడే సమర్థుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ధ ప్రతిష్ఠులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండి పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు.1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు. 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయబీ 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 - జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రిబీ జూలై 1984 - డిసెంబర్ 1984 కేంద్ర హోం శాఖామంత్రిబీ నవంబరు 1984 - ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 - సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 - జూన్, 1988 కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిబీ జూలై 1986 - ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రిబీ జూన్ 1988 - డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రిబీ 1991 మే 29 - 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగాబీ జూన్ 1991 - 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సీఎం పీఠం అధిష్ఠించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్ఠానంతో చర్చించేందుకు ఢిల్లీ - హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ఠ చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలో, టీడీపీ పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తీర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణలు 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్తాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే.1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ఠ పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసింది పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవీ వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ల పదవీకాలంలో అనేక అవినీతి



ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 1968-74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాదం మయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయితీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన. పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి,19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసీఆర్, తెలుగు జాతి మహోన్నత వ్యక్తికి ఇలా తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# రుణానికి ఎదురుచూపులు

జగిత్యాల: స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం అందించనున్న రుణాల మంజూరు ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లినట్లయింది. దీని కింద సబ్సిడీలో స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. ఇందులో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.4 లక్షలు చొప్పున కుటుంబంలో ఒక్కరికే రుణం అందించేలా పథకం రూపొందించింది. వ్యవసాయ రంగంలో 7 అంశాలు, పశుపోషణ విభాగంలో మరో 8, వ్యాపార కేటగిరిలో 75, మొత్తం కలిపి 90 రకాల వ్యాపారాలు చేసేవారికి రుణాలు మంజూరు చేయాలని సంకల్పించింది.



**వెల్లువెత్తిన దరఖాస్తులు**

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ తదితర అన్ని వర్గాలవారు వేల సంఖ్యలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మొదటి విడత కింద రుణాలు అందించేందుకు మౌఖిక పరీక్ష నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఈ క్రమంలో మొదటగా రూ.50 వేలు, రూ.లక్ష కేటగిరీల్లో వచ్చిన దరఖాస్తుదారులకు అందించేందుకు వడపోత చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారు.

**తాత్కాలికంగా నిలిపివేత**

ఈ పథకం కింద మంజూరైన రుణాలు చేతికి వస్తాయని లబ్ధిదారులు ఎదురుచూస్తున్న తరుణంలో మంజూరు ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి సైతం ఎలాంటి స్పష్టత లేదు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రుణ మంజూరు ప్రక్రియను వాయిదా వేసినట్లు సమాచారం. అత్యధిక సంఖ్యలో దరఖాస్తులురాగా, విడతల వారీగా అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో కొంతమందికి రుణాలు మంజూరు చేస్తే వ్యతిరేకత ఎదురవుతుందనే భావనతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం.

# ఉపాధి హామీ పనులు ఇక చాలు!

ఆదిలాబాద్ : గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు కేటాయించిన లేబర్ బడ్జెట్ లక్ష్యం పూర్తయిపోయింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై వడు నెలలైనా పూర్తి కాకముందే ఏకంగా 145 శాతం పని దినాలు నమోదయ్యాయి. సాధారణంగా పనిదినాల లక్ష్యం ఏటా వేసవిలో ఫిబ్రవరి, మార్చి నెలలో పూర్తవుతుంది. ఈ సంవత్సరం కేంద్రం పనిదినాల్లో సగానికి పైగా కోత విధించింది. తొలిసారిగా వర్షాకాలంలోనే లక్ష్యం దాటిపోయింది. పనిదినాల పొడిగింపుపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాక జిల్లాలో పనులు తగ్గించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**10.92 లక్షల పనిదినాలు అధికం**

కేంద్రప్రభుత్వం ఏటా రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి పనులు, కూలీల హాజరును బట్టి పనిదినాలను కేటాయిస్తోంది. అందుకు అనుగుణంగా జిల్లా వారీగా లక్ష్యం విధిస్తారు. గతేడాది కొన్ని జిల్లాల్లో లక్ష్యానికి మించి ఉపాధి పనులు జరగడంతో కేంద్ర ప్రభుత్వం కేంద్ర బృందాలను పంపించి విచారణ చేయించింది. క్షేత్రస్థాయిలో కూలీలు వాస్తవంగా పనులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీసింది. కొన్ని పనులు కేంద్రప్రభుత్వం సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా జరగడం లేదని తేలడంతో రాష్ట్రవ్యాప్తంగా పనిదినాల్లో భారీగా కోత విధించింది. జిల్లాలో గతేడాది 54లక్షల పని దినాలు జరిగాయి.. ఈసారి కేవలం రూ.23.81లక్షల పనిదినాలను మాత్రమే కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే 34.73లక్షల పనిదినాలు నమోదయ్యాయి. అంటే లక్ష్యం కంటే 10.92 లక్షల పనిదినాలు ఎక్కువగా జరిగాయి.

**పొడిగింపుపై రాని స్పష్టత**

పనిదినాలలో రాష్ట్ర లక్ష్యం 6.50కోట్ల పనిదినాలు ఉండగా ఇప్పటికే 4.50 కోట్లకు పైగా పనిదినాలు జరిగాయి. కొన్ని జిల్లాల్లో లక్ష్యం మించిపోగా, మరికొన్ని జిల్లాల్లో లక్ష్యం చేరువ చేరుకోలేదు. దినసరి కూలీ రూ.307కు పెంచడం, జిల్లాలో కూలీల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఆశలతో ఈసారి జిల్లాలో లక్ష్యం కంటే అదనంగా 10.92లక్షల పనిదినాలు ఎక్కువగా నమోదయ్యాయి. ఏప్రిల్ 18 వరకు శ్రామికులకు చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత జరిగిన పనులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ఆరంభం కావడంతో కూలీలు ఉపాధి పనులు మానేసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. అక్టోబరు, నవంబరు వరకు వ్యవసాయ పనులు కొనసాగుతాయి. ఆ తర్వాత డిసెంబరు నుంచి కూలీలు తిరిగి ఉపాధి పనులకు వెళ్తారు. ఆర్థిక సంవత్సరం మరో తొమ్మిది నెలలు ఉండటంతో కేంద్రప్రభుత్వం నుంచి పనిదినాలు పెంచుతూ ఉత్తర్వులు వస్తే తప్ప కార్మికులకు పనులు చూపించే పరిస్థితులు లేవు.కేంద్రం పెంచితేనే.. రవీందర్ రాథోడ్, డీఆర్డీఓ

జిల్లాలో ఈసారి కేటాయించిన లక్ష్యానికి మించి పనిదినాలు నమోదయ్యాయి. వనమహోత్సవం పనులకు తప్పించి కూలీలకు పనులు తగ్గించాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటిదాకా పనులు చేసిన శ్రామికులందరికీ చెల్లింపులు జరుగుతాయి. కేంద్రం లేబర్ బడ్జెట్ పెంచితే అందుకు అనుగుణంగా పనులు కల్పిస్తాం.

# సర్కారు ప్రోత్సాహం.. అన్నదాత ఉత్సాహం

బెజ్జూరు: సాధారణంగా దేశంలో వంటనూనెల వినియోగం ఎక్కువ. విదేశాలనుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. ఆయిల్ పామ్ సాగుతో విదేశాలకు ఎగుమతులు చేస్తూ.. మలేషియా వంటి దేశాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. తెలంగాణలోనూ స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం దీని సాగుపై ప్రోత్సహిస్తోంది. పంట విస్తీర్ణం పెంచడానికి రాయితీలు, మెలకువలు, ప్రోత్సాహకాలు అందిస్తూ రైతులను చైతన్యపరుస్తున్నారు. అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తుండటంతో.. జిల్లాలోనూ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. జిల్లాలో ఏటా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈఏడాది వెయ్యి ఎకరాల లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటికే 120 ఎకరాల్లో మొక్కలు నాటారు. 2022-23లో 1100 ఎకరాలకు 470, 2023-24లో 1000కి 520, 2024-25లో 700కు 329 ఎకరాల్లో సాగవుతోంది. రెబ్బెన, పెంచికల్‌పేట్ మండలాల్లో మొదటి సంవత్సరంలో సాగు చేసిన ఆయిల్‌పామ్ కోత దశకు వచ్చింది. సిర్పూర్ డివిజన్‌లోనే ఎక్కువగా సాగవుతుండగా.. ఇందిరా జల సౌర గిరివికాసం అమలైతే ఆసిఫాబాద్ డివిజన్‌లోనూ సాగు పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పలు రాయితీలు..**

ఆయిల్‌పామ్ సాగు రైతులకు 90శాతం రాయితీతో ప్రభుత్వమే మొక్కలను అందిస్తుంది. ఒక మొక్క విలువ రూ.193 కాగా రైతు రూ.20 చెల్లిస్తే చాలు. అయిదు ఎకరాల్లోపున్న వారికి బిందు సేద్యంపై బీసీలకు 90 శాతం, 5-12.50 ఎకరాల వరకు ఉన్న వారికి 80 శాతం, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీపై పరికరాలను సైతం అందజేస్తారు. ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్ల వరకు అందజేస్తారు. దీంతోపాటు ఆయిల్‌పామ్ సాగులో వివిధ అంతర్గత పంటలు వేసుకునే అవకాశం ఉంది.

**మంచి ఆదాయం**

సాగు చేసిన నాలుగో సంవత్సరం నుంచే మొక్కల నుంచి గెలలు వస్తుంది. దాదాపు 4-35 సంవత్సరాల వరకు దిగుబడులు వస్తాయి. ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వచ్చే అవకాశాలుంటాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.19,200 ఉంది. ఎకరానికి రూ.1.20 లక్షలు రాగా రూ.20 వేలు ఖర్చులకు పోను రూ.లక్ష మిగులుతుందని అధికారులు చెబుతున్నారు. కేటాయించిన సంస్థనే మార్కెట్ సదుపాయం కల్పించి పంటను కొనుగోలు చేస్తుంది. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేస్తుంది.

# వరదొస్తేనే వరప్రదాయనికి జలకళ



జగిత్యాల : ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన శ్రీరామసాగర్ ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయి నీటినిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు తగ్గిన ప్రభావం మనపై అధికంగా పడనుంది. వానాకాలం సీజనులో కీలకమైన జూన్ నెల చివరకు వస్తున్నా ఎస్సారెస్పీలోకి ఆశించినట్లుగా వరద రాలేదు. ఈ నేపథ్యంలో జులై 1న మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరిపైగల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తనుండటంతో ఎస్సారెస్పీలోకి వచ్చే వరద నీటిపైనే సాగు భవితవ్యం ఆధారపడనుంది.

**మరమ్మతులు ముఖ్యమే..**

ఈ వానాకాలంలో 12.44 లక్షల ఎకరాల్లో ఆహార, 92 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లోనూ సగటు వర్షపాతం నమోదైతే 9.60 లక్షల ఎకరాలతో వరి ప్రధాన పంటగా తదుపరి పత్తి, మక్క, పసుపు పంటలు ఉ ఒడనున్నాయి. అయితే చివరి ఆయకట్టుకు నీరుపారేలా కాలువలు, తూములు, డ్రాపులు తదితరాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టుల నుంచి అన్ని చెరువుల్లోకి నీటిని తరలించే తూముల నిర్మాణం, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేస్తే పరోక్షంగానూ భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగి పైర్ల సాగుకు ఆసరాగా ఉంటుంది.

**బాబ్లీ నుంచి మన వాటా ఎంతంటే..**

శ్రీరామసాగర్ ప్రాజెక్టు అంతర్భాగంలో, బ్యాక్ వాటర్ నిల్వ ప్రాంతంలో గోదావరిపై మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టును నిర్మించింది. దీనిపై తెలంగాణ రాష్ట్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం తీర్పు ప్రకారం ఏటా జులై 1న మహారాష్ట్ర బాబ్లీగేట్లను ఎత్తి నాలుగు మాసాలపాటు వచ్చిన వరద నీటిని వచ్చినట్లే దిగువ ఎస్సారెస్పీలోకి వదలాలి. తిరిగి అక్టోబరు 28న బాబ్లీ గేట్లను మూసివేసి మిగిలిన ఎనిమిది మాసాల్లో వచ్చే 2.74 టీఎంసీల నీటిని మహారాష్ట్ర వినియోగించుకోవాలి. ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాల నిమిత్తం వేసవిలో 0.60 టీఎంసీల నీటిని బాబ్లీనుంచి ఎస్సారెస్పీలోకి విడుదల చేయాలి.

**వరద నీరే ఆధారం**

ఎస్సారెస్పీలోకి 2021 వర్షాకాలంలో 678 టీఎంసీలు, 2022 వర్షాకాలంలో 595 టీఎంసీలు, 2023లో 209 క్యూసెక్కులు, 2024లో 298 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరింది. కాగా ప్రస్తుతం ఎగువన వర్షాల్లేక ఎస్సారెస్పీలోకి అత్యంత పరిమితంగానే ఇన్‌ఫ్లో ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లెత్తితే కొంతనీరు వచ్చే అవకాశముండగా గోదావరి పరీవాహక ప్రాంతంలో సమృద్ధి వర్షాలు కురిస్తేనే శ్రీరామసాగర్ నిండే అవకాశం ఉంటుంది. 2023, 2024 వానాకాలాల్లో ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా కొంత నీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయగా ప్రస్తుతం ఎల్లంపల్లిలోనూ నీరు తక్కువగానే ఉండటంతో ఎత్తిపోసే అవకాశం లేదు. ఎగువన వర్షాల్లేకున్నా ఎస్సారెస్పీ దిగువన వర్షాలు కురిసి ఎల్లంపల్లిలోకి నీరొస్తే మున్ముందు ఎత్తిపోతలను చేపట్టి నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలను, చెరువులు, కుంటలను నింపవచ్చు, వరదకాలువద్వారా కొంతనీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసే వీలుకూడా ఉంటుంది. తద్వారా పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు జల అభయం కలుగుతుంది.

శ్రీరామసాగర్ నిల్వ సామర్థ్యం : 80.501 టీఎంసీలు
ప్రస్తుతం నీటినిల్వ : 14.451 టీఎంసీలు
ఇప్పటివరకు వచ్చిన నీరు : 2.946 టీఎంసీలు
ప్రస్తుత ఇన్‌ఫ్లో : 1,693 క్యూసెక్కులు
ఎల్ఎండీ ఎగువన ఆయకట్టు - 4,42,920 ఎకరాలు
ఎల్ఎండీ దిగువన ఆయకట్టు - 5,05,720 ఎకరాలు

# నకిలీ విత్తు.. నిఘాతోనే చిత్తు



జగిత్యాల : జిల్లాలో వానాకాలం సాగు మొదలైన క్రమంలో పల్లెల్లో విత్తనాలు, ఎరువుల అమ్మకాలు జోరందుకున్నాయి. 4.34 లక్షల ఎకరాల్లో జిల్లా రైతులు అన్ని రకాల సాగుచేసే అవకాశముండగా.. నకిలీ పంట ఉత్పాదకాలు కర్షకులకు చేరకుండా అధికారులు గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది.

**గత మోసాలపై కనువిప్పు కలిగితేనే..**

జిల్లాలో గత పంట కాలాల్లో పెద్దఎత్తున నకిలీ సేంద్రియ ఎరువులు పట్టుబడ్డాయి. అయితే గుట్టుగా చాలా రకాలైన నకిలీ పంట ఉత్పాదకాలు రైతులకు చేరి నిండా ముంచుతున్నాయి. వానాకాలంలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతుండగా.. ఇదే అదనుగా మోసపూరిత విత్తనాలను అన్నదాతలకు అంటగడుతున్నారు. వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రమే తమ దుకాణాలు, గోదాముల నుంచి బిల్లులపై విక్రయాలు జరపాల్సి ఉంది. అయితే కొంతమంది ఎలాంటి బిల్లులు లేకుండా నేరుగా విక్రయిస్తున్నారు. మరోవైపు ఆయా సంస్థల ప్రతినిధులు రైతులనుంచి అడ్వాన్సు తీసుకొని సేంద్రియ ఎరువు బస్తాలను వారి ఇళ్ల వద్దకే సరఫరా చేస్తున్నారు.

**అయోమయంలో అన్నదాతలు**

మిశ్రమ ఎరువులు, జింకు సల్ఫేట్, వర్మి కంపోస్టు, బయో ఫర్టిలైజర్స్, పోషక మందుల పేరిట మోసపూరిత ఉత్పత్తులను రైతులకు అంటగడుతున్నారు. కొన్నిచోట్ల నకిలీ పత్తి, మిరప, కూరగాయల విత్తనాలు, కలుపు నివారణ రసాయనాలనుసైతం నేరుగా విక్రయిస్తున్నారు. రైతులు ప్రశ్నిద్దామంటే బిల్లులు వంటివేవీ లేకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నారు. కనీసంఅధికారులకు ఫిర్యాదు చేద్దామన్నా విక్రయించిన వారి ఆచూకీ లేదు.


**తెలిసినా పట్టింపులేదు**

వ్యవసాయశాఖ అనుమతించిన దుకాణంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయనందునా సదరు నమూనాలను పరీక్షకు పంపలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఏఈవోలు.. అన్నదాతలను అప్రమత్తం చేసి నకిలీ ముఠా అమ్మకాలను అరికట్టాల్సి ఉంది. అలాంటివి అమ్మినవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తేనే రైతులకు మేలు జరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామాల్లో నేరుగా కొనొద్దు**

రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పోషకాల మిశ్రమాలు తదితర అన్నింటినీ వ్యవసాయశాఖ అనుమతించిన దుకాణాల్లోనే బిల్లులపై కొనాలి. బిల్లు లేకుండా నేరుగా విక్రయించే ఎలాంటివి కొనవద్దు. గ్రామాల్లో అడ్వాన్సు బుకింగులు, అమ్మకాలపై తగిన సమాచారమిస్తే పట్టుకుని వారిపై కేసులు నమోదు చేయించేలా చూస్తాం.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# లెక్కల్లోనే మొక్కలు.. లక్ష్యం ముక్కలు



మోత్కూరు : పురపాలిక కేంద్రాలకు వచ్చే రహదారులు పచ్చదనంతో వెల్లివిరియాలని 'పట్టణ హరితహారం' కార్యక్రమాన్ని నాలుగేళ్ల క్రితం చేపట్టింది గత ప్రభుత్వం. అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. రూ.లక్షలు ఖర్చుచేసి చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ లేక మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. జిల్లాలోని ఆరు పురపాలికల్లో అవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలించగా పలు అంశాలు వెలుగుచూశాయి.భువనగిరి పట్టణంలో ఇప్పటివరకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి పట్టణంలోని ఎనిమిది అంతర్గత రహదారులకు ఇరువైపులా 53,080 మొక్కలు నాటినట్లు పురపాలక సంఘం రికార్డుల్లో నమోదై ఉంది. నాటిన మొక్కల్లో 87 శాతం బతికి ఉన్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా 3000 మొక్కలను నాటినట్లు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. మున్సిపల్ కమిషనర్ రామలింగంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎండిన మొక్కల స్థానంలో జులై నెలలో మొక్కలను నాటుతామని, సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

చౌటుప్పల్ పరపాలిక పరిధిలో నాలుగేళ్ల క్రితం జాతీయ రహదారికి ఇరువైపులా లక్కారం నుంచి లింగోజిగూడెం వరకు కోనోకార్పస్ మొక్కలు నాటారు. పట్టణంలో ఉపరితల వంతెన నిర్మాణం కోసం మూడు నెలల క్రితం 1.80 కి.మీ. పొడవునా నాటిన మొక్కలను నరికివేశారు. చిన్నకొండూరు రోడ్డులో మల్లన్నగుడి నుంచి పెట్రోల్‌బంక్ వరకు ఇరువైపులా మొక్కలు మూడేళ్ల క్రితం నాటారు. వాటిలో సగమే బతికాయి. వలిగొండ రోడ్డుకు రెండేళ్ల క్రితం ఇరువైపులా నాటిన మొక్కల్లో సగం మాత్రమే ఉన్నాయి.ఆలేరు పురపాలికలో గతేడాది పట్టణ హరితహారంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రెండు వేల మొక్కలు నాటారు. నీరు అందించకపోవడం, సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అనేక మొక్కలు ఎండిపోయాయి. యాదగిరిగుట్ట పురపాలికలోని వంగపల్లి, రాజాపేట, మల్లాపురం రోడ్ల వెంట రూ.5 లక్షలు ఖర్చుచేసి 50 వేల మొక్కలను రెండు పర్యాయాలు నాటారు. అధికారులు నిర్లక్ష్యం వహించడంతో 30 వేలకు పైగా మొక్కలు ఎండిపోయాయి. మోత్కూరు పురపాలిక పరిధిలోని భువనగిరి, తిరుమలగిరి, నార్కట్‌పల్లి, గుండాల రహదారులకు ఇరువైపులా 1,400 మొక్కలు నాటారు. రూ.1.70 లక్షలు ఖర్చుచేసి ఘట్‌కేసర్ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి నాటారు. మోత్కూరు నుంచి భువనగిరి రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలన్నీ తొలగించారు. గతేడాది మళ్లీ నాటారు. ప్రతీ ఏడాది జూన్ మాసంలో ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ నాటుతున్నారే తప్ప వాటిని సంరక్షించే చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా... వానలు ప్రారంభం కాగానే మళ్లీ మొక్కలు నాటించి సంరక్షణ చర్యలు చేపడతామన్నారు.

# అతివలకే ప్రాధాన్యం

సూర్యాపేట : మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వారికి వానాకాలం, యాసంగికి సంబంధించి ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలు కేటాయించింది. ఐకేపీ కొనుగోళ్లలో కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. తద్వారా వారికి కమీషన్ పొందుతున్నారు. రైతులకు, రైస్ మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. 2024-25 యాసంగి సీజన్‌లో 50 శాతం మేరకు వారికే కేటాయించారు. గతంలో 80-90 శాతం సహకార సంఘాల ఆధ్వర్యంలోనే నడవగా మిగతావి ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరిగేవి. కొద్ది సంవత్సరాలుగా మహిళలకే ఎక్కువ కేంద్రాలను కేటాయిస్తున్నారు.

**సమగ్ర శిక్షణ..ప్రణాళిక**

గ్రామ సమైఖ్య సంఘాల ద్వారా ముగ్గురు నుంచి ఆరుగురు సభ్యులు కలిసి ఒక్కో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కొనుగోళ్లను సమర్థంగా చేపట్టేందుకు ముందస్తుగా వీరికి శిక్షణ ఇచ్చారు. తొలుత సంఘాల సభ్యులు కమిటీ వేసుకుని ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారు. ఒకరు లారీలు చూసుకోవడం, మరొకరు ధాన్యం తూకం వేయడం, మరొకరు గన్నీ సంచులు లెక్కలు చూడటం, రైతుల వరుస క్రమం చూడటం వంటివి నిబద్ధతతో నిర్వహించారు. ఇది కాకుండా మహిళలు, రైతులు కలిసి మరో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు.



కేంద్రాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులును ఈ కమిటీ తెలుసుకుని చర్యలు తీసుకునేవారు.

**సఫలీకృతులయ్యారు: - అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట**

ధాన్యం సేకరణలో మహిళలు ఈసారి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తిచేశారు. కొనుగోలు దగ్గరి నుంచి మిల్లులకు తరలించే వరకు ప్రణాళిక ప్రకారం నడుచుకొన్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా, రైతుల వద్ద నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా సఫలీకృతులయ్యారు.

**అడ్డంకులను అధిగమించి కొనుగోలు: - ఉప్పుల పద్మ, మూడో సంఘబంధం అధ్యక్షురాలు, తుమ్మలపెన్‌పహాడ్**

కొనుగోలు ప్రారంభంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. వరుసగా కురిసిన వర్షాలు, గన్నీసంచులు, లారీల కొరతతో ఇక్కట్లను ఎదుర్కొన్నాం. అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి 28వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగలిగాం. విక్రయించిన 560మంది రైతుల ఖాతాల్లో బిల్లులు జమయ్యాయి. తుమ్మలపెన్‌పహాడ్, బోట్యాతండా, దాచారం నుంచి రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. హమాలీలు, అధికారులు, రైతులు చక్కగా సహకారం అందించారు.

# కొత్త కార్డుదారుల పరేషాన్!

మేళ్లచెరువు : గంపెడాశలతో కొత్త ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి అనుభవంగా నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను ఆహ్వానించిన విషయం విదితమే. ఇందులో మిగతా సంక్షేమ పథకాల కంటే.. కొత్త ఆహార భద్రత కార్డుల కోసమే అధిక దరఖాస్తులందాయి. నిన్నా మొన్నటి వరకు వాటి పరిశీలనే జరగలేదు. మళ్లీ మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో.. ఆయా కేంద్రాలను జనం సంప్రదించారు. ఆ దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల శాఖ వాటిని పరిశీలించింది. కొత్త కార్డులను మంజూరు చేసింది. ఈ సంతోషంతో.. కార్డుదారులు రేషన్ డీలర్ల వద్దకు పరుగులు తీయగా.. వీరందరికీ జూన్ నెల రేషన్ కోటా రాలేదని డీలర్లు చెప్పేశారు. ఇదే కాదు.. జులై, ఆగస్టు నెలల కోటా కూడా రాదని తేల్చి చెప్పేయడంతో.. చేసేదేమీ లేక వేల మంది కార్డుదారులు నిరాశతో ఇంటిదారి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

**నాడు అలా..:**

సుదీర్ఘకాలం తర్వాత 2018లో భారాస ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. దరఖాస్తులు ఆహ్వానించింది. వాటిలో 2021 నాటికి కొందరికి మాత్రమే అధికార యంత్రాంగం ఆహార భద్రత కార్డులు పంపిణీ చేసి చేతులు దులుపుకొంది. అప్పటికి కుటుంబాల్లో చనిపోయిన వారి పేర్లను ఉన్న కార్డుల్లో తొలగించినప్పటికీ.. పెరిగిన సభ్యుల సంఖ్యను మాత్రం నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులు అందుకోలేని పరిస్థితి.

**నేడు ఇలా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల ఆహార భద్రత కార్డులు ఉండగా, 3,24,222 లక్షలు సూర్యాపేట జిల్లాకు సంబంధించినవే. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు వరకు కూడా కుడి, ఎడమగా కార్డుల సంఖ్య ఇదే. ప్రజా పాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం దాదాపు 90 వేల దరఖాస్తులు అందాయి. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే.. తమ కుటుంబ సభ్యుల్లో కొందరి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చాలని కోరుతూ దాదాపు 15 వేల దరఖాస్తులందాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే సరిపడా రేషన్ అందింది. కొత్త కార్డులు మంజూరైన వారికి రేషన్ అందలేదు. జూన్ నెలలోనే మూడు నెలలకు సరిపడా.. అంటే ఆగస్టు వరకు రేషన్ బియ్యం ఇచ్చేశారు. ఇప్పుడు కొత్త కార్డుదారులు రేషన్ బియ్యం అందుకోవాలంటే.. సెప్టెంబరు వరకు ఆగాల్సిందేనని రెవెన్యూ అధికారులు, డీలర్లు పేర్కొంటుండడం గమనార్హం.

**రెండు నెలలు ఆగాలన్నారు - ప్రవీణ్‌రెడ్డి**

గతంలో మా తల్లిదండ్రుల కార్డులో నా పేరుంది. ఆ కార్డులో నా పేరు తొలగించాక.. ఇప్పుడు నేను, నా భార్య, ఇద్దరు పిల్లల పేర్లతో కొత్త రేషన్ కార్డు మంజూరైంది. డీలరు దగ్గరకు బియ్యం కోసం వెళ్లా. రేషన్ కోటా మా కార్డు పేరుతో రాలేదన్నారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన కోటా వివరాలను మే నెలలోనే పంపించారట. అందుకే సెప్టెంబరు వరకు ఆగాలన్నారు. కార్డు మంజూరైనా మూడు నెలల రేషన్ దక్కలేదు.

చురకలు



## ఛార్జింగ్‌లో జాప్యం ఉండదిక!

హైదరాబాద్: పెరుగుతున్న విద్యుత్తు వాహనాలకు తగ్గట్టుగా ఈవీ ఛార్జింగ్ పాయింట్లకు వేగవంతంగా కనెక్షన్ల మంజూరుపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి పెట్టింది. కేటగిరి-9 కింద కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఛార్జింగ్ ఆపరేటర్ల ఫిర్యాదుల నేపథ్యంలో డిస్కం ఇకపై ప్రతి వారం సమీక్ష చేయాలని నిర్ణయించింది. ఆ వారంలో ఎన్ని కనెక్షన్లు మంజూరు చేశారు? పెండింగ్‌లో ఉండటానికి కారణాలు ఉన్నాయా? అంటూ ఇటీవల డిస్కం సమీక్షించింది. ఇప్పటివరకు సిటీలోని 9 సర్కిళ్ల పరిధిలో 271 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 218 ఈవీ పాయింట్లకు కనెక్షన్లు కావాలని దరఖాస్తు చేసుకోగా.. సిటీలోనే 117 వరకు ఉన్నాయి. విజయవాడ, బెంగళూరు హైవేల



మార్గంలోని కనెక్షన్లు కూడా కలిపి వీటి సంఖ్య 159గా ఉంది.

**పాతబస్తీలో అత్యల్పంగా...**

హైదరాబాద్ సౌత్ పరిధిలోకి వచ్చే పాతబస్తీలో అత్యల్పంగా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు 18 ఉండగా.. కొత్తగా ఏర్పాటుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. బంజారాహిల్స్ సర్కిల్‌లో ప్రస్తుతం 25 ఉండగా కొత్తగా 8 రాబోతున్నాయి.

**అత్యధికంగా..**

హబ్సిగూడ సర్కిల్లో ప్రస్తుతం 50 ఛార్జింగ్ పాయింట్లు ఉండగా కొత్తగా 18బీ మేడ్చల్‌లో ప్రస్తుతం 46 ఉండగా కొత్తగా 7, సైబర్‌సిటీ సర్కిల్లో ప్రస్తుతం 33 ఉండగా.. కొత్తగా 20 ఛార్జింగ్ పాయింట్లు రానున్నాయి.

## జలమండలికి బకాయిల భారం

హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని అందిస్తున్న జలమండలి బకాయిల భారంతో సతమతమవుతోంది. సుమారు రూ.3,000 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. వీటి వసూలుకు జలమండలి చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడంలేదు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి వసూలు కావాల్సిందే అత్యధికంగా ఉన్నాయి. బల్క్ కాలనీల బకాయిలతోపాటు వాణిజ్య కనెక్షన్ల నుంచి భారీ మొత్తంలో వసూలు కావాల్సి ఉంది. మొండి బకాయిల వసూలుపై జలమండలి చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడంలేదు.



**అవకాశం ఇచ్చినా..:** గతేడాది వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం అమలు చేసినా స్పందన నామమాత్రంగా ఉంది. పరిశ్రమలు నుంచి వసూలు కావాల్సింది రూ.282 కోట్లు ఉన్నా వీటిలో మూతపడినవి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొండి బకాయిల వసూలుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశంపై జలమండలి తర్జనభర్జన పడుతోంది. జలమండలికి నెలకు రూ.130 కోట్ల ఆదాయం వస్తోంది. వేతనాలు, ఇతరత్రా ఖర్చుల రూపంలో నెలకు రూ.260 కోట్లు వ్యయం అవుతోంది. రాబడి, వ్యయాల మధ్య సుమారు రూ.130 కోట్ల మేర అంతరం ఏర్పడుతోంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. కనీసం బకాయిలైన వసూలైతే కొంతమేర ఉపశమనం ఉంటుందని జలమండలి భావిస్తున్నా నెరవేరడం లేదు.

## బల్దియాలో ఇంజినీర్ల కుర్చీలాట

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో విభేధాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుత ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)పై సీనియర్ ఇంజినీర్లు పురపాలకశాఖకు ఫిర్యాదు చేయగా.. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీర్ల సంఘం కూడా.. అదే విషయమై పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తికి లేఖ రాసింది. అడ్డదారిలో పదోన్నతి పొంది నాలుగు కీలక పోస్టులు చేజిక్కించుకున్నారంటూ ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డిపై విమర్శలు చేసింది. దాదాపు ఆరు నెలలుగా జీహెచ్‌ఎంసీలో ఈ గందరగోళం నడుస్తోంది. ఇంజినీరింగ్ ఉన్నతాధికారులంతా.. నిలిచి పోయిన పదోన్నతులు, పదవుల చుట్టూనే తిరుగుతున్నారు. హెచ్-



సిటీ పేరుతో తలపెట్టిన రూ.7వేల కోట్ల పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని, రూ.600కోట్ల వరద నాలాల నిర్మాణాన్ని, రహదారుల నిర్వహణ, ఇతరత్రా ప్రాజెక్టులను గాలికొదిలేశారు. వర్షాకాల సన్నద్ధతపైనా చేతులెత్తేశారు. చివరి నిమిషంలో హైడ్రా ఆ బాధ్యతను తీసుకుంది. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగంలో నెలకొన్న సమస్యను పరిష్కరించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఈఎన్‌సీపై రచ్చ..**

జీహెచ్‌ఎంసీలో ప్రాజెక్టులు, పరిపాలన విభాగం చీఫ్ ఇంజినీరుగా, ఎంఆర్‌డీసీఎల్‌లో సీఈగా, ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిపై తాజాగా ఇంజినీర్ల సంఘం పురపాలకశాఖ కార్యదర్శికి లేఖ రాసింది. "2018 నాటి సీనియారిటీ జాబితా ప్రకారం కోటేశ్వర రావు, నర్సింగ్‌రావు, సహదేవ్‌రత్నాకర్, ప్రవీణ్‌చంద్ర, దత్తుపంత్, విశ్వనాథరాజు తర్వాత ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డి పేరు ఉంటుంది. అయినప్పటికీ.. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి ఆయన పదోన్నతి తీసుకున్నారు" లేఖలో పేర్కొంది. మరోవైపు సీనియారిటీ జాబితాలో ముందున్న తనకే ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ పోస్టు దక్కాలని ఎస్‌ఎన్‌డీపీ ముఖ్య ఇంజినీరు కోటేశ్వరరావు సైతం సర్కారుకు లేఖ రాశారు.

# కాజేసేది.. ఫ్రీజ్ చేయించేది వారే!



హైదరాబాద్: మహానగరంలో మాయగాళ్లు కొత్త తరహాలో సొమ్ము కొట్టేస్తున్నారు. ఇటీవల నారాయణగూడలో పచారీ దుకాణం వద్దకు ఓ యువకుడు వచ్చాడు. తనకు నగదు ఇస్తే యూపీఐ ద్వారా తిరిగి బదిలీ చేస్తానన్నాడు. ప్రతిఫలంగా రూ.1000కి రూ.100 కమీషన్ ఇస్తానని చెప్పటంతో వ్యాపారి అంగీకరించాడు. అతడు రూ.33 వేలు ఫోన్‌పే నుంచి పంపాడు. రెండు గంటల తరువాత వ్యాపారి బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయింది. మరో ఘటనలో చాంద్రాయణగుట్టలో మినీ ఏటీఎం నిర్వాహకుడికి 5 శాతం కమీషన్ ఇచ్చి రూ.లక్షన్నర తీసుకున్నారు. మూడ్రోజుల తరువాత బ్యాంకు లావాదేవీలు స్తంభించాయి. రెండు నెలల వ్యవధిలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. అపరిచితులతో లావాదేవీలు నిర్వహించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**యూపీఐ మోసాల్లో ఇదో రకం..**

చిరు వ్యాపారులు, మినీ ఏటీఎంల నిర్వాహకుల వద్దకు వెళ్లి, తమకు నగదు ఇస్తే యూపీఐ ద్వారా తిరిగి ఇస్తామంటారు. నగదును బట్టి 5-15 శాతం వరకూ కమీషన్ ఇస్తామంటారు. ఒకట్రెండు రోజుల అనంతరం నగదు ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాల లావాదేవీలు నిలిచిపోయేలా చేస్తారు. బ్యాంకుకెళ్లి ఆరా తీసినప్పుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు అందిన ఫిర్యాదు కారణమని తెలుసుకుంటున్నారు. స్థానిక ఠాణాలో తెలుసుకుంటే ఫిర్యాదు చేసిన వ్యక్తులు ఇతర రాష్ట్రాల వారని, అక్కడికి వెళ్లి వారితో మాట్లాడుకోవాలని సూచిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజులకు ఫిర్యాదు చేసిన వ్యక్తులు ఫోన్ చేసి.. ఫ్రీజ్ చేసిన నగదులో సగం వాటా ఇస్తే కేసు వెనక్కి తీసుకుంటామంటూ బేరసారాలు ప్రారంభిస్తున్నారు. నగదు తీసుకునే వెసులుబాటు లేకపోవడంతో రాజీ పడుతున్నట్లు తెలుస్తోంది.

**అంతర్రాష్ట్ర ముఠాల పనేనా?** ఈ నేరాలకు పాల్పడుతున్నది అంతర్రాష్ట్ర ముఠాలు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు ముఠాగా ఏర్పడి పథకం ప్రకారమే.. ఒకరు నగదు తీసుకుంటుంటే, మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ వస్తుందనగానే చెల్లింపులు జరిపి నష్టపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్, డ్రగ్స్ నిందితులకు సహకరించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

# గిరి వికాసం.. ఎంపికలో ఆలస్యం



సిరిసిల్ల : ఈ పథకం పర్యవేక్షణ పూర్తిగా గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) కరీంనగర్‌లోని కార్యాలయంలోనే ఉంది. గతనెలలో ఈ శాఖలో పనిచేసే గిరిజన సంక్షేమాధికారి బదిలీపై వెళ్లారు. దీంతో ఈ పథకంలో ఇప్పటికీ అర్హులైన రైతుల ఎంపిక, భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకాల కోసం జియాలజిస్టులతో పరిశీలన తదితర పనులన్నీ పూర్తిచేయాలి. ఇప్పటికీ లబ్ధిదారుల ఎంపికనే జరగలేదు. రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతును ఒక యూనిట్గా అంతకన్నా తక్కువ ఉన్న పక్షంలో ఇద్దరి నుంచి అయిదు మంది రైతులతో కలిపి ఒక యూనిట్గా చేసి పథకాన్ని అమలు చేస్తారు. గిరిజన రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చింది. వరి, పత్తి వంటి ఉద్యాన పంటలతో ఆదాయం సమకూర్చడం ప్రధాన ఉద్దేశం. జిల్లాలో ఈ పథకంలో 1,747 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. వీరికి అయిదేళ్లలో రూ.104 కోట్లు ఖర్చు చేయనుంది. అటవీ గ్రామాల్లో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో తొలివిడత 350 ఎకరాల్లో వంద మంది రైతులకు మేలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ వ్యయానికి ఇక్కడి పరిస్థితులకు వేరుగా ఉన్నాయి. అన్ని ప్రాంతాలు బోరుబావులకు అనుకూలంగా లేవు.

**అమలు చేస్తేనే పథకం సఫలీకృతం**

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లో కొంతమేరకు విద్యుత్తు వరసలు అందుబాటులో ఉన్నాయి. రుద్రంగి, చందుర్తి మండలాల్లో బోరుబావులకు అనుకూలంగా లేవు. పోడు పట్టాలు ఉన్నా.. అటవీ గ్రామాల్లో చాలా చోట్ల 200 అడుగుల్లో నీళ్లుండే పరిస్థితి లేదు. సోలార్ పంపు సెట్లు గరిష్ఠంగా 200 అడుగుల లోతులో ఉండే నీటిని సమర్థంగా తోడుతాయి. దీంతో యూనిట్ వ్యయం రూ.6 లక్షలకు మించే అవకాశాలు ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లోని భూభౌతిక పరిస్థితుల నేపథ్యంలో రైతులు బోరుబావులకు బదులుగా చేదబావులు తవ్వుకుంటున్నారు. బోరుబావుల తవ్వకంతో పోలిస్తే అధికంగా ఖర్చవుతుంది. అవసరమైన చోట అధికంగా ఖర్చుచేసేలా నిధులు సర్దుబాటు చేసి పథకాన్ని సమర్థంగా అమలు చేస్తేనే పథకం సఫలీకృతం అవుతుంది. వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాలో 70 ఎకరాలు పోడు సాగు చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేదు. దీంతో 50 మంది రైతులు కలిసి సమీపంలోని ధర్మారం చెరువు, ఇతర బోరుబావుల నుంచి మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారు. పంట పూర్తయ్యాక నీళ్లిచ్చిన రైతులకు ఎకరానికి ఇంతా అని డబ్బులు చెల్లిస్తున్నారు.

# అందని నిధులు.. భారంగా విధులు



ధర్మారం : సుల్తానాబాద్ మండలం గొల్లపల్లిలోని చెత్త ట్రాలీ ఇది. గతంలో ఇంటింటికీ తిరిగి రోజుకు రెండు ట్రిప్పుల చెత్తను తరలించేవారు. ట్రాలీ అడుగు భాగం పూర్తిగా దెబ్బతినడంతో ఏడాది కాలంగా సేకరణ నిలిచిపోయింది. మరమ్మతుకు రూ.80 వేలు అవసరం. పంచాయతీలో నిధులు లేక అద్దె ట్రాక్టరులో చెత్తను తరలిస్తున్నారు. గ్రామాల్లో పనులు చేసేందుకు ఆర్థిక వనరులు లేకపోవడంతో ముందడుగు పడటంలేదు. అభివృద్ధి పనుల మాట అటుంచి.. కనీస అవసరాలకూ ఖర్చుచేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాల నిర్వహణ తదితరాలకు ఎక్కువ నిధులు అవసరమవునుండగా.. పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో 266 పంచాయతీలకుగానూ 260 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు.

**కార్యదర్శులు అప్పులపాలు**

పాలకుర్తి మండలంలో గతేడాది వరకు పనిచేసిన ఓ కార్యదర్శి.. అక్కడ వివిధ అత్యవసర పనులు చేసేందుకు సొంతంగా ఖర్చు పెట్టారు. 11 నెలల క్రితం ధర్మారం మండలంలోని మేజర్ పంచాయతీకి వచ్చారు. పలు పనులకు రూ.4 లక్షల ఖర్చయింది. పైపులైన్ల లీకేజీల సవరణ, ఇతరత్రా ఖర్చులకు తన జేబు నుండి రూ.50 వేల వరకు ఖర్చు చేశానని సదరు కార్యదర్శి వాపోయారు. జూలపల్లి మండలంలో విధులు నిర్వహించిన ఓ కార్యదర్శి.. గతేడాది వేసవిలో మంచినీటి సరఫరా పనులకు ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ.1.20 లక్షలు వెచ్చించి చేయించారు. ఇప్పటికీ బిల్లు రాలేదు. బదిలీపై ధర్మారం మండలానికి వచ్చారు. అక్కడ రూ.2 లక్షలు ఖర్చు చేశారు. తన వేతనంతోపాటు.. తన తల్లిదండ్రులనుండి నగదు తీసుకొని చేయిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జిల్లాలో గతేడాది వేసవిలో తాగునీటి పథకాల నిర్వహణకు రూ.1.83 కోట్లు ప్రభుత్వం కేటాయించగా ఈ పనులు పూర్తి చేశారు. రూ.1.53 కోట్ల మేర పనులు రికార్డు చేశారు.

**సంతకాలకే ప్రత్యేకాధికారులు**

అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులు ఉన్నా.. కేవలం సంతకాలకు మాత్రమే పరిమితమవుతున్నారన్న అభిప్రాయాలున్నాయి. నిత్యం గ్రామంలోనే ఉండే కార్యదర్శి ఆయా పనులకు ఖర్చు పెట్టడం తప్పడంలేదు. పంచాయతీ సిబ్బంది వసూలుచేసిన మొత్తాన్ని ఎప్పటికప్పుడు ఎస్‌టీవోలో జమ చేస్తున్నారు. అయితే వాటిని విడిపించుకునే అవకాశం లేకపోవడంతో కార్యదర్శులకు విధుల నిర్వహణ భారంగా మారింది.

**సొంతంగా ఖర్చు పెడుతున్నాం**

అభివృద్ధి పనులకు కార్యదర్శులు జేబునుండి ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ట్రాక్టర్లు, చెత్త తరలింపు వాహనాలకు ఇంధనం, బ్లీచింగ్ పౌడర్ తదితరాలకు నిధుల్లేవు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే పరిష్కరించాలి. సంతోశ్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

**ప్రభుత్వం దృష్టికి తీకెళ్లాం**

గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ఎస్టీవోలో జమచేసే మొత్తాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. సానుకూలంగా స్పందించారు.
వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

## మహిళ ఆరోగ్యానికి భరోసా

హైదరాబాద్: 'ఆరోగ్య మహిళా క్లినిక్' ఇదివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)కు మాత్రమే పరిమితమైంది. ఇప్పుడు ఆ సేవలను వైద్య విధాన పరిషత్ (వీవీపీ) అన్ని ఆసుపత్రుల్లో విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగానే కింగ్‌కోఠి(వీవీపీ) జిల్లా ఆసుపత్రితో పాటు నగరంలోని నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట్ వంటి ఆసుపత్రుల్లో ప్రతీ 'ఆరోగ్య మహిళా క్లినిక్'లు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి ఈ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే దీనిపై కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో వైద్య బృందానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ విధివిధానాలను తెలియజేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు చెప్పారు.

**అవగాహన లేకపోవడంతో..**

దేశంలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితుల సంఖ్య ఆందోళనకు గురి చేస్తోంది. మహిళల్లో సరైన అవగాహన లేకపోవడంతో రొమ్ము క్యాన్సర్,



ఇతర సమస్యలు బయటకు చెప్పుకోవడానికి భయపడుతూ స్క్రీనింగ్‌లు చేయించుకోవడం లేదు. తద్వారా క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించలేని పరిస్థితి. ఈ సమస్యను అధిగమించాలనే ఉద్దేశంతో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో రొమ్ము, సర్వైకల్, గైనిక్, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, సుఖవ్యాధులకు సంబంధించి సమస్యలతో పాటు థైరాయిడ్ పరీక్షలు చేయనున్నారు.

**జిల్లా ఆసుపత్రిలో..:** కింగ్‌కోఠిలో కూడా ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి జనరల్ సర్జరీ, గైనిక్ విభాగంలో వైద్యులు ప్రాథమిక పరీక్షలు చేస్తారు. అనుమానం ఉంటే అల్ట్రాసౌండ్ చేస్తారు. అదేవిధంగా సర్వైకల్, మెనోపాస్, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు పరీక్షలు చేస్తారు. థైరాయిడ్ సమస్యను జనరల్ మెడిసిన్ వైద్యులు, ఈఎన్‌టీ వైద్యులు కూడా పలు పరీక్షలు నిర్వహిస్తారు. ఏమాత్రం అనుమానం ఉన్నా.. వెంటనే సమస్య ఉన్న చోట నుంచి శాంపిల్ తీసి రోగ నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించాల్సి ఉంటుంది.

**వివరాలన్నీ రికార్డులో..** క్లినిక్‌కు వచ్చిన ప్రతి మహిళ ఆరోగ్య వివరాలన్నీ రికార్డు చేస్తామని డా.సంతోష్‌బాబు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయినవారి వివరాలు నమోదు చేస్తారు. కాకుండా.. మిగతా రోజుల్లో కూడా చెకప్‌లు ఉంటాయి. వారు బుధవారం నుంచి సోమవారం వరకు పరీక్షలకు రావొచ్చు.

## అధ్వానంగా దవాఖానా క్యాంటీన్లు

హైదరాబాద్: గ్రేటర్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వంటశాలలు, క్యాంటీన్లు అధ్వానంగా ఉంటున్నాయి. ఇటీవలి ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో ఆహార కలుషితం కావడంతో వంద మంది వరకు రోగులు అస్వస్థతకు గురికాక.. ఒక రోగి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా 73 ఆసుపత్రుల్లో మంగళవారం బల్దియా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వంటశాలలు, క్యాంటీన్లు ఉన్నాయి. రోగులకు ఆహారం అందించే వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. 14 వరకు శాంపిళ్లను సేకరించి.. నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్,



2006, రెగ్యులేషన్స్, 2011 ప్రకారం ఆయా నిబంధనలు పాటించని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పదార్థాలు నిల్వ చేసేందుకు సరైన స్థలం లేకపోవడం, వంటగదులు అపరిశుభ్రంగా ఉండటం, వాషింగ్ ఏరియాలో అపరిశుభ్రత, ఆహార పదార్థాలు నేలపైనే పడవేయటం, ఆహారం పదార్థాలు ఇతర సరకులు కలిపి నిల్వ ఉంచడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం తదితర లోపాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## బస్తీల్లో బరువు బాధలు!

హైదరాబాద్: బస్తీలపై జీవనశైలి వ్యాధులు(ఎన్‌సీడీలు) దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్‌ఎఫ్) రాజేంద్రనగర్‌లోని ఎంఎం పహాడి, సులేమాన్‌నగర్, చింతల్‌మెట్ ఇతర మరికొన్ని బస్తీల్లోని 12 వేల మందికి పరీక్షలు చేసింది. వారిలో 69 శాతం మంది అధిక బరువు, 25 శాతం మంది గ్రేడ్-2 ఊబకాయ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొందరు మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నప్పటికీ మందులు వాడకుండానే నెట్టుకొస్తున్నారు.

**ఎన్‌సీడీ క్లినిక్‌ల ఏర్పాటు**

మూడు బస్తీల్లో హెచ్‌హెచ్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఉచితంగా మధుమేహం, అధిక రక్తపోటు ఇతర సమస్యలకు స్క్రీనింగ్ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ముజ్తబా హసన్ అస్కారీ తెలిపారు. జీవనశైలి వ్యాధులు ఉన్నవారిలో చాలామంది అధిక బరువుతో ఉన్నట్లు తేలింది. బరువు తగ్గితే ఆ వ్యాధులూ నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఈ క్లినిక్‌ల ద్వారా రోగులను గుర్తించి చికిత్సకు ప్రభుత్వ ఆసుపత్రులకు పంపనున్నారు. సమతుల ఆహారానికి దూరంగా ఉండటం, శారీరక వ్యాయామం లేకపోవడం, వేళాపాళా లేకుండా తినడం, మద్యపానం, ప్యాకెట్ ఫుడ్ కారణాలతో చాలా మంది తొలుత అధిక బరువు బారిన పడుతున్నారు. అనతి కాలంలో ఊబకాయులుగా మారుతున్నారు. దీంతో సులువుగా మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ బారిన పడుతున్నారు.

# చినుకు పడితే నరకమే

మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకున్న రహదారి చిన్నపాటి వర్షానికే చిత్తడవుతోంది. అధ్వానంగా ఉన్న రహదారిపై వందలాది వాహనాలు వెళుతుండటంతో గుంతలమయంగా మారింది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లికి 2 కిలోమీటర్ల దూరంలో ఎనిమిది మలుపులున్నాయి. వారానికి ఒక ప్రమాదం జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.

**ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలే**

సూరయ్యపల్లి-రచ్చపల్లి రహదారిపై గుంతలు తేలడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనాడులో వరుస కథనాలురాగా ఆరు నెలల క్రితం సింగరేణి సంస్థ పూడ్చి వేసింది. రోజుకు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండటంతో కొద్ది రోజులకే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించడానికి సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికి కార్యరూపం దాల్చడం లేదు.

**పదేళ్ల క్రితం తారు నిర్మాణం**

గతంలో మట్టి రోడ్డు ఉండగా.. పదేళ్ల క్రితం సింగరేణి బిట్టుపల్లి



శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి, భూనిర్వాసితులకు పునరావాసకాలనీ కోసం రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. ఈ మార్గం ద్వారా మంథని మండలంలోని బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్న ఓదాల.. ముత్తారం మండలంలోని సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాల్‌పల్లి జిజిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన ప్రారంభించడంతో నిత్యం వెయ్యి వరకు వాహనాలు నడుస్తున్నాయి. దీనిపై సింగరేణి జీఎంను వివరణ కోరగా.. రచ్చపల్లి, అక్కెపల్లి వాసులకు పునరావాసం కాలనీ నిర్మాణం పూర్తి కావడంతో ఇక ఈ రోడ్డు గురించి తమకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు.

**ప్రమాదాలు జరుగుతున్నాయి**

సూరయ్యపల్లి-రచ్చపల్లి రహదారి విస్తరణకు నిధులు కేటాయించాలి. ఇరుకుగా ఉన్న రోడ్డుపై గుంతలు పడటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ముగ్గురు మృతి చెందారు. వానాకాలంలో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందవుతుంది. ఈ ప్రదేశంలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలి. సంతోష్, ఖమ్మంపల్లి

# నిర్వహణ లేక.. నిరుపయోగం

జగిత్యాల : జిల్లాలోని 71 ఏఈవో క్లస్టర్లలో 2021లో నిర్మించిన రైతువేదికల నిర్వహణ భారంగా మారింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రూ.22 లక్షల చొప్పున నిధులు వెచ్చించి నిర్మించిన వేదికల్లో చాలావరకు నిరుపయోగంగా ఉంటున్నాయి. జిల్లాలోని 71 వేదికలకు 19 రైతువేదికల్లో ఇదివరకే దృశ్యశ్రవణ(వీడియో కాన్ఫరెన్స్) సదుపాయం ఉండగా తాజాగా మరో 33 వేదికల్లో వీసీ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలుండగా 71 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించి ఒక్కో వేదిక పరిధికి రెండు మూడు నుంచి ఏడెనిమిది గ్రామాలవరకు చేర్చారు. ప్రతి మంగళవారం రైతునేస్తం ద్వారా రైతువేదికల్లో శాస్త్రవేత్తలు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలు, పంటసాగు యాజమాన్యం, రాయితీలు, సూచనలిస్తున్నా రైతులు రాక మొక్కుబడిగానే ముగిస్తున్నారు. నాసిరకం పనులు, నిర్వహణ, మరమ్మతుల్లేక చాలాచోట్ల వేదికల్లోని నిర్మాణాలు దెబ్బతింటున్నాయి.

**బహుళ వినియోగం అవసరం**

రైతులకు సాంకేతిక సలహాలతో పాటు పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, విత్తనాల సరఫరా, భూసార పరీక్షలు తదితర బహుళ వినియోగ నేపథ్యంగా నిర్మించిన రైతువేదికలు చాలాచోట్ల ఊరికి దూరంగా నిర్మించటంవల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రతి రైతు వేదికకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) బాధ్యులుగా ఉండగా దాదాపు 60 శాతానికిపైగా మహిళలే ఏఈవోలుగా ఉండగా వీరు గుట్టలప్రాంతంలోని వేదికల్లోకి ఒంటరిగా వెళ్లి విధులు నిర్వర్తించేందుకు జంకుతున్నారు. కనీసం వేదికకొక అటెండర్ కూడా లేకపోవటంతో ఏఈవోనే తాళం తీసుకొని, ఊడ్చి శుభ్రంచేసుకొని పనులు చేసుకుందామన్నా నిర్మానుష్య ప్రాంతంలోని వేదికల్లో భయంభయంగా గడుపుతున్నారు. ఒక్కోరైతు వేదికకు నెలనెలా విద్యుత్ ఛార్జీలు, స్టేషనరీ, శిక్షణలు తదితరాలకు రూ.9 వేల చొప్పున నిర్వహణ ఖర్చులను ఇవ్వాల్సిఉంది. గతంలో రూ.95 వేల ఖర్చుతో ఒక్కో మినీ




భూసార పరీక్ష ల్యాబ్ పరికరాలు తేగా వీటిద్వారా వేదికల్లో భూసార పరీక్షలను చేపట్టాల్సి ఉంది. రైతు వేదికల్లోనే విత్తనాలు, రసాయన ఎరువులను నిల్వచేసి ఏఈవోల ద్వారా రైతులకు విక్రయించటం అనువుగా ఉంటుంది. రెవెన్యూ సేవలకు కూడా వేదికలను వినియోగించుకునే వీలుంది. రాయితీ విత్తనాలను, యంత్ర పరికరాలను కూడా వేదికలద్వారానే పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను అమల్లోకి తేవాలి. ఈ నేపథ్యంలో ప్రతి రైతు వేదికకొక సహాయకుడిని నియమించటం, మౌలిక వసతులు కల్పిస్తే రైతులకు వారివారి గ్రామాల్లోనే సేవలందుతాయి.

**అదనంగా 33 వేదికల్లో దృశ్యశ్రవణం**

ఇదివరకే 19 వేదికల్లో వీసీ సదుపాయం ఉండగా మరో 33 వేదికలకు విస్తరిస్తున్నాం. రైతులకు అన్నిరకాల సేవలను రైతువేదికలద్వారానే చేపట్టేలా ప్రభుత్వం విస్తరణ కార్యకలాపాలను అమలు చేయనుంది. వి.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# ప్రగతి ప్రతిపాదనలకే పరిమితం



సుల్తానాబాద్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ'ని చందాన మారింది సుల్తానాబాద్ మండలంలో రూర్బన్ పథకం పనుల పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ స్థాయి వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో సుల్తానాబాద్, జమ్మికుంట మండలాలను ఎంపిక చేశారు. 2018లో సుల్తానాబాద్ మండలాన్ని రూర్బన్ పథకానికి ఎంపిక చేసిన అధికారులు రూ.100 కోట్ల విలువైన పనులకు సంబంధించిన ప్రతిపాదనలతో డీపీఆర్ రూపొందించారు. ఇందులో మొదటి విడతగా రూ.30 కోట్లను కేంద్రం విడుదల చేసింది. రహదారులు, పంచాయతీ భవనాలు, గ్రామీణ గిడ్డంగులు, మినీ ఆడిటోరియం తదితర నిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగా నిలిచాయి. పలు ప్రతిపాదనలు కాగితాలు కూడా దాటలేదు. మొదటి విడత పనులను గడువులోగా పూర్తి చేయకపోవడంతో రెండో విడత నిధులు మంజూరు కాలేదు. ఫలితంగా ఎక్కువ శాతం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

**గుత్తేదారుల నిరాసక్తత**

రూర్బన్ పథకం మండలంలో చేపట్టిన పలు పనులకు రూ.10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు నిరాసక్తత కనబరుస్తున్నారు. రూర్బన్ పథకం పనుల పూర్తికి 2023 డిసెంబరు 31 వరకు గడువు విధించారు. 2024 మార్చి 31 వరకు పొడిగించాలని జిల్లా అధికారులు ప్రయత్నించినా అప్పటికే శాసనసభ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మిగిలిన పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి.

**నిలిచిన నిర్మాణాలు**

సుల్తానాబాద్ సుభాష్‌నగర్ సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. రెండేళ్లుగా ఇనుప చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టాయి. కొద్ది రోజులు పోతే పూర్తిగా పనికి రాకుండా పోయే పరిస్థితి.

గర్రెపల్లిలో రూ.60 లక్షలతో మినీ ఆడిటోరియం, రూ.8 లక్షలతో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇదే గ్రామంలో రూ.20 లక్షలతో రాజీవ్ రహదారి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రెండు వరుసల రహదారి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉండిపోయాయి.

మండలకేంద్రంలోని దర్గానగర్‌లో రూ.65 లక్షలతో మాంసం విక్రయశాలల పనులు చేపట్టగా స్లాబ్ వరకు పూర్తయ్యాయి. రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

సుల్తానాబాద్ సుభాష్‌నగర్‌లో రూ.కోటితో నిర్మించిన అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం పిల్లర్లకే పరిమితం కాగా పిచ్చిమొక్కలు పెరిగాయి. నీ మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ, ఈ-పంచాయతీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

మండలంలో రూ.30 కోట్ల రూర్బన్ పనులు చేయగా సుమారు రూ.20 కోట్ల చెల్లింపులు జరిగాయి. నిలిచిపోయిన పనులు, రావాల్సిన బిల్లులపై ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. దేవేందర్, పీఆర్ డీఈఈ

# జోరుగా మక్కల కొనుగోళ్లు.. భారీగా నిల్వలు



జమ్మికుంట: వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో మక్కల కొనుగోళ్లు గతంకంటే రెట్టింపు జరిగాయి. పత్తి సీజన్ ముగియటంతో పలువురు పత్తి, అడ్తి వ్యాపారులు, మక్కల ఖరీదుదారులు కొనుగోళ్లను మార్చి చివరి వారం నుంచే చేపట్టారు. కొనుగోలు చేసిన మక్కలను నిల్వ చేస్తే మంచి లాభం ఉంటుందనే ఆశతో పెద్దమొత్తంలో నిల్వ చేశారు. **రికార్డు స్థాయిలో..**

గత సంవత్సరం జమ్మికుంటలో 96,705 క్వింటాళ్ల మక్కలను వ్యాపారులు ఖరీదు చేయగా.. ఈసారి గత నెల నాటికే రికార్డు స్థాయిలో 2,01,387 క్వింటాళ్ల మక్కలను వ్యాపారులు ఖరీదు చేయటం విశేషం. జిల్లాతోపాటు పెద్దపల్లి, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల రైతులు మక్కలను విక్రయించారు.

ముమ్మందు ధర పెరుగుతుందనే ఆశతో మార్కెటింగ్ శాఖ లైసెన్స్‌లు లేని చిరువ్యాపారులు సైతం కొనుగోళ్లు చేపట్టారు. ఇలా నలుగురు కొనుగోలు చేశారని అధికారులు చెబుతున్నా.. 8 మందికిపైగా ఉండొచ్చని తెలుస్తోంది. జమ్మికుంటలో 32 మంది లైసెన్స్ వ్యాపారులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. లైసెన్స్‌లు లేకుండా ఎందరు కొనుగోలు చేశారనే విషయం తనిఖీలు చేస్తేనే బహిర్గతం కానుంది. సీజన్ మొదట్లో మక్కల ధర రూ.2,425 ఉండగా తాజాగా రూ.2,300కు తగ్గింది. దీంతో మొదట్లో మక్కలు కొనుగోలు చేసిన వ్యాపారులు అయోమయంలో పడ్డారు. పౌల్ట్రీఫామ్‌లు, బిస్కెట్లు, ఇతర పరిశ్రమల నుంచి మక్కల కోసం ఆర్డర్లు రాకపోవటంతో విక్రయాల కోసం నిరీక్షిస్తున్నారు. స్థానిక ఓ పౌల్ట్రీఫామ్‌లో ధర అధికంగా ఉండటంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన మక్కలను చిరువ్యాపారులు అక్కడే విక్రయిస్తున్నారని తెలిసింది.

కొనుగోలు చేసిన మక్కలను పత్తి జిన్నింగ్ మిల్లులు, ప్రత్యేక షాపింగ్ గదుల్లో నిల్వ చేస్తున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ గిడ్డంగిని అద్దెకు తీసుకొని నిల్వ చేస్తున్న ఓ ఖరీదుదారు.. తేమ ఉన్న మక్కలను గిడ్డంగిలోనే ఆరపెట్టించారు. వ్యాపారులు రోజూవారీగా సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, ఇతర ప్రాంతాల్లో ధరలను తెలుసుకుంటూ మంచి ధర వస్తే విక్రయానికి తరలిస్తున్నారు.

లైసెన్స్ లేకున్నా కొనుగోలు చేసిన వ్యాపారులు.. మక్కలను విక్రయించే సమయంలో మార్కెట్‌కు ఒక శాతం ఆదాయం జమవుతుందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం స్పష్టం చేశారు. లైసెన్స్ లేని నలుగురికి గతంలోనే నోటీసు జారీ చేశామని.. జీరో వ్యాపారానికి అవకాశం లేదని తెలిపారు. జమ్మికుంట మార్కెట్‌కు మక్కల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

# సమస్యల సుడిలో ప్రభుత్వ బడి



సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యాలయాలు అసౌకర్యాలకు నిలయాలుగా ఉన్నాయి. గతంలో 'మన ఊరు.. మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పాఠశాలలకు మరమ్మతులు చేపట్టారు. కొన్నిచోట్ల నిధులు ఖర్చు చేసినా సమస్యలు కనుమరుగవడం లేదు. మరికొన్ని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేపట్టేందుకు అనువైన వేసవి సెలవులను ఉపయోగించుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలు 40 ఉన్నాయి. వీటితోపాటు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. కుళాయిలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థులకు సంఖ్యకు సరిపోయేలా లేవు. కొన్నిచోట్ల వాష్‌బేసిన్, నీటి కుళాయిలు ఊడిపోయాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయి ఉన్నాయి. మూత్రశాలల ట్యాప్‌లు నాసిరకంగా ఉండడంతో లీకేజీ వల్ల పాఠశాలంతా దుర్గంధం వ్యాపిస్తూ పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. కొన్ని పాఠశాలల్లో మంచినీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు కానీ.. ట్యాప్‌లు అనుసంధానం చేయడం మరిచారు. మరకొన్ని చోట్ల నాసిరకమైనవి అమర్చడంతో విరిగిపోయాయి. రక్షణగా నిర్మించిన ప్రహరీల వల్ల ఉపయోగమే లేకుండా పోయింది. నిత్యం పాఠశాలల్లోకి కుక్కలు, పందులు, పశువులు వస్తున్నాయి. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది.

**చర్యలు తీసుకుంటాం**

'మన ఊరు.. మన బడి', అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఎంపికైన పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టారు. మరికొన్ని చోట్ల దశల వారీగా పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటాం. డి.రఘుపతి, సిరిసిల్ల మండల విద్యాధికారి

# పూడికతీతకు సమయమిదే!

సిరిసిల్ల: జలాశయాల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. నీటిలోనే యంత్రాలను అమర్చి లోపలి నుంచి మట్టి, ఇసుకను ఒడ్డుకు (సెడమెంటేషన్ విధానంలో) తరలిస్తారు. దీనికి రాష్ట్రంలో నిర్మల్ జిల్లా కడెం, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మధ్య, దిగువమానేరు జలశయాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. జనవరిలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో మార్చి మొదటి వారం వరకు వాయిదా వేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఇటీవలే రెండు జలాశయాల ఉన్నతాధికారులతో ఒప్పందం చేసుకుంది. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు కొంతైనా పూడిక తొలగిస్తే.. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

**ఇరవై ఏళ్ల ప్రణాళిక**

మధ్యమానేరు జలాశయం 27.50 టీఎంసీల సామర్థ్యంతో 2018లో నిర్మాణం పూర్తయింది. దీని నిర్మాణంలో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీటి అవశేషాలకు తోడు ఏటా వర్షాకాలం మానేరు, మూలవాగుల నుంచి భారీ వరదలకు ఇసుక, మట్టి జలాశయంలో చేరుతోంది. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం పది టీఎంసీలకు చేరుకున్నప్పుడు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నీటి శుద్ధిప్రక్రియపై ఒత్తిడి పెరగడం.. ఫలితంగా సరఫరాలో నీరు రంగుమారి తరచూ అవాంతరాలు తలెత్తుతున్నాయి.



ఎస్సారెస్పీ నుంచి వరంగల్, నల్గొండ జిల్లాలకు సాగు నీరందించేందుకు 1985లో దిగువ మానేరును 26 టీఎంసీలతో నిర్మించారు. ప్రస్తుతం దీనిలో నిటినిల్వ సామర్థ్యం 24 టీఎంసీలే ఉంటోంది. దిగువ మానేరులో 131 లక్షలు, మధ్యమానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయనున్నారు. ఈ రెండు జలాశయాల్లో పూడికతీత ప్రక్రియ ప్రారంభమైతే వచ్చే ఏడాది పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లిలోనూ ఈ ప్రక్రియ ద్వారా పూడికతీసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జలాశయాల్లోని నీటి నమూనాలు పరీక్షించినప్పుడు ఇసుకతోపాటు అధికమొత్తంలో మట్టి, సిల్ట్, గ్రావెల్ ఉన్నట్లు గుర్తించారు. నీటి నిల్వ, తాగు, సాగునీటి తరలింపులకు ఇబ్బందులు తలెత్తకుండా జలాశయం మధ్యలోకి యంత్రాలను పంపించి అందులోని వ్యర్థాలను మాత్రమే బయటకు తీస్తారు. ఇలా వచ్చిన సిల్ట్ నుంచి ఇసుకను వేరు చేస్తారు. దీనిని గుత్తేదారు నీటి పారుదలశాఖకు టన్నకు రూ.339.66 చొప్పున చెల్లించి విక్రయిస్తారు. ఒండ్రు మట్టిలోనూ పోషకాలు ఉంటాయి. దీన్ని ఎం చేస్తానరేది స్పష్టత లేదు.

మూడు జలాశయాల పూడికతీతకు రూ.1439.55 కోట్లతో చేపట్టే పనులు 20 ఏళ్ల పాటు కొనసాగుతాయి. వర్షాకాలం వరదల సమయంలో పూడికతీయలేని పరిస్థితి. నవంబరు నుంచి మే జూన్ వరకు మాత్రమే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.

**అనువైన స్థల పరిశీలన**

పూడిక తీత పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఒప్పందం చేసుకుంది. నీటి నుంచి పూడిక తీసేవిధానం కొత్తది. దీని నుంచి వచ్చిన మట్టి, ఇసుకను వేరు చేయాలి. జలాశయంలో యంత్రాల బిగింపు, బయటకు తీసిన మట్టి, ఇసుకను వేరు చేసేందుకు అనువుగా ఉన్న స్థలాలను సంస్థ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే యంత్రాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఇసుక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయంతోపాటు జలాశయానికి పూడిక భారం తగ్గుతుంది. జగన్, ఈఈ, మధ్యమానేరు జలాశయం

# రోడ్డెక్కని పనులు.. తప్పని అవస్థలు

మెట్‌పల్లి : గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో గుంతల రోడ్లపై వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మెట్‌పల్లి మండలంలో పలు రహదారులు గుంతలమయంగా మారాయి. చాలా రోజుల కిందట నిర్మించిన రహదారులు బీటీ లేచి పోయి అధ్వానంగా తయారయ్యాయి. రామలచ్చక్కపేట నుంచి ఏఎస్ఆర్ తండా గ్రామాల మధ్య రహదారి పూర్తిగా బీటీ లేచి కంకర తేలింది. జగ్గాసాగర్ నుంచి కొండ్రికర్ల వెళ్లే దారిలో కొంత దూరం గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి పెద్దాపూర్ గురుకుల పాఠశాల రహదారిలో గుంతలమయంగా మారింది. రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరై చాన్నాళ్లు కావస్తున్నా బిల్లుల విడుదలలో ఆలస్యం అవుతుందనే ఉద్దేశంతో గుత్తేదారులు ఎవరూ పనులు పూర్తి చేయడానికి ముందుకు రావడం లేదని



తెలుస్తోంది. అసలు పనులు జరుగుతాయో? లేదో?నన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**నిధులు మంజూరైనా..**

మండలంలో పలు రహదారులు అధ్వానంగా మారడంతో పునర్నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించకపోవడంతో గుంతల ప్రయాణం తప్పడం లేదు. రామలచ్చక్కపేట-ఏఎస్ఆర్ తండా రహదారికి రూ.1.50 కోట్లు, చౌలమద్ది-వెల్లుల్ల మధ్య రూ.50 లక్షలు, పెద్దాపూర్ క్యాంపు రోడ్డుకు రూ.68 లక్షలు, కొండ్రికర్ల-జగ్గాసాగర్ రోడ్డుకు రూ.40 లక్షలు, రామలచ్చక్కపేట-మెట్లచిట్టాపూర్‌లతో పాటు పలు రహదారులు నిధులు మంజూరు చేశారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి అవస్థలు తీరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# విధులు పంచుకొని.. నిధులు నంజుకొని

విశాఖపట్నం : ఆరు నెలలుగా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)కి కమిషనర్ లేక పాలన గాడి తప్పింది. పలు విభాగాల్లో కొందరు అధికారులు, సిబ్బందిలో విధుల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది గదులకు పరిమితమయ్యారు. దీంతో నగరంలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పాయి. ముఖ్యంగా ప్రజారోగ్య విభాగంలో పలువురు సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడా కనిపించడంలేదు. ప్రభుత్వం చెత్త తరలింపు రుసుములను రద్దు చేసిన తరువాత చెత్త సేకరణకు కార్మికులు సక్రమంగా ఇళ్లకు వెళ్లడంలేదు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌ల వద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త బిన్నులను ప్రతి రోజూ ఉదయం 7 గంటలకల్లా తరలించేవారు. ఇప్పుడు రెండు, మూడు రోజులకోసారి ఆ పనులు చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు రెండు పూటలా హాజరుకావాల్సి ఉండగా చాలా మంది ఉదయం మాత్రమే హాజరవుతున్నారు. ఐరిస్ తీసిన తరువాత పనిచేయకుండా కొందరు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. రెండో పూట విధులకు 10-15 శాతం మాత్రమే హాజరవుతున్నట్లు సమాచారం. వారి వేతనాల్లో భారీగా కోతలు విధించి కొందరు అధికారులు పంచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కూలి ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల్లో 30శాతం మాత్రమే విధులకు వస్తున్నారు. మిగిలినవారి వేతనాలు పంపకాలు జరిగిపోతున్నాయి. వీటన్నింటిపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిపెట్టాల్సి ఉంది.


**కాసుల కోసం కళ్లుమూసుకుంటూ:** నగరంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్లాన్లు లేకుండా కొన్ని, ప్లానుకు విరుద్ధంగా కొన్ని నిర్మాణాలు చేపడుతుండగా కొందరు ప్రణాళికాధికారులే తెరవెనుక ఉండి వ్యవహారాలు నడిపిస్తున్నారు. చాలా నిర్మాణాల్లో ఉల్లంఘనలుంటున్నా, వాటిపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడంలేదు. భారీ నిర్మాణాల వద్ద రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఆక్యుపెన్సీ ధ్రువీకరణపత్రాల(ఓసీ) మంజూరులో అక్రమాలు చోటుచేసుకుంటుండగా, నాలా, ఖాళీ స్థలం పన్ను చెల్లించకుండానే ప్లాను, ఓసీ కూడా ప్రణాళికాధికారులు ఇచ్చేస్తుండటం గమనార్హం. లంచమివ్వనిదే ఆస్తి పన్ను విధించడంలేదు. ఆస్తి బదలాయింపు, కొత్తగా పన్ను వేయడం, ఆస్తి పన్ను మదింపు వంటి ప్రతి దస్త్రానికి కొందరు సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇచ్చినవారికి తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను విధిస్తూ జీవీఎంసీకి భారీగా నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారు. లీజులు, మార్కెట్ల నుంచి ఆశీలు వసూలులో గుత్తేదారులకు సహకరిస్తూ జోనల్ అధికారులతో కలిసి పలువురు రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

**టీడీఆర్ బాండ్లపై దృష్టిపెడితేనే?:** కూటమి హయాంలోనూ టీడీఆర్‌ల జారీలో జీవీఎంసీ అధికారులు వెనక్కు తగ్గడంలేదు. మురికివాడలకు, నాయకుల ఆస్తులున్న ప్రాంతాలలో రహదారులు అభివృద్ధి పేరిట టీడీఆర్‌లకు దరఖాస్తులొస్తున్నాయి. సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలం కలిసిన ప్రాంతంలో రహదారి అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించి అక్రమ టీడీఆర్ పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాణ్యతలేని పనులతోపాటు, పని చేయకుండానే రికార్డు చేసే స్థాయికి జీవీఎంసీ ఇంజినీర్లు వెళ్లారు. నాలుగు కాసులు వచ్చే సీట్లకు ఏళ్ల తరబడి అతుక్కుపోయారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రతి పనిలోనూ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు.

# కుయ్యో.. రొయ్యో!

ఒంగోలు : సీఆర్‌జెడ్ పరిధిలో రొయ్యల చెరువులు, ఏ విధమైన కట్టడాలు నిర్మించకూడదని ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్) ప్రకటించినా కొందరు పట్టించుకోవడంలేదు. కోస్తా తీర ప్రాంతంలో ఇష్టారీతిన రొయ్యల చెరువులు తవ్వకాలు జరిపి సాగు చేస్తున్నారు. పిల్ల దశ నుంచే రొయ్య ఎదుగుదలతోపాటు వ్యాధుల నియంత్రణకు పలు రసాయనాలు వినియోగిస్తున్నారు. చెరువుల నుంచి వచ్చే కలుషిత వ్యర్థాలను పొరుగునే ఉన్న కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో రక్షిత మంచినీటి పథకాలకు చెందిన నీటి వనరులు కలుషితమవుతున్నాయి. పచ్చని పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి.

**అయిదు మండలాల్లో సాగు...:** జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 50 కిలోమీటర్ల మేర ఉంది. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలోని 30 గ్రామాల్లో సుమారు 17 వేల ఎకరాల విస్తీర్ణంలో రొయ్యల సాగు చేస్తున్నారు. సముద్రపు అలలు వచ్చే గరిష్ఠ దూరం నుంచి 500 మీటర్లలోపు ఎలాంటి చెరువుల తవ్వకం, ఇతర నిర్మాణ పనులు చేపట్టకూడదు. రెండంకెల వృద్ధిలో భాగంగా రొయ్య సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో కొందరు దాన్ని సాగుకు తీసుకుని తీరం వెంబడి ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో సైతం ఇష్టారీతిన చెరువులు తవ్వకం చేపట్టి సాగు చేస్తున్నారు. మరికొందరు తీరంలోనే బోర్లు వేసి ఉప్పునీటిని మళ్లిస్తున్నా



రు. ప్రత్యేకించి కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో 25కుపైగా రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. అవన్నీ సముద్రపు ఒడ్డునే ఉండడంతో వాటి నుంచి వచ్చే వ్యర్థాలను సమీప భూమిలోకి ఇంకిస్తున్నారు. లేకుంటే నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.

**పిల్ల కాలువలా బకింగ్‌హాం కెనాల్**

బకింగ్‌హాం కెనాల్. సముద్ర తీర ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యం గల కెనాల్ ఇప్పుడు పిల్ల కాలువను తలపిస్తోంది. నాగులుప్పలపాడు మండలం కనపర్తి నుంచి సింగరాయకొండ వరకు స్థానికులు రాజకీయ నాయకుల అండతో కాలువ ఇరువైపులా ఆక్రమించి రొయ్యల సాగును యథేచ్ఛగా చేస్తున్నారు. ఆక్రమణలో ఉన్న చెరువులకు సైతం సంబంధిత శాఖల అధికారులు అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పగలు, రాత్రి.. భయానకం!!



విశాఖపట్నం : నగరంలో పలు కూడళ్ల వద్ద పరిస్థితి భయపెడుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడం, సిబ్బంది లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రధానంగా భారీ వాహన చోదకులు ఇష్టారాజ్యంగా దూసుకెళ్లడంతో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నగరంలో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాలే ఇందుకు తార్కాణం.

**అవి మొత్తం 240:** నగరంలో అంతర్గత రహదారులు, జాతీయ రహదారి, బీచ్‌రోడ్, బీఆర్టీఎస్ రహదారి... ఇలా అన్ని చోట్ల 240 సిగ్నల్ పాయింట్లు వివిధ కూడళ్లలో ఉన్నాయి. ఎన్ఏడీ నుంచి లంకెలపాలెం వరకున్న కూడళ్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు నుంచి వెళ్లే భారీ వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

లంకెలపాలెం కూడలి వద్ద రోడ్డు నిర్మాణంలోనే సాంకేతిక సమస్య ఉందనే చర్చ సాగుతోంది. కూడలికి అర కిలోమీటరు ముందు నుంచి వాలుగా ఉండటంతో వేగం అదుపుగాక ముందు ఉన్న వాహనాలపైకి దూసుకెళుతున్నారు. హెూమీబాబా ఆసుపత్రి కూడలి వద్ద కొత్త సిగ్నల్స్ పెట్టారు. కానీ, ఇంకా ప్రారంభించలేదు. ఆటోనగర్ కూడలి వద్ద హైవే నుంచి ఆటోనగర్ వెళ్లేందుకు యూటర్న్ తీసుకునే వాహనాలకు, అటు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొంటున్నాయి. వడ్లపూడి, కూర్మన్నపాలెం కూడళ్ల వద్ద కూడా ప్రమాదకర పరిస్థితే ఉంది. కూర్మన్నపాలెం కూడలి నుంచి ఎయిర్‌పోర్టు కూడలి వరకు మధ్యలో కొన్ని సిగ్నల్స్ పనిచేయడం లేదు.

**ఇటీవల ఇలా..**

ఈనెల 23న లంకెలపాలెం కూడలి ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి సోమవారం రాత్రి ఓ లారీ దూసుకెళ్లింది. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. కొందరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. 21న షీలానగర్ కూడలిలో కంటైనర్‌ను వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

3న లంకెలపాలెం కూడలిలోనే అదుపు తప్పిన బొగ్గు లారీ ముందువెళుతున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

**ఎందుకిలా అంటే..**కొన్ని కూడళ్లలో సిగ్నల్ దీపాలు వెలగకపోవడం. రాత్రి 8 దాటితే కొన్ని చోట్ల సిగ్నల్స్ ఆపేయడం.. సిబ్బంది తగినంత మంది లేకపోవడం.

ఇంకొన్ని చోట్ల సిగ్నల్స్ పనిచేస్తున్నా.. భారీ వాహనాల డ్రైవర్లు మద్యం మత్తు, నిర్లక్ష్యంగా నడపడం.

పైవంతెనలు ప్రతిపాదనలతోనే: జాతీయ రహదారిపై కారుషెడ్డు, ఎండాడ, ఆదర్శనగర్, హనుమంతవాక, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, తాటిచెట్లపాలెం, గాజువాక, కూర్మన్నపాలెం, స్టీలుప్లాంటు, లంకెలపాలెం.. ఇలా ప్రధాన కూడళ్లలో పైవంతెనలు 12 నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక శ్రద్ధ పెట్టి డీపీఆర్ సైతం పూర్తి చేశారు. పైవంతెనల ప్రతిపాదనలున్నచోట నుంచే మెట్రో వెళ్లే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి పైవంతెనల ప్రతిపాదనలు అలా నిలిపారు. రెండూ కలిపి నిర్మించే ప్రణాళికలపై కసరత్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదాల్లో మృతులు**

2023: 317

2024: 335

2025: 129 (ఇప్పటి వరకు)

నగరంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి: 75 కి.మీ.

బీఆర్టీఎస్ రహదారి: 35 కి.మీ.పైగా

అంతర్గత ప్రధాన రహదారులు: 150 కి.మీ.

నగరంలో నిత్యం తిరిగే వాహనాలు: 5లక్షలకుపైగా

# గుట్టు వీడలేదు.. లెక్క తేల్చలేదు



అనకాపల్లి : పేదలు, అభాగ్యులకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛను కోసం పలువురు అర్హులు నిరీక్షిస్తుండగా.. గత ప్రభుత్వంలో అనర్హులైన అనేకమంది ఈనాటికీ అప్పనంగా పింఛను తీసుకుంటున్నారు. వైకాపా హయాంలో పార్టీల ముద్రవేసి పలువురు అర్హులకు పింఛను తొలగించగా.. అనర్హులకు లబ్ధి చేకూర్చారు. వైకల్యం నిర్దేశిత శాతం లేకున్నా.. పాలకుల ఒత్తిళ్లతో వైకల్యం ఉన్నట్లు కొందరు వైద్యులు అక్రమంగా ధ్రువీకరించేశారు. వాటి ఆధారంగా పింఛన్లు పొందేవారి వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అనర్హులు బోగస్ పింఛన్ల లెక్క తేల్చేందుకు తనిఖీలు చేయిస్తోంది. ఆరు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నా బోగస్ పింఛన్ల వివరాలను మాత్రం అధికారులు బయటకు వెల్లడించక పోవడంపై విమర్శలు వస్తున్నాయి.

**పక్క జిల్లా వైద్యులతో తనిఖీలు:** జిల్లాలో 2.54 లక్షల పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 30,845 మందిని తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటివరకు 15,478 మంది అర్హతను తనిఖీలు చేసి అవసరమైన వివరాలు సేకరించారు. ఇంకా 15,367 మంది పింఛన్లను తనిఖీలు చేయాల్సి ఉంది. బోగస్ పింఛన్లు బయట పడితే.. ఉద్యోగులకే చెడ్డపేరొస్తుందన్న నెపంతో కొంతమంది వైద్యులు నిర్ధారణ పరీక్షలు సరిగా చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. బోగస్ పింఛన్ల ఏరివేత బాధ్యత గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), వైద్య ఆరోగ్య శాఖలకు అప్పగించింది. గత ప్రభుత్వంలో వాళ్లే పింఛన్లు ధ్రువీకరించడంతో.. పక్క జిల్లాల వైద్యులతో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేస్తున్నారు.

అనంతరం వివరాలు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిస్తున్నామని అధికారులు చెబుతున్నారు కానీ.. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని బోగస్ పింఛన్లు మంజూరవుతున్నాయన్న వివరాలు మాత్రం అధికారులు బయటపెట్టడం లేదు.

**పక్కాగా పరిశీలన:** వారంలో మూడు రోజులు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఇతర జిల్లాలు నుంచి వైద్యులు వచ్చి పింఛనుదారులను తనిఖీ చేస్తున్నారు. నిజంగా ఎంతశాతం వైకల్యంతో ఉన్నారన్నది పరిశీలిస్తారు. అర్హులకు ఎవరికీ అన్యాయం జరగదు. ఇళ్లలో మంచానికే పరిమితమైన వారి వివరాలు సేకరించాం. ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వమే అనర్హుల జాబితాను విడుదల చేస్తుంది. శచీదేవి, డీఆర్‌డీఏ పీడీ, అనకాపల్లి

# రోగుల సహాయకులకు ప్రత్యేక సౌకర్యాలు

పెదవాల్తేరు : ప్రభుత్వ ఛాతి ఆసుపత్రికి క్షయ, ఎయిడ్స్ బాధితులు ఎక్కువగా వస్తుంటారు. క్షయ అంటువ్యాధి కావడంతో ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బాధితులకు సహాయకులుగా వచ్చే వారికి అంటువ్యాధులు సోకకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆసుపత్రికి ఎన్.ఎ.బి.హెచ్.ఐ.(నేషనల్ అగ్రిఫుడ్, బయోమ్యానుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్) గుర్తింపు పొంది ఉండడంతో ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం ఆసుపత్రిలోని కొన్ని నిర్మాణాల్లో మార్పులు చేశారు. అదేవిధంగా ప్రత్యేక సదుపాయాలను సమకూర్చారు. వీటికయ్యే వ్యయం పూర్తిగా ఏపీ ఎం.ఎస్.ఐ.డి.సి. విభాగం భరిస్తుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

గతంలో రోగులతోపాటు వారి బంధువులకు ఒకటే వాష్‌రూమ్ ఉండేది. ఇక్కడికి ప్రధానంగా టీబీ, రేబిస్, కలరా తదితర వ్యాధులతో రోగులు వస్తుంటారు. ఇవన్నీ అంటువ్యాధులు కావడం, రోగులు వాడిన వస్తువులు ఇతరులు వాడితే ఆయా వ్యాధులు సోకుతాయనే ఆలోచనతో ప్రత్యేకంగా వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిల్లో అన్ని సదుపాయాలు కల్పించారు.

రోగులకు రక్తపరీక్షలు చేయడానికి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. గతంలో ఎయిడ్స్, క్షయ వ్యాధి బాధితులతోపాటు ఇతరులకు ఒకటే ల్యాబ్ ఉండేది. క్షయవ్యాధిగ్రస్థులకు రక్త పరీక్షలు చేయడానికి ఉపయోగించే పరికరాల కారణంగా ఇతరులకు ఆ వ్యాధి సోకుతుందనే ఉద్దేశంతో ప్రత్యేకంగా లాబ్‌ను సిద్ధం చేశారు. సాధారణ వ్యాధులతో వచ్చే రోగులకు వేరుగా ల్యాబ్ ఉంది. ఎవరికైనా క్షయ ఉందని అనుమానిస్తే ఎ.ఆర్.టి. సెంటర్ దరి డీఎంసీ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేస్తారు. ఆసుపత్రిలోని మెడికల్ రికార్డు సెంటర్‌ను కూడా ఆధునికీకరించారు. ఇక్కడ రోగుల కేస్‌షీట్లను భద్రపరుస్తున్నారు. ఆయా వివరాలను డిజిటలీకరణ చేస్తున్నారు. ఇందులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ కార్యాలయం తరహాలో తీర్చిదిద్దారు.

# త్వరలో సహకార వ్యవస్థకు సారథులు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 96 సహకార సంఘాలున్నాయి. వీటిద్వారా రైతులకు అవసరమైన పంట రుణాలను అందిస్తున్నాయి. ఎకరా చెరకు తోట వేస్తే రూ. 75 వేలు రుణంగా అందిస్తారు. ఒక రైతుకు గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం ఇస్తారు. జిల్లాలో ఏటా రూ. 680 కోట్లు వరకు రుణాలుగా అందిస్తున్నారు. ఒక్క మునగపాక సొసైటీయే ఏటా 800 మంది రైతులకు రూ. 1.65 కోట్లు రుణాలుగా అందిస్తోంది.

రైతులకు అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లను గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా ప్రతి సొసైటీకి ఛైర్మన్‌ను నియమించనుంది.



ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు అధ్యక్షులను నియమించారు. ఇదే విధంగా సహకార సంఘాలకూ తాత్కాలిక ఛైర్మన్లను నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. వీరి పదవీకాలం ఆరు నెలలు. వీరి పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల బరిలో అభ్యర్థులుగా నిలిపేవారినే ప్రస్తుతం ఛైర్మన్లుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పలు సంఘాలు అక్రమాల పుట్టలుగా మారాయి. వైకాపా నాయకులనే పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించి అప్పట్లో కాలం వెళ్లదీశారు. వీరి పదవీకాలం ఆరు నెలలైనా నాలుగైదుసార్లు పొడిగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరంతా రాజీనామా చేశారు.

**ఛైర్మన్ల కోసం పోటాపోటీ**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబి) ఛైర్మన్‌గా జనసేనకు చెందిన కోన తాతారావును, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఛైర్మన్‌గా తెదేపాకు చెందిన కోట్ని బాలాజీలను నియమించారు. ఈ రెండింటిలో సభ్యులుగా ఉండేది సహకార సంఘాల అధ్యక్షులే. అందుకే సెంట్రల్ బ్యాంకు, డీసీఎంఎస్ ఛైర్మన్‌లను పీఏసీఎస్ నుంచి పోటీ చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌ను అనకాపల్లి మండలంలోని ఒక సొసైటీ నుంచి రంగంలోకి దింపడానికి తెదేపా నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఏఏ సొసైటీ నుంచి ఎవరిని ఛైర్మన్‌గా నియమించాలనే అంశంపై ఇప్పటికే నియోజకవర్గాల వారీగా కూటమి నాయకులు చర్చలు జరిపి నట్లు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల జాబితాలు సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపారని తెలుస్తుంది. అనకాపల్లి నియోజకవర్గంలో అయిదు సొసైటీలుంటే వాటిలో.. రెండు తెదేపాకు, మూడు జనసేనకు కేటాయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పట్టణంలోని రెండు సొసైటీల్లో చెరొకటి తీసుకోగా.. గ్రామీణ ప్రాంతాల్లో మూడింటిలో ఒకటి తెదేపా, రెండు జనసేన తీసుకున్నట్లు తెలిసింది. వీటి కోసం రైతుల్లో గట్టి పోటీ ఉంది. పదవిని పొందేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల చుట్టూ తిరుగుతున్నారు.

# ఇంజినీరింగ్ విద్య.. అందని ద్రాక్ష

ఒంగోలు : రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ప్రకాశం ఒకటి.. వలసలకు మారుపేరు.. ప్రస్తుత తరం కూడా అందుబాటులో ఉన్న బడుల్లో పదోతరగతి వరకు చదివిన తరువాత హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు వలసపోతున్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్య కళాశాలలు లేకపోవడం, ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేకపోవడంతో పేదింటి పిల్లలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం (ఏకేయ) పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల పెడతామని ఊరిస్తున్నారే తప్ప ఆచరణలో అడుగులు ముందుకు పడడం లేదు. ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయం అధికారులు సంయుక్త కార్యాచరణతో ముందుకెళితే కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులను ఇంజినీర్లుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరేవారే జిల్లాలో ఎక్కువగా ఉంటున్నారు. జిల్లాలోని సుమారు 130 డిగ్రీ కళాశాలల్లో 30 వేలమందికిపైగా డిగ్రీ అభ్యసిస్తున్నారు. కాస్త స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరిపోతున్నారు. మిగిలినవారు ఓ వైపు పార్ట్‌టైం జాబ్ చేస్తూ డిగ్రీ కొనసాగిస్తున్నారు. అదే ఇంజినీరింగ్ విద్యలో మంచి ప్రతిభ చూపితే రూ.లక్షల జీతం పొందేందుకు అవకాశం ఉంటుంది. నాగార్జున విశ్వవిద్యాలయం



పరిధిలో జిల్లాలో పీజీ కేంద్రాలు తప్పించి వృత్తి విద్యా, సాంకేతిక కళాశాలలు ఏర్పాటు చేయలేదు. ఎనిమిదేళ్ల కిందట ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఏర్పాటైనా నిధుల్లేక ఒక్క భవనాన్ని నిర్మించలేదు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలంటే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనల ప్రకారం 40 వేల చదరపు అడుగుల భవనాలు చూపించాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయం పరిధిలో అయినందున అనుమతులకు పెద్ద కష్టమేమి కాదు. ఆ దిశగా ఆలోచన చేస్తే పేద కుటుంబాలకు చెందినవారు ఏటా 300 నుంచి 400 మందిని ఇంజినీర్లుగా తయారు చేయవచ్చు.

**వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తాం**

ఒంగోలు నగర శివారు పేర్నమిట్ట వద్ద ఉన్న స్థలంలో ఇంజినీరింగ్ కళాశాల నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం డిమాండు ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఎనలిటిక్స్.. అధునాతన కోర్సులతో ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తాం. డీవీఆర్ వర్తి, ఉపకులపతి, ఏకేయ

# చెన్నై, చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌లలో దోపిడీ

గుత్తి : అనంతపురం, కర్నూలు జిల్లాల్లో చెన్నై ఎక్స్‌ప్రెస్, చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌లో చొరబడి ప్రయాణికులను నిలువు దోపిడీ చేశారు.రైల్వే సిగ్నల్ కేబుల్‌ను కత్తిరించి ఈఘాతుకానికి పాల్పడ్డారు. తాడిపత్రి మండలం కోమలి, కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని రామలింగాయపల్లి వద్ద దోపిడీలు జరిగినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. కోమలి రైల్వేస్టేషన్ శివారులో సిగ్నల్ కేబుల్‌ను దుండగులు కత్తిరించగా చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు లోకోపైలెట్ సిగ్నల్ ఇవ్వలేదని రైలును ఆపారు. సరిగ్గా తెల్లవారుజామున 3.55కి రైలు ఆగడంతో ముగ్గురు దుండగులు రైలులోని ఎస్-1 బోగీలోకి చొరబడి కడపకు వెళుతున్న గుత్తికి చెందిన విశాలాక్షి మెడలోని 2.7 తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కున్నారు. అంతలో ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. ఆపరేటింగ్ అధికారులు




సిగ్నల్ కేబుల్‌ను కత్తిరించిన విషయాన్ని గుర్తించి తాత్కాలికంగా పేపర్‌లో రైలు వెళ్లడానికి అనుమతులతో కూడిన ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో చెన్నై ఎక్స్‌ప్రెస్‌తోపాటు రెండు గూడ్స్ రైళ్లను పంపారు. కడపకు చేరుకోగా విశాలాక్షి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు కత్తిరించిన కేబుల్‌ను ఎస్అండ్‌టీ అధికారులు పునరుద్ధరించారు.

**రైలు ఆగడంతో..**కర్నూలు జిల్లా రామలింగాయపల్లిలో 2.30 గంటలకు ఆగింది. వెంకట్రాద్రి ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో క్రాసింగ్ ఇచ్చి చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌ను ఆపరేటింగ్ అధికారులు నిలిపారు. అక్కడ 11 నిమిషాలపాటు రైలు ఆగడంతో దుండగులు బోగీలోకి వెళ్లి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు అక్కడే ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఏప్రిల్ 29న గుత్తిశివారులో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగినా రైల్వేపోలీసులు మొద్దునిద్రను వీడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. రెండు రైళ్లల్లో దోపిడీలు జరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

# సర్వే నంబర్లు మార్చి.. ఏమార్చి

కేవీబీపురం : ఎం.ఎ.రాజులకండ్రిగ గ్రామకంఠంలోని సర్వే సంఖ్య 256లో పాలూరు కుమారి, ఆమె భర్త వెంకటసుబ్బయ్య నివసిస్తున్నట్లు గ్రామ సచివాలయ సర్వేయర్ మునెయ్య అందించిన పొజిషన్ ధ్రువపత్రమిది. కానీ రెండు కిలోమీటర్ల దూరంలోని సర్వే సంఖ్య 512-2లోని గిరిజనకాలనీలో వీరు ఉంటున్నారు. వారు ఉంటున్న ప్రాంతం కొండ పోరంబోకు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు జరగవు. పేదల అవసరాన్ని గుర్తించిన సర్వేయర్ మరో సర్వే సంఖ్య వేసి పొజిషన్ సర్టిఫికేట్లు జారీ చేశారు. ఇలాంటివి ఎం.ఎ.రాజులకండ్రిగలో పదుల సంఖ్యలో దర్శనమిస్తాయి. కేవీబీ పురం మండలం ఎం.ఎ.రాజుల కండ్రిగ సర్వే సంఖ్య 512-2లో నాలుగు ఎకరాల కొండ పోరంబోకు, సర్వే సంఖ్య 328-1లో కాలువ, 328-2లో గ్రామకంఠం 56 సెంట్లు, 328-3 నుంచి 17 వరకు పట్టా భూములున్నాయి. ఇదే రెవెన్యూలోనే సర్వే సంఖ్య 256లో 8.12 ఎకరాలు గ్రామకంఠం. గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం నిషేధిత జాబితాలో ఉండటంతో వారి అవసరాన్ని సర్వేయర్ సొమ్ము చేసుకున్నారు. లబ్ధిదారులు ఒకచోట ఉంటే పొజిషన్ మరోచోట ఇచ్చి ఆ స్థలం రిజిస్ట్రేషన్ అయ్యేలా రికార్డులు తారుమారు చేశారు. ఎం.ఎ.రాజులకండ్రిగలోని ఎస్సీ, ఎస్టీల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సదరు సర్వేయర్ 30 మందికిపైగా పొజిషన్ పత్రాలు అందించారు. ఒక్కొక్కరి వద్ద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తంతు 2022 అక్టోబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు సాగింది.

**ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ..**

కేవీబీ పురం మండలం కోటమంగాపురం సచివాలయ సర్వేయర్‌గా మునెయ్య ఉండేవారు. నాటి వైకాపా నేతల ఆశీస్సులతో ఎంఏరాజుల కండ్రిగ, సదాశివపురం, మిద్దికండ్రిగ సచివాలయాల్లోనూ ఇన్‌ఛార్జిగా బాధ్యత తీసుకున్నారు. ఆయా పంచాయతీల్లో గిరిజనులు ఎక్కువగా ఉండటంతో వారి నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రభుత్వ, నిషేధిత స్థలాల రికార్డులు తారుమారు చేసి ఇలా అనేక ధ్రువపత్రాలు ఇచ్చారని ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జిగా ఉన్న ఒక్క సచివాలయంలోనే ఆయన లీలలు ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లో ఇంకెన్ని అక్రమాలు ఉంటాయోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సర్వేయర్ అవినీతి బాగోతాన్ని కొందరు కలెక్టర్‌కు వివరించినట్లు సమాచారం. దీనిపై శ్రీకాళహస్తి ఆర్డీవోను వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

# ప్రై'వేట'.. కనిపించని బడిబాట

చిత్తూరు : కూటమి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి తొమ్మిది రకాల పాఠశాలలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఇందుకు ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, ఎస్ఎంసీ సభ్యులు సమన్వయంతో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇది కాస్తా నత్తనడకన సాగుతోంది. ప్రైవేటు యాజమాన్యాలు మాత్రం గ్రామాల్లో ముమ్మరంగా తిరుగుతూ పిల్లలను తమవైపు మళ్లిస్తున్నారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ నెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని, బడిబాట కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలను ప్రారంభించారు. దాంతోపాటు మీ గ్రామంలో పాఠశాలను ఎత్తివేశారని చెబుతూ విద్యార్థులను వారి పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు. అలాగే ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతికి ఎలాంటి ఫీజులు లేవని చెబుతూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. మోడల్ పాఠశాలల వ్యవస్థతో కొన్ని చోట్ల 3, 4, 5 తరగతులు రద్దు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు.

**కొన్నింటిని పరిశీలిస్తే..**

పుత్తూరు మండలం తడుకు ప్రాథమిక పాఠశాలలో ఒకరు కూడా ప్రవేశం పొందలేదు.

పలమనేరు మండలం కల్లాడు ప్రాథమిక పాఠశాలలోనూ ఎవరూ చేరలేదు.

**బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి**

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు

# ఘాటెక్కిన మిరప సాగు



అనంతపురం: పెరిగిన పెట్టుబడులు.. అమాంతం పడిపోయిన ధరలు వెరసి మిరప రైతును తీవ్రంగా కుంగదీస్తున్నాయి. రెండేళ్లుగా కనీస ధర లేక ఉమ్మడి జిల్లా మిరప రైతులు నష్టపోయారు. వచ్చే ఏడాదైనా ధర పెరగకపోతుందా అని పంటను గోదాముల్లో నిల్వ చేసి ఆశగా ఎదురుచూస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. తెగుళ్ల రూపంలో కష్టాలు, ధరల రూపంలో నష్టాలు వెంటాడుతున్నా.. కొందరు రైతులు ఈ ఏడాది కూడా మిరప సాగుకు సిద్ధమవుతున్నారు. ఏటా రుణభారం పెరుగుతుండటంతో చాలామంది సాగు చేయడం మానేస్తున్నారు.

**సగానికి సగం పడిపోయి..**

2021-22లో చైనా లాంటి దేశాలకు ఎగుమతులు పెరగడంతో బ్యాడిగ మిరప ధర క్వింటాకు రూ.40 వేలకు పైగానే పలికింది. దీంతో రైతులు మిరప సాగును పెంచారు. ప్రధానంగా ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో విస్తీర్ణం పెరిగింది.

అంతర్జాతీయ మార్కెట్ కుదేలు కావడంతో గతేడాది ధరలు పతనమయ్యాయి. 2023లో రూ.35 వేలు ఉన్న ధర ఏడాదిలోనే రూ.12 వేలకు పడిపోయింది. దీంతో పంట అమ్ముకోకుండా గోదాముల్లో నిల్వ చేసుకుంటూ వచ్చారు. రెండేళ్లకుగాను 1.21 క్వింటాళ్ల మిరప బళ్లారిలోని శీతల గిడ్డంగుల్లో నిల్వచేసుకుని ఎప్పటికైనా ధర పెరగకపోదా అని నిరీక్షిస్తున్నారు.

2022-23లో 30 వేల ఎకరాల్లో సాగు చేయగా.. 2024-25లో 14 వేల ఎకరాలకు పడిపోయింది.

విదేశాలకు ఎగుమతి ఉంటేనే మిరపకు మంచి ధర లభిస్తుంది. మిరపపై పురుగు మందులు అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయనే కారణంతో పంటను తిరస్కరిస్తున్నారు. దీంతో ఎగుమతులు నిలిచిపోతున్నాయి.

**40 శాతం పెరిగిన పెట్టుబడి**

ఐదేళ్ల కిందటి వరకు ఎకరా మిరప సాగుకు సగటున రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టేవారు. కొవిడ్ తర్వాత మిరపలో నల్ల తామర బెడద మొదలైంది. దీన్ని నివారించడానికి పెద్దమొత్తంలో పురుగు మందులు వాడాల్సి రావడంతో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో 50 మి.లీ. రూ.2 వేలకు తక్కువగా దొరకడం లేదు. పురుగు మందులకే ఎకరాకు రూ.75 వేలు ఖర్చవుతోంది. ప్రస్తుతం ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు.

**పెట్టుబడిలో సగం రాదు**

హనుమేష్, పొలికి, విడపనకల్లు

సింజంట డబ్బి రకం 12 ఎకరాల్లో సాగు చేస్తే 600 బస్తాల దిగుబడి వచ్చింది. రూ.24 లక్షలు ఖర్చుపెట్టాను. బళ్లారిలోని శీతల గిడ్డంగిలో నిల్వ చేశా. ప్రస్తుతం క్వింటా రూ.10 వేలు పలుకుతోంది. అమ్మితే పెట్టుబడిలో సగం కూడా రాదు. శీతల గిడ్డంగి అద్దె భారం పెరుగుతోంది.

# అరకొర మందులు.. అవస్థల్లో కార్మికులు




హిందూపురం : మందులు, పరీక్షలు లేక కొట్నూరు, హిందూపురం ప్రభుత్వ కార్మికుల రాజ్యాంగ బీమా(ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాలు)- వైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయి. దాదాపు నెలరోజులుగా మందులు అందుబాటులో లేక వేలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మధుమేహం, ఇతర వ్యాధులకు సైతం మందులు అందుబాటులో లేక ప్రతిరోజూ ఆసుపత్రికి చికిత్సకు వచ్చే రోగులు ప్రైవేట్‌లో కొనుక్కోవాల్సి వస్తోంది. ఇక్కడికి మందులు సరఫరా కావాలంటే కర్నూలు జిల్లా ఆదోని నుంచి రావాలి. దీని కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు.. అది ఇప్పటి వరకు రాకపోవడంతో డిస్పెన్సరీలకు మందులు సరఫరా కాలేదని సిబ్బంది చెబుతున్నారు.

**వేతనంలో ప్రతి నెలా 5శాతం చెల్లించినా..**

ఈ డిస్పెన్సరీ కేంద్రాల పరిధిలో ఉన్న కార్మికులు ప్రతి నెలా తమకు వచ్చే వేతనాల్లో 1.5 శాతం, సంబంధిత యాజమాన్యం 3.5శాతం మొత్తం ఐదుశాతం డబ్బు వైద్యసేవలకు ఈఎస్ఐకి అందిస్తుంది. ఇంత మొత్తం ప్రతి నెలా కార్మికుల నుంచి అందుతున్నా తగిన వైద్య సదుపాయాలు అందటం లేదు. దీనివలన కార్మికులు అనారోగ్యాలకు గురైతే ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి రెండు రకాల ఆర్థికంగా నష్టపోతున్నారు.

**కట్టు కట్టాలన్నా సిబ్బంది లేరు**

కార్మికులు పరిశ్రమల్లో పనిచేసే సమయంలో గాయాలపాలై ఆసుపత్రికి వస్తే కనీసం మందురాసి కట్టుకట్టేందుకు తగిన సిబ్బంది లేరు. దీనివలన ఇక్కడ ఏ చిన్న గాయమైనా ప్రభుత్వ ఆసుపత్రి, లేదా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యలపై ఎమ్మెల్యే బాలకృష్ణ చర్యలు తీసుకొని కార్మికులకు మందులు, వైద్యపరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

**కనీస పరీక్షలేవీ?**

డిస్పెన్సరీ కేంద్రాల్లో రెండేళ్ల నుంచి పరీక్షలకు తగిన రసాయనాలు సరఫరా లేక కనీస పరీక్షలు జరగటం లేదు. యూరిన్, థైరాయిడ్, మలేరియా, కిడ్నీ తదితర దాదాపు 20 రకాల పరీక్షలు ఇక్కడ చేయాల్సి ఉంది. దీనికోసం టెక్నిషియన్ అందుబాటులో ఉన్నా రసాయనాలు సరఫరా లేక ఎలాంటి పరీక్షలు జరగటం లేదు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాలు- హిందూపురం, కొట్నూరు
పరిశ్రమలు - 80వరకు
కార్మికులు - 40వేల మంది
ప్రస్తుతం ఉన్న సిబ్బంది- 7
ఖాళీలు - 13

**పంపిణీ కేంద్రానికి మందులు చేరాయి**

డిస్పెన్సరీ కేంద్రాలకు అవసరమైన మందులకు మార్చిలోనే ఇండెంట్ చేశాం. ఈ మందులు ఇప్పటికే పంపిణీ కేంద్రం ఆదోనికి చేరాయి. అక్కడి నుంచి రావాల్సి ఉంది. రవాణాలో సమస్య వలన జాప్యం జరిగింది. త్వరలోనే వస్తాయి.రవికాంత్, వైద్యాధికారి

# అభ్యసన సామర్థ్యాలకు విద్యాశక్తి

పెనుకొండ : గణితం, విజ్ఞానశాస్త్రం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి, జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విజయం సాధించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యాశక్తి పథకం అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ మద్రాస్ వారి సహకారంతో నిర్వహిస్తున్న విద్యాశక్తి(ఫేజ్-2)కింద రాష్ట్ర వ్యాప్తంగా 74 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఒక్క పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రమే ఎంపికైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో, ప్రాక్టికల్ రికార్డు పుస్తకాలు అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ కళాశాలలో నూతన తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు, దాతల సహకారంతో 50 కంప్యూటర్లతో ప్రత్యేకమైన ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 380 మంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 160మంది ఉన్నారు. కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ద్వారా 2025-26 విద్యాసంవత్సరంలో కళాశాల చేరే విద్యార్థుల సంఖ్య 400 దాటనుంది. ఇప్పటికే 160మంది చేరారు.

**గ్రామీణ విద్యార్థులకు వరం**

గ్రామీణ ప్రాంతాల నుంచి గణితం, విజ్ఞానశాస్త్రం అభ్యసించే విద్యార్థులు, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులతో నీట్, జేఈఈ లాంటి పరీక్షల్లో పోటీ పడేవిధంగా ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం కోసం విద్యాశక్తి పథకం అంతర్జాలం ద్వారా ఐఐటీ మద్రాస్ సహకారంతో కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశక్తి తరగతులు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు



ఛాంపియన్ బ్యాడ్జిలు అందజేస్తారు. విద్యార్థులు ఈతరగతులను సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవితకు మార్గం సుగమం చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

**పాఠాలు గుర్తుండిపోతాయి**

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యాశక్తి పథకం ద్వారా నిర్వహిస్తున్న తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయి. తరగతి గదిలో అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలు కాకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా పాఠాలు క్షుణ్ణంగా వివరిస్తారు. ఈ తరగతులు అంతర్జాలం ద్వారా వినడం వల్ల గుర్తుండిపోతాయి. అక్షయ, ఎంపీసీ

**పోటీ పరీక్షలకు ఉపయోగం**

విద్యాశక్తి పథకంతో ఇంటర్ పూర్తిచేసిన తరువాత జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ప్రత్యేక శిక్షణకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. విద్యాశక్తి తరగతులు భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. వసీం, ఎంపీసీ

# వేటుపడినా.. వీడని వక్రబుద్ధి

తిరుచానూరు : పన్ను ఆదాయం పక్కదోవ పట్టకుండా ప్రభుత్వం ఓవైపు పటిష్ఠ చర్యలు చేపడుతుండగా పంచాయతీ సిబ్బంది మాత్రం ఏంచక్కా పక్కదోవపట్టిస్తున్నారు. తిరుచానూరు పంచాయతీ పరిధిలో ఏకంగా రూ.22 లక్షలను బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు స్వాహాచేసినట్లు వెల్లడైంది. ఏడాదిగా వసూలు చేసిన నగదు సొంతానికి వాడుకుంటున్నా పంచాయతీ కార్యదర్శులు గుర్తించనట్లు తెలుస్తోంది. పంచాయతీకి ఏటా పన్నుల రూపంలో రూ.2 కోట్లకు పైగా వసూలవుతుంది. ఎప్పటికప్పుడు ట్రెజరీలోని ప్రభుత్వ ఖాతాకు నగదు జమచేయాల్సి ఉండగా బిల్లు కలెక్టర్ పక్కదోవ పట్టించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇక్కడ ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శుల పాలన నడుస్తోంది. వారు పూర్తిస్థాయిలో లేకపోవడం... అప్పుడప్పుడు వచ్చినా పన్నుల గురించి పట్టించుకోకపోవడంతో స్వాహా చేసినట్లు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఇంత జరిగినా చర్యలు తీసుకునేందుకు అధికారులు సంశయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బిల్లు కలెక్టర్‌పై చర్యలు తీసుకుంటే తమ నిర్లక్ష్యం ఎక్కడ భయపడుతుందోనన్న కారణంతో నిధుల స్వాహా విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు స్పష్టమవుతోంది. స్వాహా చేసిన మొత్తం మరింత ఎక్కువగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**అప్రమత్తం**

తిరుచానూరు బిల్లు కలెక్టర్ నిర్వాకంతో మండలస్థాయి అధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన పంచాయతీల్లోనూ బిల్లులు వసూలు, చెల్లింపులపై ఆడిటింగ్ మొదలుపెట్టారు. రికార్డులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

**పన్ను వసూలుకు దూరం ఉంచినా..**

గత తెదేపా పాలనలో ఇదే బిల్లు కలెక్టర్ సస్పెండ్‌కు గురయ్యారు. పంచాయతీ పరిధిలోని అపార్ట్‌మెంట్ వాసులకు ఇంటి పన్ను వేసేందుకు దాదాపు రూ.5 లక్షల వరకు వసూలు చేయగా ఫిర్యాదు అనంతరం సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో బిల్లు కలెక్టర్‌గా తిరిగి నియమితులైనా పన్ను వసూలు బాధ్యతలకు దూరంగా ఉంచారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన పూర్తిస్థాయి బిల్లు కలెక్టర్ బాధ్యతలు చేపట్టి తన వక్రబుద్ధిని చూపించాడు. ఘటనపై డివిజన్ పంచాయతీ అధికారి సురేష్ నాయుడును వివరణ కోరగా ఇప్పటికే విచారణ చేసి నివేదిక సిద్ధం చేశామన్నారు. నిధులు స్వాహా చేసినట్లు ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మాధవి గుర్తించి నోటీసులు ఇచ్చారని వెల్లడించారు.

# సొంత భవనాల్లో పాలనెప్పుడో ?

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని అందించే ప్రధాన శాఖల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. ఎంత ఆదాయం ఆర్జించి ఏం లాభం? కార్యాలయానికి సొంత భవనాల్ని సమకూర్చుకోలేని స్థితిలో ఈ శాఖ ఉంది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు కొన్ని ఇంకా అద్దె భవనాల నుంచే పాలన కొనసాగిస్తు న్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు దాదాపు చాలాచోట్ల సొంత భవనాలు ఉన్నాయి. ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండటం గమనార్హం. దీంతో నెలవారీగా అద్దె చెల్లించడం భారంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్ని సొంత భవనాల్లో నిర్వహించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**ఐదుచోట్ల ఇలా..**జిల్లాలో 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, కార్వేటినగరం, నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చాలా ఏళ్లుగా అద్దె భవనాల నుంచే కార్యకలాపాలు



నిర్వహిస్తున్నాయి. అద్దె చెల్లింపులకు బడ్జెట్ సక్రమంగా విడుదల కాకపోవడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. చిత్తూరు అర్బన్, కుప్పం, పుంగనూరు, పలమనేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సొంత భవనాల ద్వారా పాలన సాగిస్తున్నాయి.

**కనీస సౌకర్యాల కరవు..**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు బాగానే జరుగుతున్నాయి. అయితే పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే క్రయవిక్రయదారులకు కనీస సౌకర్యాలు లభించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కూర్చునేందుకు కుర్చీలు ఉండవు, మరుగుదొడ్లు ఉన్నా.. అవి అలంకార ప్రాయమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా కార్యాలయాలకు సొంత భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# గానుగాట ఉన్నట్టా.. లేనట్టా?

చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారం పరిధిలోని గ్రామాల్లో ఈ ఏడాది చెరకు సాగు ముందుకు సాగడం లేదు. 2025-26 కాలానికి గానుగాట జరుగుతుందో, లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, కర్మాగారం ఎండీ రైతులకు భరోసా ఇచ్చేలా ఇప్పటివరకు ప్రకటన చేయకపోవడంతో చెరకు సాగుకు మొగ్గు చూపడం లేదు. గతంలో ఏటా ఎంత విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నారు. కర్మాగారానికి ఎన్ని టన్నులు సరఫరా చేస్తారంటూ ఆరా తీస్తూ రైతుల నుంచి ఒప్పంద ప్రతాలు రాయించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వ్యవసాయ క్షేత్ర సిబ్బంది ఆరుగురే ఉన్నారు. కొద్దోగొప్పో చెరకు సాగవుతున్నా.. పంటంతా గోవాడ కర్మాగారానికే వస్తుందన్న గ్యారంటీ లేదు. ప్రైవేటు కర్మాగారాలు, రసంగా విక్రయించే వారు, బెల్లం తయారీదారులు పొలాల వద్దకు వెళ్లి చెరకు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఈ పరిస్థితుల్లో కర్మాగారంలో పరిధిలో పండే చెరకంతా గానుగాటకే వస్తుందన్న నమ్మకం లేదని ఫీల్డ్‌మెన్లు చెబుతున్నారు. గ్రామాల్లో కార్శి తోటలు కనిపిస్తున్నా, చెరకు దవ్వ నాటిన మడులు పెద్దగా లేవు. చెరకు పండించే భూముల్లో సరుగుడు నారు వేస్తున్నారు. కర్మాగారం మనుగడ ప్రశ్నార్థకంగా మారకముందే గానుగాటపై పాలకులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు, రైతు సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

ఈ చిత్రంలోని రైతు పేరు కోయిలాడ సూరిబాబు. బుచ్చెయ్యపేట మండలం కుముందానిపేట స్వగ్రామం. గోవాడ కర్మాగారానికి ఏటా 30 టన్నుల వరకు చెరకు సరఫరా చేసేవారు. గతేడాది నుంచి సాగు తగ్గించారు. ఈ ఏడాది సాగు ఊసే ఎత్తడం లేదు.

చురకలు



# రైతు ముసుగు.. వ్యాపారి సరకు

నంద్యాల : అధికారులు, గోదాముల సిబ్బంది ఒక్కటయ్యారు. వ్యాపారులతో కుమ్మక్కై జొన్నల కొనుగోళ్లలో అక్రమాలకు తెరలేపారు. నకిలీ ట్రక్ షీట్లతో మాయ చేశారు.. క్వింటాపై రూ.1370 దోపిడీకి పాల్పడ్డారు. క్వింటాకు రూ.3,370 చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.. జిల్లాలో 30 వేల టన్నుల జొన్నలు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కొనుగోలు కేంద్రాలకు దిగుబడులు పోటెత్తడంతో నిల్వ చేసేందుకు గోదాముల కొరత ఏర్పడింది. దీంతో నంద్యాల సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు మార్కెట్‌యార్డు గోదాములు, గోస్పాడు మండలం దీబగుంట్ల, గడివేముల మండలం గడిగరేవుల వద్ద ప్రైవేటు గోదాములను లీజుకు తీసుకున్నారు. అక్కడ సిబ్బందితో వ్యాపారులు కుమ్మక్కై దందా చేశారు. "ప్రతి బస్తాలో 51.200 కిలోలు నింపాం. గోదాము వద్ద 522 బస్తాలు మాత్రమే ఉన్నాయని చూపించి రసీదు ఇచ్చారు. దీంతో రూ.23 వేల వరకు నష్టపోయామని" గోకార్ ఆవేదన వ్యక్తం చేశారు.

**గడువు ముగిసినా గుట్టుగా**

జొన్నల కొనుగోలు ఈనెల 16వ తేదీతో ముగిసినట్లు అధికారులు



ప్రకటించారు. కానీ గత పది రోజులుగా గడిగరేవుల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ గోదాములకు జొన్నలు వస్తూనే ఉన్నాయి. సిఫార్సుల మీద కొనుగోళ్లు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశామని మరో 5 వేల టన్నులు కొంటామని అధికారులు చెబుతున్నారు.

**సంచికి అర కిలో కోత**

సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములకు రైతులు తీసుకొచ్చే జొన్నల విషయంలో కూడా అధికారులు భిన్న ప్రకటనలు చేశారు. నంద్యాల గోదాములకు దిగుబడులు తెచ్చే రైతులు ఒక్కో సంచిలో 51.200 కిలోల జొన్నలు తేవాలన్నారు. గడిగరేవుల, నందికొట్కూరు గోదాములకు 51.700 కిలోలు చొప్పున తీసుకురావాలని చెప్పారు. ఆ తర్వాత అన్ని గోదాముల్లో 51.200 కిలోల లెక్కన కొనుగోలు చేశారు. దీంతో బస్తాకు అర కిలో చొప్పున మిగుల్చుకున్నారు. తూకం వేసిన సిబ్బంది మిగిలిన జొన్నలకు లెక్క కట్టకుండా మొత్తం సరకులోకే కలిపారు. దీంతో చాలామంది ఒక్కొక్కరు 30- 50 కిలోల వరకు నష్టపోయారు.

**క్వింటాపై రూ.1370 దోపిడీ**

గడివేముల మండలం గడిగరేవుల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల పేరుతో వ్యాపారులు నకిలీ రసీదులు సృష్టించారు. ఈ రసీదులతో పంట నమోదు చేయని దిగుబడులతో పాటు, మగజొన్నలు, నాణ్యత లేని సరకును గోదాములకు తరలించారు.

బహిరంగ మార్కెట్‌లో క్వింటా జొన్నల ధర రూ.2,700 వరకు ఉంది. మగజొన్నలు, నాణ్యత లేని వాటిని రూ.2 వేలతో కొంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులు మార్క్‌ఫెడ్ సిబ్బంది, గోదాము అధికారులతో కుమ్మక్కయ్యారు. క్వింటా రూ.2 వేల ధర పలికే జొన్నలను నకిలీ ట్రక్ షీట్ల ద్వారా గోదాములకు తరలించి రూ.3,370కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. క్వింటాపై రూ.1370 అక్రమంగా లబ్ధి పొందారు.

**నకిలీ ట్రక్ షీట్లు సృష్టించి**

నిబంధనల ప్రకారం జొన్నలు విక్రయించాలంటే సాగులో ఉండగానే రైతులు ఈ-పంట నమోదు చేయాలి. అమ్మకాల సమయంలో రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో దిగుబడుల వివరాలు ఆన్‌లైన్ చేయించుకోవాలి. ఆ తర్వాత మార్క్‌ఫెడ్ అధికారులు ఇచ్చిన ట్రక్ షీట్లతో ఎంపిక చేసిన గోదాముల్లో జొన్నలను దించాలి.

ట్రక్ షీట్లలో ఉన్న వివరాలను పరిశీలించి కాటా వేసిన తర్వాత జొన్నలను గోదాముల్లో నిల్వ చేస్తారు. దీన్ని అవకాశంగా మార్చుకున్న కొంతమంది నకిలీ ట్రక్ షీట్లతో జొన్నలు తీసుకొచ్చారు.

మార్క్‌ఫెడ్ అధికారులు ఇచ్చినవి కాకున్నా గోదాముల వద్ద గుడ్డిగా కొనుగోలు చేశారు. ఇటీవల అధికారులు ట్రక్‌షీట్లను పరిశీలిస్తున్న సమయంలో ఈ నకిలీల బాగోతం బయటపడినా గుట్టుగా ఉంచారు.

# స్థానికంగానే ఉత్పత్తి.. ఉపాధి!

నరసాపురం : పాలకోడేరు మండలం విస్సాకోడేరు శివారు వంకాయల పాలెం వద్ద ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కేటాయించిన భూమి ఇది. ఈ నెల 15న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు.నాడు వైకాపా సర్కారు అనాలోచిత విధానాలతో పశ్చిమలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడి యువతకు ఉపాధి అవకాశాలు దూరమయ్యాయి. ఈ లోటును అధిగమించే దిశగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పునరుజ్జీవం పోసేలా కూటమి సర్కారు కార్యాచరణ అమలు చేస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున పారిశ్రామికవాడల ఏర్పాటులో భాగంగా ఉండి, నరసాపురంలలో ఇటీవల నిర్మాణాలకు అంకురార్పణ చేశారు.

**సకల సదుపాయాలతో..**

ఉండి నియోజకవర్గానికి సంబంధించి పాలకోడేరు మండలం విస్సాకోడేరులో 9.78 ఎకరాలు, నరసాపురం నియోజకవర్గ పరిధి లిఖితపూడిలో 9.09 ఎకరాలు చొప్పున స్థలాలను కేటాయించారు. ఆయా ప్రాంతాలు ఇక పరిశ్రమల హబ్‌గా మారనున్నాయి. విస్సాకోడేరులో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఇండస్ట్రియల్ పార్క్) నిర్మాణానికి ప్రభుత్వం రూ.10.50 కోట్లు మంజూరు చేసింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వారి వ్యయప్రయాసలు లేకుండా ఏపీఐఐసీ ద్వారా మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా జీప్లస్ 2 భవనాలు నిర్మించనున్నారు. వీటిలో ఫ్లగ్ అండ్ ప్లే విధంగా నేరుగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. రోడ్లు, పార్కింగ్, విద్యుదీకరణ సౌకర్యాలు కల్పిస్తారు. ఇక్కడ నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాల కల్పన తప్పనిసరి. ఇతర వ్యాపారాలు వృద్ధి చెంది పరోక్షంగా మరి కొందరికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**త్వరితగతిన అనుమతులు..** ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణాలు త్వరలోనే చేపడతామని జిల్లా పరిశ్రమల అధికారి మంగపతిరావు తెలిపారు. వీటిలో పరిశ్రమల స్థాపనకు అన్ని అనుమతులు త్వరగతిన మంజూరవుతాయని పేర్కొన్నారు.

# కాలం సంధించిన 'బ్లాక్' బాణం



నర్సీపట్నం : కింగ్ జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) భవన నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. రూ.23 కోట్లతో 2023 ఆగస్టు నెలలో పనులు ప్రారంభించినా.. నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం శ్లాబుల వరకు పనులు జరిగాయి.

**గుత్తేదారుడిపై వేటు:** ఇటీవల సింహాచలం కొండపై చందనోత్సవం సందర్భంగా జరిగిన దుర్ఘటనకు బాధ్యుడిని చేస్తూ... గుత్తేదారుడు, అతని సంస్థను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టింది. అదే సంస్థ కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) పనులు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ పనుల విషయమై సందిగ్ధత నెలకొంది. ఏడాది వ్యవధిలో పూర్తి కావాల్సిన పనులు, రెండేళ్లవుతున్నా.. అసంపూర్తిగానే ఉన్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే భవన నిర్మాణ పనులు ఆధారపడి ఉన్నాయని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

**నిధుల కేటాయింపు**

కేంద్రం మంజూరు చేసిన రూ.23 కోట్లలో రూ.10 కోట్లను భవన నిర్మాణానికి, రూ.7.50 కోట్లను వైద్య పరికరాల కొనుగోలుకు, మిగిలిన నిధులను ఇతర అవసరాలకు కేటాయించారు.

50 పడకలతో ఏర్పాటు చేసే క్రిటికల్ కేర్ బ్లాక్ కేజీహెచ్‌కు ఎంతో అవసరమని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

మూడు అంతస్తులతో కూడిన భవనం మొదటి ఫ్లోర్‌లో పూర్తి శీతలీకరణతో కూడిన ఐసీయూ ఉంటుంది. వెంటిలేటర్లతో పాటు ఇతర అత్యవసర ప్రాణ రక్షణ పరికరాలను ఏర్పాటు చేస్తారు. రెండు, మూడు అంతస్తుల్లో రోగులకు చికిత్స అందిస్తారు.

**అత్యవసర సమయాల్లో...**

ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులతో పాటు, విష తుల్య పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకుని అపస్మారక స్థితికి చేరుకొనే రోగుల్ని కేజీహెచ్‌కు తరలిస్తుంటారు. అలాంటి వారిని ఈ బ్లాక్‌లో చేర్చి, ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుంది.

శ్లాబులు, గోడలు పూర్తయినా... ఫ్లోరింగ్‌లు, ఇతరత్రా పనులు పూర్తి కాలేదు. పైగా ఈ భవనం నిర్మిస్తున్న ప్రదేశం లోతట్టులో ఉండడంతో భారీ వర్షాలు కురిసి ఎగువ నుంచి వరద వస్తే ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయించాలి.

భవనానికి మూడు వైపులా రక్షణ గోడ నిర్మించాల్సి ఉన్నా.. రెండు వైపులు మాత్రమే నిర్మిస్తున్నారు. ఈ అంశంపై వైద్యాధికారులు పరిశీలన చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# చౌరవ లేక.. ఆదాయం రాక!



నర్సీపట్నం : జిల్లాలోని ప్రధాన పట్టణాలైన అనకాపల్లి, నర్సీపట్నంలో జనసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణాలు మరింత రద్దీగా మారుతున్నాయి. దీంతో వ్యాపార, వాణిజ్య సముదాయాలకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో దుకాణాల రూపేణా చక్కటి ఆదాయం వస్తోంది. వాణిజ్య సముదాయాల ద్వారా ఆదాయం పెంచుకునే అవకాశంపై ఇటు మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ), అటు నర్సీపట్నం పురపాలిక దృష్టి సారించడం లేదు.జీవీఎంసీకి అనకాపల్లిలో 14 వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 159 దుకాణాలు ఉండగా... ఇందులో 10 శిథిలావస్థకు చేరుకున్నాయి. 59 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వాటిలో నాలుగు దుకాణాలను జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం వారు ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం 90 దుకాణాలనే అద్దెలకు ఇచ్చారు. వీటి ద్వారా ఏడాదికి రూ. 1.3 కోట్ల ఆదాయం వస్తుంది. అన్నింటిని అద్దెలకు ఇచ్చి ఉంటే రూ. రెండుకోట్లకు పైగా ఆదాయం వచ్చేది. వాణిజ్య సముదాయాల్లో నాలుగింటిని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే నిర్మించారు. చిననాలుగురోడ్ల కూడలిలో 25 దుకాణాలతో వాణిజ్య సముదాయం నిర్మించి ఆరేళ్లు కావస్తున్నా ఇందులో ఇంతవరకూ కేవలం ఏడింటినే అద్దెకు ఇవ్వగలిగారు. మిగిలినవి ఖాళీగానే ఉన్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో తెదేపా హయాంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. చాలాకాలం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎట్టకేలకు ఇటీవల వేలం నిర్వహించి ఏడుగురికి అద్దెలకు ఇచ్చారు. ప్రధాన రహదారిలో మూడు వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటిలో ఎనిమిది దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. చాలాకాలంగా అద్దెకు ఇవ్వకుండా నిరుపయోగంగా ఉంచడంతో వాటిలో అయిదు శిథిలావస్థకు చేరుకున్నాయి. గవరపాలెం ఉన్నత పాఠశాల, రాజీవ్‌గాంధీ స్టేడియం, సతకంపట్టు, వేల్పులవీధి మహిళా ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సముదాయాల్లో దుకాణాలన్నీ ఖాళీగానే ఉన్నాయి.

**క్రమాల పుట్టగా మారినా..**

జీవీఎంసీకి చెందిన దుకాణం ఒకసారి వేలంలో పాడుకుంటే చాలు... ఇక దాన్ని సొంత ఆస్తిలా ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయం ఉంది. ప్రైవేటు వ్యక్తుల వద్ద దుకాణాలు అద్దెకు తీసుకుంటే ఎప్పుడు కిరాయి పెంచుతారో.. ఎప్పుడు ఖాళీ చేయమంటారో తెలియదు. అదే జీవీఎంసీవి అయితే 25 ఏళ్లవరకూ ఎవ్వరూ కాళీ చేయించరు. అద్దెలు మూడేళ్లకు ఒకసారే పెంచుతారు. అందుకే వీటిని అద్దెకు తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు.

నిబంధనల ప్రకారం లీజుకు తీసుకునే సమయంలోనే ఏ వ్యాపారం చేస్తారు వంటి వివరాలు తెలుపుతారు. ఇప్పటికి అనేకమంది గుత్తేదారుల చిరునామాలు కార్యాలయంలో లేనట్లు తెలుస్తుంది. చాలా మంది గుత్తగా వేరేవారికి అమ్మకాలు చేస్తున్నారు.దీనిపై జోనల్ కమిషనర్ బీవీ రమణను వివరణ కోరగా దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నామ న్నారు. అద్దెలు ఎక్కువగా ఉన్నాయని తీసుకోవడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారి సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**చౌరవ లేక... ఆదాయం రాక!**

దాదాపు 75 వేల జనాభా కలిగిన ఈ పట్నం వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతోంది. విస్తీర్ణాన్ని బట్టి ప్రైవేటుగా ఒక్కో దుకాణానికి రూ. 20 వేలు నుంచి రూ. లక్ష వరకు అద్దెకు తీసుకుంటున్నారు. నర్సీపట్నంలో ప్రధాన రహదారిని ఆనుకుని మున్సిపాలిటీకి ఖరీదైన స్థలాలు ఉన్నప్పటికీ అక్కడ దుకాణాల సముదాయం నిర్మించేలా కార్యాచరణ చేపట్టడం లేదు.

నర్సీపట్నం నడిబొడ్డున ఎన్టీఆర్ మినీస్టేడియం వద్ద 18 దుకాణాల సముదాయం ఉండేది. ఏటా రూ. 27.6 లక్షల వరకు అద్దె వచ్చేది. పదినెలల క్రితం రోడ్డు విస్తరణ కోసం ఈ దుకాణాలను అప్పటి వైకాపా ప్రభుత్వం తొలగించింది. రోడ్డు విస్తరణ పనుల తరవాత కొత్తవి నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదు. కొంతమంది ఈ ప్రదేశంలోనే తాత్కాలికంగా బల్లలు వేసి దుకాణాలు నడుపుకొంటున్నారు. నర్సీపట్నం పంచాయతీగా ఉన్నప్పటి నుంచి అబీద్ సెంటర్‌లో పది దుకాణాలు, ఐదురోడ్ల కూడలి వద్ద ఏడు దుకాణాలు ఉన్నాయి. వీటిద్వారా ప్రస్తుతం ఏటా రూ. 10 లక్షల వరకు అద్దె వస్తోంది. పాత డీఎఫ్‌వో కార్యాలయానికి వెళ్లే మార్గంలో నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధాన ప్రధాన రహదారిని ఆనుకుని 40 సెంట్ల స్థలం మున్సిపాలిటీ ఆధీనంలో ఉంది. బహుళ అంతస్తుల్లో దుకాణాల సముదాయం నిర్మిస్తే రూ. లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పెదబొడ్డేపల్లిలో పాత పంచాయతీ కార్యాలయం వద్దా దుకాణాలు నిర్మించేందుకు అవకాశం ఉంది. ఆదాయం పెంచుకునేలా పాలకవర్గం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

# కుట్టుపై పట్టు.. ప్రగతికి మెట్టు

ఎమ్మిగనూరు : చేతివృత్తులపై మహిళలు దృష్టి సారించారు. స్వయంకృషితో ఎదగాలనే ఆలోచనలతో ముందుకు కదులుతున్నారు. నైపుణ్యాన్ని పెంచుకుని ప్రతిభతో రాణించాలని కొత్త డిజైన్లు నేర్చుకొంటున్నారు. వివిధ డ్రస్సులు, టీషర్టులు, పిల్లల షర్టులు, మహిళల జాకెట్లు, యువతుల ఫ్యాన్సీ డ్రస్సులను కుట్టడంలో తర్ఫీదు పొందారు. కొత్త డిజైన్లు కుట్టడంలో న్యాక్ కేంద్రం ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాల్లో ప్రభుత్వం తర్ఫీదును ఇప్పిస్తోంది. ఇందుకోసం బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తులు చేశారు. **ఉచితంగా కుట్టు మిషన్**


పట్టణంలోని ఎన్టీఆర్ కళాప్రాంగణంలో రోజూ ఉదయం, సాయంత్రం 150 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. మూడు నెలలు పాటు ఇచ్చే తర్ఫీదులో ముఖాధారిత హాజరు తప్పనిసరి. ఉదయం, మధ్యాహ్నం ఎఫ్ఆర్ఐ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. హాజరైన వారికి కుట్టుమిషన్లను ఉచితంగా ఇస్తారు.

**మూడు నెలల పాటు ప్రక్రియ**

పట్టణంలో న్యాక్ కేంద్రంలో ఏప్రిల్ 30 నుంచి శిక్షణను ప్రారంభించారు. మూడు నెలలు పాటు మహిళలకు ఉచితంగా శిక్షకులు నేర్పుతున్నారు. టీషర్టులు, టాపులు, లైనింగ్ జాకెట్లు, ప్రిన్స్‌కట్ బ్లౌజ్, పంజాబీ డ్రెస్సులు, అంబ్రెల్లా డ్రెస్సుల్ని ఎలా అందంగా కుట్టాలో నేర్పుతున్నారు.

**15 రోజులుగా..-శిరీషా, బోడబండ**

నేను ఇంటర్మీడియట్ చదివాను. ఇంటి వద్దే పనులు చేస్తున్నా. కుట్టు



మిషన్ ద్వారా కొత్త డిజైన్లు నేర్చుకోవాలని ఇక్కడికి వచ్చా. రోజూ ఉదయం వచ్చి డిజైన్లు నేర్చుకుంటున్నాను. ఇప్పటికి 15 రోజులుగా శిక్షణ తీసుకొని నేర్చుకున్నాను. టైలరింగ్‌కు సంబంధించి మెలకువలు నేర్పించారు. శిక్షణ తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ ఇస్తామన్నారు.

**ఆసరాగా ఉంటోంది -సాయిరూప, ఎమ్మిగనూరు పట్టణం**

నేను డిగ్రీ పూర్తి చేశా. ఇంట్లో ఖాళీగా ఉండలేక ఏదైనా శిక్షణ తీసుకోవాలని అనుకున్నా. ప్రభుత్వం కుట్టు శిక్షణ ఇవ్వడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. అమ్మానాన్నలు చేనేత మగ్గంపై రాణిస్తున్నారు. మా కుటుంబానికి ఆసరాగా ఉంటోందని శిక్షణ పొందుతున్నా.

**కుటుంబానికి అండ రాధమ్మ, బనవాసి**


నేను రోజు కూలి పనులకు వెళ్తున్నా. టైలరింగ్ నేర్చుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని భావించా. కుట్టు శిక్షణలో వివిధ డిజైన్లను నేర్చుకుంటున్నాను. పంజాబీడ్రస్సెస్, మిడ్, లంగావోణి, గాగ్రాచోళి, జాకెట్లు, ఇతర డ్రెస్సుల కుట్టులో శిక్షణ పొందాను.

# 'అన్నదాత సుఖీభవ'కు రెవెన్యూ చిక్కులు

ఒంగోలు : కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న 'అన్నదాత సుఖీభవ'కు రెవెన్యూ సమస్యలతో పాటు... గతంలో వైకాపా ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వే సాంకేతిక చిక్కులు తెచ్చిపెడుతోంది. ఆధార్ అనుసంధానంలో తప్పులు, మ్యుటేషన్లు, మృతుల పేర్లతో విస్తీర్ణం ఉండటం, తహసీల్దార్ డిజిటల్ సంతకం లేకపోవడం వంటి సమస్యలతో అర్హుల జాబితా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**జాయింట్ ఎల్‌పీఎంతో తలనొప్పులు...**

గత ప్రభుత్వం సర్వే నంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నంబరు వ్యవస్థతో వెబ్‌ల్యాండ్‌లో చిక్కులు తలెత్తుతున్నాయి. రీసర్వే సమయంలో అయిదారుగురు రైతులకు కలిపి సంయుక్త ఎల్‌పీఎం నంబరు కేటాయించి హక్కు పత్రాలు అందజేశారు. దీంతో పంట రుణాలకే కాదు, ప్రభుత్వ పథకాల మంజూరుకు ఇబ్బందులు తప్పడం లేదు. 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఎంపికలో మరింత



పారదర్శకత తీసుకురావాలన్న ఉద్దేశంతో రైతు సేవా కేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)తో పాటుబీ మండల వ్యవసాయాధికారి లాగిన్లకు ఇచ్చారు. ఈ క్రమంలో వెబ్‌ల్యాండ్‌లోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ల లాగిన్‌కు వివరాలు పంపారు. వీటిలో 44,596 మంది వివరాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

**అర్హుల్లో ఆందోళన**

'అన్నదాత సుఖీభవ' పథకం కింద కుటుంబం యూనిట్‌గా అర్హులైన రైతులకు ఏటా సాగు ఖర్చులకు రూ.20 వేల సాయం అందించనున్నారు. పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున మూడు విడతలగా రూ.6 వేలను రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. మిగిలిన రూ.14 వేలను మూడు విడతల్లో కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. వచ్చే నెలలో పథకం ప్రారంభించనున్నారు. నెలాఖరులోగా లబ్ధిదారుల జాబితా పరిశీలనకు గడువు ఇవ్వగా... రెవెన్యూ సమస్యల కారణంగా 44 వేల మంది వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

# సంక్షేమ రుణాల భారం!

ఏలూరు : జాతీయ బ్యాంకులతో పోటీ పడాల్సిన సహకార బ్యాంకులు గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పాలనలో నష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. రైతులకు రుణాలు ఇవ్వకుండా ఆ పార్టీ కార్యకర్తలకు వివిధ సంక్షేమ పథకాల్లో పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చారు. అయితే వీటి వసూలుకు బ్యాంకర్లు నానా పాట్లు పడాల్సి వస్తోంది.జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 34 శాఖల ద్వారా సుమారు రూ.65.71 కోట్ల మేర వివిధ పథకాలకు రుణాలు అందజేశారు. లబ్ధిదారులు వాటిని ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉన్నా గతంలో నేతలతో సిఫార్సు చేయించి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ఆ మేరకు డీసీసీబీ పరిధిలో మొండి బకాయిలు రూ.70.50 లక్షల మేర పేరుకుపోయాయి. ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం రుణాలు వసూలు కావాల్సి ఉన్నా లబ్ధిదారులు మొహం చాటేయడంతో రికవరీకి వెళ్లే సిబ్బంది ఉత్తచేతులతో తిరిగి వస్తున్నారు. తోడు.. వసూళ్ల గోడు.. జగనన్న తోడు పేరుతో చిరు వ్యాపారులకు డీసీసీబీ నుంచే రూ.10 వేల చొప్పున రుణాలు ఇప్పించారు. 2,901 మందికి ఇచ్చారు. ఇందులో 2,389 మంది తిరిగి చెల్లించారు. ఇంకా 512 మంది ఏడాదిలోగా చెల్లించాల్సి ఉన్నా మూడేళ్లయినా లబ్ధిదారుల జాడ కనిపించలేదు. ఇందులో రూ.40 లక్షల వరకు మొండి బకాయిలున్నాయి. ఇక ఫిష్ ఆంధ్రా పేరుతో ఇచ్చిన రుణాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇందులో కూడా రూ.లక్షల్లో మొండి బకాయిలున్నాయి.**రైతుల పేరుతో సొంతం..** ట్రాక్టర్లతో సహా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు. వాటిలో చాలా వరకు ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు. యంత్ర పరికరాలు కనిపించడం లేదు. రైతుల పేరుతో వైకాపా నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పథకంలో రూ.44.19 కోట్లు రుణాలు ఇవ్వగా.. వీటిలో రూ.12.23 కోట్ల వరకు అప్పు ఉంది. వీటిలో రూ.22 లక్షల వరకు మొండి బకాయిలు ఉండటం గమనార్హం.

# ఉపాధి శ్రామికులకు బీమా భరోసా

భీమవరం : ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం బీమా మొత్తాన్ని పెంచేలా నిర్ణయం తీసుకుంది. శ్రామికులు పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించినా, వైకల్యానికి గురైనా బాధిత కుటుంబాలకు గతంలో గరిష్ఠంగా రూ.50 వేల సాయం అందేది. ఈ మొతాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలకు పెంచింది. జిల్లా వ్యాప్తంగా 3.06 లక్షల మందికి ఉపాధి హామీ కార్డులు ఉన్నాయి. వీరిలో తరచూ పనికి వెళ్లే వారు 2.08 లక్షల మంది ఉన్నారు. వీరికి బీమా భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో పని ప్రదేశంలో శ్రామికులు మరణిస్తే రూ. 50 వేలు, అంగవైకల్యానికి గురైతే రూ. 25 వేల వరకు సాయం అందేది. 2006 నుంచి ఈ మొత్తాన్ని పెంచలేదు. ఈ మొత్తం సరిపోక బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నట్లు గుర్తించిన ప్రభుత్వం సాయాన్ని రూ.2 లక్షలకు పెంచింది. దీంతో పాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకాలకు ప్రీమియం చెల్లించడం ద్వారా మరో రూ.2 లక్షల వరకు బీమా పరిహారం అందుతుందని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులంతా ప్రధాన మంత్రి బీమా పథకాలకు తప్పకుండా ప్రీమియం చెల్లించాలన్నారు.

# స్వల్పజన క్యాజువాల్టీ



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలో ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయ స్థితికి చేరినా.. విషద్రావకం తాగి పరిస్థితి విషమించినా, ఇతరత్రా వ్యాధులతో ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన రోగులను అనంతపురంలోని ప్రభుత్వ పెద్దాసుపత్రి (సర్వజన వైద్యశాల) క్యాజువాల్టీకి తీసుకొస్తారు. ఇంత కీలకమైన విభాగాన్ని విస్తరించకపోవటంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు. ఆరు నెలల క్రితం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వేర్వేరుగా క్యాజువాల్టీని పరిశీలించి విస్తరణ చర్యలు చేపట్టాలని ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు అంచనాలు తయారు చేసి అధికారులకు అందజేసినా ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.

**వేధిస్తున్న కొరత :** క్యాజువాల్టీలో 17 ఐసీయూ పడకలు, మూడు వెంటిలేటర్లు... ఏఎంసీ (అక్యూట్‌మెడికల్ కేర్)లో 18 ఐసీయూ పడకలు, ఆరు వెంటిలేటర్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చే సగటు రోగుల సంఖ్యను బట్టి అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఒకే మంచంపై ఇద్దరిని ఉంచి చికిత్స అందించే పరిస్థితి. ఒక్కోసారి ఏఎంసీలో పడకలు ఖాళీగా లేనప్పుడు క్యాజువాల్టీలోని వెంటిలేటర్ పడకలపై రెండు మూడు రోజులు ఉంచి రోగులకు చికిత్స అందిస్తున్నారు.

**కొంత వెసులుబాటు ఉన్నా..**

ప్రస్తుతం క్యాజువాల్టీ విభాగం వెనుక వైపు ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ (ఈవోటీ) ఉంది. వీటికి అనుబంధంగానే ఏఎంసీ ఐసీయూ ఉంటుంది. క్యాజువాల్టీ ముఖద్వారం నుంచే నేరుగా ఏఎంసీ ఐసీయూ వరకు దారి ఉన్నా మూసేశారు. మూడు విభాగాలను విభజించి వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో క్యాజువాల్టీ, ఈవోటీల మధ్య 20 మంచాలు ఏర్పాటు చేసుకునేంతగా ఖాళీ స్థలం ఉంది. అలాగే ట్రామా కేర్ ఆపరేషన్ థియేటర్ వినియోగంలో లేదు. ఇందులో పది సాధారణ పడకలు ఏర్పాటు చేశారు. క్యాజువాల్టీ ముఖద్వారం ఈవోటీ, ఏఎంసీలను కలిపితే అదనంగా పడకలు ఏర్పాటు చేసే వీలుంటుందని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నివేదించారు. ట్రామాకేర్‌లో వినియోగించని ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తీసుకువస్తే క్యాజువాల్టీలో ఈవోటీని తీసేసి అక్కడా పడకలు ఏర్పాటు చేసుకోవచ్చని నివేదికలో సూచించారు. క్యాజువాల్టీ పైభాగంలో కొత్త గదులను నిర్మించి పడకలు అందుబాటులోకి తెస్తే ఇబ్బందులు తప్పుతాయని నివేదించారు. మొత్తం పనులు చేపట్టేందుకు రూ.72 లక్షల అవసరం అవుతాయని అంచనా తయారు చేసి పంపారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– డాక్టర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

క్యాజువాల్టీ విస్తరణకు సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు అందజేసిన నివేదికను ఈ ఏడాది జనవరిలోనే ఉన్నతాధికారులకు పంపాం. ఆమోదిస్తేనే పనులు ప్రారంభించే వీలుంది. పడకలు సరిపోవటం లేని మాట వాస్తవమే. క్షతగాత్రులు, రోగులకు ఇబ్బంది లేకుండా చికిత్స అందజేస్తున్నాం.

## విద్యుత్తు లేక.. వైద్యసేవలందక

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌రే, రక్త పరీక్ష, డయాలసిస్ విభాగం, ఆపరేషన్ థియేటర్ సహా పలు సేవలు ఆగిపోయాయి. ఆసుపత్రిలో ఓపీ సుమారు 484 ఉండగా ఇన్‌పేషెంట్లు 23 మంది ఉన్నారు. 50 రక్త నమూనాలు సేకరించారు. 10 మంది ఎక్స్‌రే రోగులు, 10 మంది డయాలసిస్ రోగులు సాయంత్రం వరకు వేచి చూసి వెనుదిరిగారు. ఆసుపత్రి వెనక వైపు ఉన్న విద్యుత్తు నియంత్రికలో హైఓల్టేజీ కారణంగా సమస్య తలెత్తినట్లు తెలిసింది. రాత్రి వరకు సరఫరాను పునరుద్ధరించలేదు. వార్డుల్లో చీకట్లు కమ్ముకోవడంతో రోగులు నరకయాతన అనుభవించారు. ఉక్కపోతతో అల్లాడిపోయారు. సెల్‌ఫోన్ల వెలుతురులో బిక్కుబిక్కుమంటు



గడిపారు. అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైద్యసిబ్బంది సైతం సెల్‌ఫోన్ల వెలుతురులో ఇబ్బందులు పడుతూ రోగులకు సేవలందించారు.

**అలంకారప్రాయంగా జనరేటర్**

ఆసుపత్రికి ప్రభుత్వం రెండేళ్ల కిందట జనరేటర్ మంజూరు చేసింది. అయితే ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. అది ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరుపయోగంగా మారింది. ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. రోగులకు తాగునీరు అందించడంలోనూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ విషయమై పరిపాలనాధికారి మహబూబ్‌బాషా వివరణ కోరగా ఆసుపత్రి వెనుక ఉన్న నియంత్రిక కాలిపోవడంతో ఉదయం నుంచి సరఫరా ఆగిపోయింది. సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. వీలైనంత త్వరగా సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

## ఆధార్‌కు బాలారిష్టం

చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలందరికీ ఆధార్ ఉండాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. నెలలు గడుస్తున్నా బాల ఆధార్ నమోదు పూర్తి కాలేదు. గతేడాది నవంబరు నుంచి ఇప్పటి దాకా 80 శాతం పిల్లలకే నమోదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలోనే ఆధార్ జారీ చేయాలన్న మార్గదర్శకాలను అమలు చేయకపోగా, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ చిత్తశుద్ధి కొరవడింది. సిబ్బంది ఆధార్ జారీపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఐసీడీఎస్, రెవెన్యూ(ఎంపీడీవో), పురపాలక(కమిషనర్లు) శాఖల మధ్య




సమన్వయం లోపించింది. ప్రత్యేక శిబిరాలు నిర్వహించినా అందుకు తగ్గ ఆధార్ కిట్లు లేక మమ అనిపిస్తున్నారు.


చిత్తూరు జిల్లాలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 97,087 మంది ఉన్నారు. వీరిలో 536 మంది వలస వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఆధార్ నమోదు 80 శాతం చేశారు.

**జనన ధ్రువీకరణపై సందిగ్ధం..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో జనన ధ్రువపత్రం లేకుండానే ఆరేళ్లలోపు పిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. తాజాగా బాల ఆధార్ జారీకి జనన ధ్రువీకరణ దాఖలు చేయడం లేదు. చిత్తూరు జిల్లాలో 10,863 మందికి, తిరుపతి జిల్లాలో 10,526 మంది పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేనట్లు తేలింది. తల్లిదండ్రులు, మున్సిపల్, ఆసుపత్రుల్లోనూ ఇవి అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. 'జనన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆధార్‌కు అవరోధంగా మారింది. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు.

## తోతాపురి చేదయింది..
## పుల్లూరా పల్లేరైంది

పాకాల : ధరలు దారుణంగా పడిపోవడంతో మామిడి రైతులకు దిక్కుతోచని పరిస్థితి కొనసాగుతోంది. ప్రధానంగా తోతాపురి సాగు చేసిన రైతుల గోడు మరీ దయనీయంగా మారింది. బుధవారం ఉదయం టన్ను రూ.8 వేలకు కొన్నారు. కాసేపటికే రూ.7 వేలన్నారు. సాయంత్రానికి రూ.6 వేలకు పరిమితం చేశారు. చీకటిపడే వేళకు కొనుగోళ్లు పూర్తిగా ఆపేశారు. బలవంతంగానైనా అమ్ముకుందామన్నా కొనేవారు కరవయ్యారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన కాయలు ఏంచేయా లో తెలియక రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. పుల్లూరా రకం మొదట్లో టన్ను రూ.20 వేలు



పలికి చివరకు రూ.7 వేలకు పడిపోయింది. మిగతా రకాల ధరలూ ఆశాజనకంగా లేకపోవడంతో రైతుల్లో ఎటుచూసినా నైరాశ్యం కనిపిస్తోంది.

**గుజ్జు పరిశ్రమల దాష్టీకం** మే ముగుస్తున్నా గుజ్జు పరిశ్రమలు ఇంతవరకు జిల్లాలో తోతాపురి కొనుగోళ్లను ప్రారంభించలేదు. కాయలు పక్వానికి వచ్చి తోటల్లోనే రాలిపోతున్నాయి. తమవద్ద గత ఏడాది గుజ్జు ఇంకా అమ్ముడుపోలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. కొన్ని బయటి జిల్లాల నుంచి కారుచౌకగా దిగుమతి చేసుకుంటున్నాయి. గుజ్జు నిల్వలు, సీజన్‌లో దిగుబడులపై స్పష్టమైన అంచనా, అవగాహన లేని అధికారుల తీరుతో ఈ ఏడాది మామిడి వ్యాపారం కుదేలైంది. సంప్రదింపులు, చర్చలంటూ కాలయాపన చేస్తున్న జిల్లా ఉన్నతాధికారులపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## చౌకదుకాణాల్లోనే సరకులు



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు 754 ఎండీయూ వాహనాలు మంజూరయ్యాయి. వాటి ద్వారా చేపట్టిన ఇంటింటికి రేషన్ సరకులు పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఆపరేటర్లు, డీలర్లు కుమ్మక్కై కార్డుదారులకు సక్రమంగా బియ్యం అందకుండా దోచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమాలను గుర్తించింది. ఎండీయూ వాహనాలకు మంగళం పాడింది. జూన్ ఒకటో తేదీ నుంచి చౌక దుకాణాల్లోనే సరకులు అందుబాటులో ఉంచి కార్డుదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ-పాస్, కాటా, ఐరిస్ పరికరాలను ఎండీయూ ఆపరేటర్ల నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కొత్త వర్షన్ సృష్టించి, డీలరు వేలిముద్ర అప్‌డేట్ చేస్తారు. ఆపరేటర్ వేలిముద్ర తొలగిస్తారు.

**సమయపాలన పాటించాల్సిందే..**

ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు విధిగా సరకులు పంపిణీ చేయాల్సిందే. డీలర్లు సమయపాలన పాటించాలి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందజేయాలి నీ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య 65 ఏళ్లు పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

**పారదర్శకతకు ప్రత్యేక యాప్**

కూటమి ప్రభుత్వం రేషన్ సరకులు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక యాప్ రూపొందించింది. జిల్లా పౌరసరఫరాల అధికారి మొదలుకుని సీఎస్‌డీటీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు సరకులు పంపిణీ చేసే సమయంలో దుకాణాలను తనిఖీ చేయాలి. లోకేషన్, డీలరు పేరు, సరకుల వారీగా నిల్వలతోపాటు ఈ-పోస్, కాటా యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా? కచ్చితమైన తూకం ఇస్తున్నారా? పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ తీసుకుంటున్నారా? ఇవన్నీ యాప్‌లో అధికారులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

**బియ్యం, చక్కెర సిద్ధం**

ఉమ్మడి జిల్లాలో జూన్ నెల కోటా బియ్యం, చక్కెర పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. కందిపప్పు రాలేదు. బియ్యం 18 వేల టన్నులు, చక్కెర 650 టన్నులు కేటాయించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు చేరవేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా అనంతపురం జిల్లాకు మాత్రమే 3,500 టన్నుల జొన్నలు సేకరించారు. బియ్యం బదులుగా జొన్నలు తీసుకునే వెసులుబాటు కార్డుదారులకు కల్పించారు.

**పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు**

–వెంకటేశ్వర్లు, వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓలు, అనంతపురం, శ్రీసత్యసాయి

ప్రతి కార్డుదారుకు సకాలంలో సక్రమంగా రేషన్ సరకులు పంపిణీ చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. ఇక నుంచి సీఎస్‌డీటీలు ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాల్సిందే. తహసీల్దార్లు, ఆర్డీవోలు సైతం కొన్ని దుకాణాలను తనిఖీ చేయమన్నారు. పంపిణీ పూర్తి అయ్యే వరకు ప్రత్యేక నిఘా ఉంటుంది.

## అమృత్ ఖర్చు.. కట్టకథలు

కర్నూలు : పుర వాసుల దాహం తీర్చే నీటి వనరుల పటిష్ఠతకు చేపట్టాల్సిన పనుల ప్ర'గతి' తప్పింది. పట్టణాలకు మంచినీరు అందిస్తున్న చెరువులు, ఎస్.ఎస్.ట్యాంకుల సంరక్షణకు అమృత్ 2.0, ట్రెంచ్ పథకం కింద కేంద్రం నిధులు విడుదల చేసింది. 2023, జనవరి 21న ట్రెంచ్-1 కింద కర్నూలు, ఆదోనికి రూ.5.44 కోట్లు. 2023, మే 19న ట్రెంచ్-2 కింద కర్నూలు, నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని పురపాలికలకు రూ.7.90 కోట్లు కేటాయించారు. పురపాలికల్లో నిధుల కష్టాలు ఉంటే కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించారు. మూడేళ్లు గడుస్తున్నా పురోగతి లేదు. ఆదోనిలో పనులు సగంలో ఆగిపోగా.. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది.

**ఇవి చేయాలి**

నీటి వనరుల ఆనకట్టలు బాగు చేయడం, పచ్చదనం పెంపు, రక్షణ చర్యలు చేపట్టాలి. వాటిపై వాకింగ్ ట్రాక్, బల్లలు, ఆకర్షణీయమైన దీపాలు ఏర్పాటు చేయాలి. కట్ట నుంచి మట్టి జారిపోకుండా రాళ్లతో పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పిల్లల ఆట వస్తువులు, వ్యాయామ పరికరాల ఏర్పాటు, సుందరీకరణ వంటివి చేపట్టాలి.

**ఆదోనిలో అధోగతి**

ట్రెంచ్-1 కింద ఆదోనిలో రాంజల చెరువు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు రూ.2.44 కోట్లు కేటాయించారు. అర్బన్ బ్యూటిఫికేషన్ విభాగం (ఏపీజీబీ) ఆధ్వర్యంలో ఆయా పనులకు టెండర్లు పిలిచారు. నడకదారి పూర్తిగా పాడైంది. వ్యాయామ పరికరాల బోల్టులు ఊడిపోయాయి. వర్షం వస్తే నీరు కట్ట మీద నిల్వ ఉండకుండా కిందకు



జారిపోయేలా చేసిన పనుల్లో నాణ్యత లోపించింది.

ఆదోని బసాపురం ఎస్.ఎస్.ట్యాంకు ప్రాంతంలో పనుల కోసం రూ.2.20 కోట్లు ఇచ్చారు. పనులు కట్ట వరకు చేరలేదు.

ఇక్కడ ఏం జరిగిందో కర్నూలు నగరంలో ట్రెంచ్-1 కింద అశోక్‌నగర్ నీటి ట్యాంకు ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు, ట్రెంచ్-2 కింద రూ.2.20 కోట్లతో ఎస్.ఎస్.ట్యాంకు ప్రాంతంలో సుందరీకరణ, కట్ట పటిష్ఠత పనులు చేపట్టాల్సి ఉంది. పనుల విషయంపై సదరు అధికారులను అడిగితే వివరాలు తెలియదంటూ దాటవేస్తున్నారు. నంద్యాలలో రూ.3.50 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతవరకు ఇవేవీ పట్టాలెక్కలేదు.

## రైతుల గుండెల్లో 'భయ'పాస్

కర్నూలు : గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు బైపాస్ రైలు మార్గం(ఆర్‌వోఆర్) నిర్మించాలనే ప్రతిపాదన రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. రూ.వంద కోట్లు వెచ్చించి నాలుగు కిలోమీటర్లు పూర్తి చేయాల్సిన బైపాస్ రైలు మార్గాన్ని ఏకంగా పది కిలోమీటర్లు పొడిగించి.. రూ.293 కోట్లకు వ్యయాన్ని పెంచడం పలు అనుమానాలకు 'దారి' తీస్తోంది. రైల్వేశాఖ సొంత భూములు వదిలేసి రైతుల వద్ద మళ్లీ భూసేకరణకు చేయడం గమనార్హం. ప్రస్తుతం అధికారులు ఖరారు చేసిన బైపాస్ అలైన్‌మెంట్‌పై కేంద్ర విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**10 కి.మీ. 40 ఎకరాలు**

గుంతకల్లు-బళ్లారి రైలు మార్గం మధ్యలో అనంతపురం జిల్లాలో గుంతకల్లు రైల్వేస్టేషన్ ఉంటుంది. ఈ స్టేషన్ కర్నూలు జిల్లా సరిహద్దుకు సమీపంలో ఉంటుంది.. గుంతకల్లు పడమర రైల్వేస్టేషన్ నుంచి మల్లప్పగేటు వరకు బైపాస్ రైలు మార్గాన్ని నిర్మించాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూములు కర్నూలు జిల్లాలో సేకరించాల్సి ఉంది.

పది కిలోమీటర్ల దూరం నిర్మించే బైపాస్ రైల్వేలైన్‌కు 40 ఎకరాలు అవసరమని రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులు తేల్చారు. ఆయా



భూములు చిప్పగిరి, దౌలతాపురం, నంచెర్ల పరిధిలో 48 మంది రైతుల నుంచి సేకరించాలి. బైపాస్ రైల్వేలైన్‌కు సేకరించే భూములు హంద్రీనీవా కాల్వకు సమీపంలో ఉండటంతో సిరులు కురిపిస్తున్నాయి. ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు ధర పలుకుతోంది. రెవెన్యూ అధికారులు మాత్రం అందరికీ ఒకేలా ఎకరాకు కేవలం రూ.13 లక్షలే ఇస్తామని, అంతకు మించి ఒక్క రూపాయి ఎక్కువ ఇచ్చేదిలేదని తేల్చారు.

**రెవెన్యూ అధికారుల పేచీ**

ఇంజినీరింగ్ నిపుణుల సిఫార్సుల మేరకు పది కిలోమీటర్ల దూరంపాటు బైపాస్ రైల్వేలైను నిర్మించాలని నిర్ణయించాం.. అందులో మార్పు ఉండదు.. ఆ ప్రాజెక్టుకు ఇటీవలే ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.. అవసరమైతే రైతులకు ఎకరాకు రూ.కోటి ఇవ్వడానికైనా వెనకాడమని రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో పరిహారాన్ని కనీసం రూ.50 లక్షలకైనా పెంచాలని రైతులు డిమాండు చేస్తున్నారు. "రైతులు ఎంత పరిహారం ఇవ్వమన్నా ఇస్తామని రైల్వే అధికారులు చెబుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం రూ.13 లక్షలకు సిఫార్సు చేస్తారు. ఇదేమని అడిగితే ఆ పరిహారం కూడా రాకుండా చేస్తామని సాక్షాత్తూ పత్తికొండ ఆర్డీవో బెదిరిస్తున్నారు. ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదని" చిప్పగిరికి చెందిన కావలి ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆ భూములు వినియోగిస్తే**

కొత్తగా ప్రతిపాదించిన బైపాస్‌కు రెండు కిలో మీటర్ల లోపు దూరంలోనే గుంతకల్లు-బళ్లారి రైల్వేలైన్ ఉంది. ఆ మార్గానికి ఇరువైపులా రైల్వేశాఖకు సొంత భూములున్నాయి. దానికి సమాంతరంగా రైలుమార్గాన్ని నిర్మిస్తే భూసేకరణ వ్యయం చాలా వరకు తగ్గుతుంది. అలాకాకుండా రైలు వేగంగా వెళ్లాలన్న సాకు చూపి, ప్రస్తుత మార్గానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములను సేకరించాలని నిర్ణయించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఎకరాకు రూ.13 లక్షలే ఇస్తారట– కిరణ్, చిప్పగిరి**

గుంతకల్లు నుంచి చిప్పగిరి వైపు వెళ్లే రాష్ట్ర రహదారికి ఆనుకుని నాలుగెకరాలు ఉంది. ఎంతో విలువైన ఆ భూమిని ఏడాది కిందట ఎకరా రూ.90 లక్షలకు కొనుగోలుకు కొందరు ముందుకొచ్చినా ఇవ్వలేదు. ఇప్పుడు రైల్వే అధికారులు ఎకరానికి రూ.13 లక్షలు ఇస్తామంటున్నారు. ఇది ఎంతవరకు న్యాయం. ప్రస్తుత మార్కెట్ విలువలో కనీసం సగం ధర ఇవ్వకపోతే మా బతుకులు రోడ్డున పడతాయి.

**నీరు పారించడం కష్టం– మల్లికార్జున, దౌలతాపురం**

నాకు దౌలతాపురంలో ఎనిమిదెకరాలు ఉంది. అందులో 1.10 ఎకరాలు రైల్వే శాఖ తీసుకొంది. పొలం మధ్యలోంచి పట్టాలు నిర్మిస్తామంటున్నారు. పట్టాలకు ఓ వైపు కొంత.. మరో వైపు ఇంకొంత పొలం ఉంటుంది. రెండువైపులా నీళ్లు పెట్టుకోవడానికి అవకాశం ఉండదు. రాకపోకలు సాగించడానికీ కుదరని పరిస్థితి. పంట తీసుకెళ్లడానికి ఇబ్బంది తప్పదు.

## లక్ష్యాలు ఘనం.. తనిఖీలు కనం!

చింతలపూడి : రవాణా శాఖ తనిఖీలు మరిచి కేవలం ఎఫ్‌సీలు, డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేందుకు పరిమితమవుతోందన్న ఆరోపణలున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఆ శాఖ భారీగా ఆదాయం కోల్పోవడంతో పాటు తరచూ జరుగుతున్న ప్రమాదాలకు అడ్డూఅదుపూ లేదు. జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు రవాణా డివిజన్ల పరిధిలో 16 మంది ఎంవీఐ, ఏఎంవీఐలు పనిచేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం తనిఖీల ద్వారా రూ.20.40 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.6.06 కోట్లు మాత్రమే వసూలైంది. ఆదాయం ఎలా ఉన్నా భద్రత దృష్ట్యా తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా ఆ విధమైన అడుగులు పడకపోవడం శోచనీయం.

**కార్యాలయాలకే పరిమితం..** మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు లెర్నింగ్ లైసెన్స్‌లు, వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకే పరిమితవుతున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలో సుమారు 9800 లారీలు ఉన్నాయి. ఆరు టైర్ల నుంచి 16 టైర్ల వాహనాలు ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల)ల కోసం రోజూ కనీసం 30 నుంచి 40 వరకు వస్తుంటాయి. తనిఖీలు చేస్తున్నాం.. 'ఈ ఏడాది వాహన తనిఖీల ద్వారా రూ.10 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సరకు రవాణా చేసినా ఎఫ్‌సీలు, లైఫ్ ట్యాక్స్, బీమా సక్రమంగా లేకపోయినా కేసులు రాసి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం' అని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం తెలిపారు.

**అడుగడుగునా ఉల్లంఘనలే..**

భారీ వాహనాలు వివిధ రకాల సరకులను రవాణా చేస్తుంటాయి. పరిమితికి మించి పది నుంచి 20 టన్నులకు పైబడి అధిక లోడ్‌తో వెళుతుంటాయి. ఎఫ్‌సీలు లేని, జీవిత పన్ను చెల్లించనివి రహదారిపైకి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ కొందరు అధికారులు తనిఖీల సమాచారాన్ని ముందుగానే లీక్ చేస్తుండటంతో లారీలు, టిప్పర్ల యజమానులు దొరకడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే పనిలేకుండానే ఒక్కోదానికి రూ.5 వేల నుంచి రూ.10 వేలు తీసుకుని ఎఫ్‌సీలు ఇస్తున్న వారు కూడా ఉన్నారు.

చురకలు



## భాగ్యం ఇదేం మాస్ రాంపేజ్ బాబోయ్..!

టాలీవుడ్ లో కాస్త టాలెంట్ ఉన్న హీరోయిన్ వస్తె చాలు ఆమెకు వరుస అవకాశాలు ఇస్తూ ఎంకరేజ్ చేస్తారు. అయితే ఇది అందరికీ జరుగుతుందా అంటే అలా కాదు. కొందరికి అది కూడా లక్ ఉన్న వారికి మాత్రమే అలా జరుగుతుంది. ప్రస్తుతం అలాంటి లక్కీ గాళ్ గా క్రేజీ ఛాన్స్ అందుకుంటుంది భాగ్య శ్రీ బోర్స్. మాస్ మహారాజ్ రవితేజతో మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ. హరీష్ శంకర్ ఇంట్రడ్యూస్ చేసే హీరోయిన్స్ కి అదేంటో బాగా కలిసి వస్తుంది. ఈ క్రమంలో మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా భాగ్యానికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా, కాంతా సినిమాలు చేస్తుంది. ఈ సినిమాల్లో ఏ ఒక్కటి బ్లాక్ బస్టర్ పడ్డా అమ్మడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇది చాలదు అన్నట్టుగా మరికొన్ని సినిమాలు



వచ్చి యాడ్ అవుతున్నాయి. భాగ్య శ్రీ ఖాతాలో లేటెస్ట్ గా అక్కినేని అఖిల్ లెనిన్ కూడా వచ్చి చేరిందని టాక్. శ్రీలీల చేయాల్సిన ఆ సినిమా కాస్త ఆమెకు డేట్స్ అడ్జస్ట్ అవ్వట్లేదని ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ కాగా ఆ ఛాన్స్ భాగ్య శ్రీ కొట్టేసింది. ఆల్రెడీ సితార బ్యానర్ లో కింగ్ డం చేస్తున్న భాగ్య శ్రీ పనిలో పనిగా మరో ఆఫర్ అందుకుంది. తెలుగులో ఒకే ఒక్క సినిమా అది కూడా ఫ్లాప్ అయిన కూడా భాగ్య శ్రీకి బంపర్ ఆఫర్లు.. చెప్పాలంటే ఒక దానికి మించి మరొక ఆఫర్ అన్నట్టుగా వస్తున్నాయి. అఖిల్ లెనిన్ ఛాన్స్ అయితే ఆమెకు నిజంగానే లక్కీ అనిపించేలా చేసింది. భాగ్య శ్రీ పర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. మిస్టర్ బచ్చన్ లో తన గ్లామర్ ట్రీట్ తో ఆడియన్స్ ని అలరించింది. అంతేకాదు ఆఫ్ స్క్రీన్ కూడా చాలా యాక్టివ్ గా కనిపించింది. అదే అమ్మడికి అవకాశాలు తెచ్చేలా చేస్తుంది. కింగ్ డం సినిమా నుంచి వచ్చిన సాంగ్ తో యూత్ ఆడియన్స్ కి దగ్గరైంది భాగ్య శ్రీ. చూస్తుంటే అమ్మడు టాలీవుడ్ లో కొన్నాళ్లు తన హవా కొనసాగించేలా ఉ ందనిపిస్తుంది. ఇక రిలీజ్ ల విషయానికి వస్తే భాగ్య శ్రీ నటించిన కింగ్ డమ్ నెక్స్ట్ మంత్ రిలీజ్ అవుతుంది. ఆంధ్రా కింగ్ తాలూకా కూడా త్వరలో రిలీజ్ అవబోతుంది. ఈ రెండు సినిమాలు హిట్లు పడితే మాత్రం భాగ్య శ్రీ రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

## అనుష్క ఇదేం కరెక్ట్ కాదమ్మి..!

స్వీటీ అనుష్క ఘాటి సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్నారు. క్రిష్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న ఈ సినిమా అసలైతే ఏప్రిల్ సెకండ్ హాఫ్ రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ సినిమా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. యువి క్రియేషన్స్ బ్యానర్ లో రూపొందుతున్న ఘాటి సినిమా విషయంలో మేకర్స్ నుంచి కూడా ఎలాంటి అప్డేట్స్ రావట్లేదు. నిశ్శబ్దం తర్వాత నాలుగేళ్లు గ్యాప్ ఇచ్చిన అనుష్క లాస్ట్ ఇయర్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టిలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయినా కూడా అనుష్క మళ్లీ వరుస సినిమాలు చేయట్లేదు. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది అనుకోవడం ఫ్యాన్స్ వంతు అయ్యింది. పోనీ కమిటైన క్రిష్ ఘాటి సినిమాకైనా అడిగిన డేట్స్ ఇస్తుందా అంటే సినిమా ఎప్పుడు పూర్తవుతుందా అన్నట్టుగా ఉందట. అనుష్క ఇంట్రెస్ట్ లేకుండానే



సినిమాలు చేస్తుందా అనుకుంటున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా అదరగొట్టిన అనుష్క కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తూ వచ్చింది. అరుంధతి, రుద్రమదేవి లాంటి సినిమాలు చేయాలంటే అనుష్క వల్లే అవుతుందని ప్రూవ్ చేసుకుంది. ఐతే బాహుబలిలో కూడా ఆమె తన అందంతో మెప్పించింది. ఐతే తన లుక్స్ వైజ్ ఇంకా ఇదివరకులా లేదన్న కారణం చేతనే అనుష్క సినిమాలు చేయట్లేదు. ఐతే క్రిష్ సినిమా ఎలాగు చివరి దశకు వచ్చింది కాబట్టి దాన్ని పూర్తి చేసి నెక్స్ట్ ఏం చేయాలి అన్నది చూస్తుందట. ఘాటితో పాటు అనుష్క ఒక మలయాళ సినిమాకు కూడా సైన్ చేసింది. ఆ సినిమా ఎంతవరకు వచ్చిందో కూడా తెలియాల్సి ఉంది. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది.. ఆమె కెరీర్ గ్యాప్ కి అసలు రీజన్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఘాటి సినిమా టీజర్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని అనుకున్నారు. కానీ సినిమాని లేట్ చేస్తూ ఆడియన్స్ లో ఉన్న ఇంట్రెస్ట్ ని కోల్పోయేలా చేస్తున్నారు. ఘాటి పూర్తైతే కానీ అనుష్క నెక్స్ట్ సినిమాల గురించి అప్డేట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది. తెర మీద అనుష్కని మిస్ అవుతున్న ఆమె ఫ్యాన్స్ మాత్రం ఎప్పుడొచ్చినా ఆమెను ఎంకరేజ్ చేసేందుకు రెడీగా ఉన్నారు. ఘాటి తర్వాత అనుష్క సినిమాలు చేసినా కాస్త స్పీడ్ గా చేస్తే బాగుంటుందని అంటున్నారు.




## రాజా సాబ్ నెల రోజుల ప్రమోషన్స్ ప్లానింగ్..!



రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న రాజా సాబ్ సినిమా డిసెంబర్ ఫస్ట్ వీక్ రిలీజ్ అవుతుంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో ఈ సినిమా నిర్మిస్తున్నారు. సినిమాలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. థమన్ అందిస్తున్న మ్యూజిక్ రాజా సాబ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్తుందని అంటున్నారు. ఈమధ్యనే టీజర్ తో ఫ్యాన్స్ లో అంచనాలు పెంచాడు మారుతి. రాజా సాబ్ ప్రమోషన్స్ విషయంలో మొన్నటిదాకా చిత్ర యూనిట్ ని రెబల్ ఫ్యాన్స్ ఎటాక్ చేస్తూ వచ్చారు. సినిమా సెట్స్ మీదకు వెళ్లి రెండేళ్లు అవుతున్నా కనీసం టీజర్ కూడా వదల్లేదని బాగా ఫైర్ అయ్యారు. ఐతే ఎప్పుడైతే రాజా సాబ్ టీజర్ రిలీజైందో అప్పటి నుంచి ఫ్యాన్స్ రియాక్షన్ లో మార్పు వచ్చింది. ఏమో అనుకున్నాం కానీ మారుతి ప్రభాస్ తో ఏదో అద్భుతాన్నే చేస్తున్నాడు అన్న భావన కలిగేలా చేశాడు. రాజా సాబ్ టీజర్ చూస్తే అసలు కథ చూచాయగా అర్ధం అవుతున్నా కచ్చితంగా ఇదొక థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుందని చూపించారు. ఐతే రాజా సాబ్ కి సరిగా ప్రమోషన్స్ చేయట్లేదని ఫ్యాన్స్ మొన్నటిదాకా అసంతృప్తి పడగా డిసెంబర్ రిలీజ్ కాబట్టి సినిమా రిలీజ్ నెల రోజులు ముందు నుంచి ప్రమోషన్స్ మొదలు పెట్టాలని చూస్తున్నారట. అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తుంది. పాన్ ఇండియా లెవెల్ లో రాజా సాబ్ భారీ రిలీజ్ ప్లానింగ్ ఉండగా అందుకు తగిన ప్రమోషన్స్ ని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. సో తప్పకుండా రాజా సాబ్ రెబల్ ఫ్యాన్స్ అందరి ఊహలకు మించి ప్రమోషన్స్ ఉండనున్నాయి.

రాజా సాబ్ తో ప్రభాస్ మరో సూపర్ హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. మరి సినిమా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుంది అన్నది చూడాలి. రాజా సాబ్ థ్రిల్లర్ మాత్రమే కాదు ఎంటర్టైనింగ్ విషయంలో కూడా నెక్స్ట్ లెవెల్ అనిపించేలా ఉంటుందని తెలుస్తుంది. సినిమాలో ప్రభాస్ రోల్ అటు కామెడీ పంచుతూనే అవసరమైన టైం లో హీరోయిజం చూపిస్తాడని అంటున్నారు. డిసెంబర్ లో రాజా సాబ్ రిలీజ్ ఫిక్స్ చేసుకున్న ప్రభాస్ ఆ నెక్స్ట్ హను రాఘవపుడితో చేస్తున్న ఫౌజీని కూడా 2026 సమ్మర్ కి వచ్చేలా ప్లాన్ చేస్తున్నాడు.


## టాలీవుడ్ స్టార్‌లకు సమ్మర్ బ్రేక్




టాలీవుడ్ లో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు సెట్స్ పై ఉన్న విషయం తెలిసిందే. తెలుగు సినిమా స్థాయి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన నేపథ్యంలో స్టార్ హీరోలు నటించే ప్రతీ సినిమానీ నిర్మాతలు భారీ బడ్జెట్ లతో నిర్మిస్తున్నారు. దీంతో ఒకప్పుడు తెలుగు సినిమాను పట్టించుకోని వాళ్లందరూ కూడా ఎప్పుడెప్పుడు ఆయా సినిమాలు రిలీజవుతాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో సెట్స్ పై ఉన్న భారీ సినిమాల్లో హరిహర వీరమల్లు, ఓజీ, రాజా సాబ్, ఫౌజి, డ్రాగన్, పెద్ది. స్టార్ హీరోలు నటిస్తున్న ఈ సినిమాలను నిర్మాతలు భారీగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. వారిలో ఎన్టీఆర్ తప్ప మిగిలిన స్టార్ హీరోలంతా సమ్మర్ లో ఈ షూటింగుల నుంచి బ్రేక్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ షూటింగ్ లో బిజీగా ఉన్నాడు ఎన్టీఆర్. మరికొద్ది రోజుల్లో ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ పూర్తవడంతో ఎన్టీఆర్ కూడా బ్రేక్ తీసుకోబోతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ మినహా మిగిలిన హీరోలంతా ఆల్రెడీ షూటింగ్స్ నుంచి బ్రేక్ లోనే ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ముఖ్యంగా మొదట చెప్పుకోవాల్సింది పవన్ కళ్యాణ్ గురించి. పవన్ పాలిటిక్స్ లో బిజీగా ఉండటం వల్ల ప్రస్తుతం షూటింగ్స్ కు హాజరయ్యే తీరిక లేదు. అందుకే షూటింగ్స్ నుంచి పవన్ బ్రేక్ లో ఉన్నాడని అంటున్నాం. ఒకవేళ పవన్ కు కుదిరి డేట్స్ అడ్జస్ట్ చేస్తే ఎంత సమ్మర్ లో అయినా సరే షూటింగ్ ను పూర్తి చేయడానికి రెడీగా ఉన్నారు హరిహర వీరమల్లు, ఓజి చిత్ర మేకర్స్. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. ఆల్రెడీ రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఎస్ఎస్ఎంబీ29 టీమ్, తర్వాతి షెడ్యూల్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో బ్రేక్ వచ్చింది. దీంతో మహేష్ ఖాళీగా ఉన్నాడు. బుచ్చిబాబు సానతో రామ్ చరణ్ చేస్తున్న పెద్ది షూటింగ్ కు సమ్మర్ కారణంగా చరణ్ బ్రేక్ ఇచ్చాడు. ప్రభాస్ మోకాలి గాయం వల్ల సర్జరీ చేయించుకుని ఆల్రెడీ గత కొంతకాలంగా రెస్ట్ లోనే ఉన్నాడు. ఇక అల్లు అర్జున్, అట్లీతో చేయబోయే సినిమా కన్ఫర్మ్ అయినప్పటికీ ఆ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని మొదలయ్యే సరికి జూన్ వచ్చేస్తుంది. సో టాలీవుడ్ స్టార్ హీరోలంతా సమ్మర్ లో బ్రేక్ లో ఉన్నట్టే అని చెప్పుకోవాలి.

## 'బలగం' బ్లాక్ బస్టర్ కానీ.. తనకేమైంది?

టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు సమీకరణాలు మారిపోతున్నాయి. ప్రేక్షకులు ఓటీటీల ప్రభావంతో థియేటర్లకు రావడానికి పెద్దగా ఆసక్తిని చూపించడం లేదు. దీంతో స్టార్‌లని పక్కన పెడితే మిగతా ఆర్టిస్ట్‌లు, హీరోయిన్‌ల పరిస్థితి కొంత గందరగోళంగా తయారయింది. ఎవరు ఎప్పుడు ఏ సినిమాతో, ఏ సిరీస్‌లో ప్రేక్షకుల ముందుకొస్తారో.. అవకాశాలు లేక ఎప్పుడు కనుమరుగువుతారో తెలియడం లేదు. ఇప్పుడు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది కావ్య కల్యాణ్ రామ్. చైల్డ్ ఆర్టిస్ట్‌గా పదకొండు సినిమాల్లో నటించిన ట్రాక్ రికార్డ్ తన సొంతం. గంగోత్రిలో వల్లంకి పిట్ట పాటతో అందరినీ ఆకట్టుకుని పాపులర్ అయిన కావ్య కల్యాణ్ రామ్ హారర్ థ్రిల్లర్ మూవీ మసూదతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తిరువీర్, సంగీత, బాంధవీ శ్రీధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించిన హీరోయిన్‌గా తొలి ప్రయత్నంలోనే సక్సెస్‌ని అందించింది. దీని తరువాత కమెడియన్ వేణు దర్శకత్వంలో దిల్ రాజు ఫ్యామిలీ వారసులు హర్షిత్‌రెడ్డి, హర్షితా



రెడ్డి నిర్మించిన బలగంలో నటించింది. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీ ఏ స్థాయిలో సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మళ్లీ పల్లెల్లోని జనం భారీ సంఖ్యలో థియేటర్లకు పరుగులు తీసేలా చేసి అలనాటి రోజుల్ని గుర్తు చేసింది. పల్లె పల్లెన, సిటీల్లోనూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారి దర్శకుడు వేణు, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించింది. చిన్న బడ్జెట్‌తో మనసుకు హత్తుకునే భావోద్వేగాల సమాహారంగా తెరకెక్కిన ఈ సినిమా నటుడిగా ప్రియదర్శికి, హీరోయిన్‌గా కావ్య కళ్యాణ్‌రామ్‌కు మంచి పేరు తెచ్చి పెట్టింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ తరువాత ప్రియదర్శి హీరోగా బిజీ అయిపోయాడు. వరుసగా సినిమాలు చేస్తున్నాడు. తనని దృష్టిలో పెట్టుకుని దర్శకులు కథలు రాస్తూ సరికొత్త కథలని తెరపైకి తీసుకొస్తున్నారు. అయితే 'బలగం'లో హీరోయిన్‌గా నటించిన కావ్య కల్యాణ్ రామ్ కెరీర్ మాత్రం ఇందుకు భిన్నంగా సాగుతోంది. ఈ మూవీ తరువాత కావ్య 'ఉస్తాద్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. 2023లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అనిపించుకుంది. అక్కడి నుంచి ఇంత వరకు కావ్య కల్యాణ్‌రామ్ నుంచి మరో సినిమా రాలేదు. ఆమె సినిమా చేసి దాదాపు రెండేళ్లవుతోంది. తను కావాలనే గ్యాప్ తీసుకుందా? లేక ప్రస్తుత పరిస్థితుల కారణంగా తనకు అవకాశాలు రావడం లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## టాప్ లెస్ ఫోజులో గుబులు రేపిన సోనమ్

ఈ భూప్రపంచంలో ఎన్నో సంస్కృతులు, ప్రాంతాన్ని బట్టి, దేశాన్ని బట్టి.. భాష వేషం సంస్కృతి ప్రతిదీ మారిపోతాయి. అలాగే ఈజిప్షియన్ కల్చర్ లో అత్యంత పురాతనమైన సంస్కృతి.. అక్కడి సమాధులు నిర్మాణాలు, వాటి వెనక కథలు ప్రజల హృదయాల్లో పాతుకుపోయాయి. మమ్మీ, మమ్మీ 2 సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విడుదలై సంచలన విజయం సాధించడం వెనక ఈజిప్ట్ కల్చర్ లో దాగి ఉన్న పురాణేతిహాస కథలు, పాత్రల యూనివర్శల్ అప్పీల్ ఒక కారణం అనడంలో సందేహం లేదు. చూస్తుంటే, ఇక్కడ భారతీయ ఫ్యాషనిస్టా సోనమ్ కపూర్ ఈజిప్ట్ టోంబ్ నుంచి నిదుర లేచిన మమ్మీ లా కనిపిస్తోంది. ఆ నుదుటిన భారీతనం నిండిన పాపిడి బొట్టులాంటి ఆ హారం.. ఇన్నర్ ఏదీ ధరించకుండా డ్యాషింగ్ టాప్ లెస్ ఫోజుతో




సోనమ్ తాజా ఫోటోషూట్ లో కట్టి పడేసింది. 39ఏళ్ల బ్యూటీ గ్లామర్ క్వీన్ ని తలపించింది. ఈ లుక్ చూడగానే గోల్డెన్ గాళ్ సోనమ్ అదిరిపోయింది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సోనమ్ కపూర్ అందాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఈ ఫ్యాషనిస్టా 14వ సారి వోగ్ ఇండియా కవర్ గర్ల్‌గా మెరుపులు మెరిపించింది. మేకప్ ఆర్టిస్ట్ నమ్రతా సోని సోనమ్ లుక్ ని డిజైన్ చేయగా, అది తన స్థాయిని అమాంతం పదింతలు పెంచింది. ఈ రూపం కోసం ఎంపిక చేసుకున్న మేకప్, వస్త్రాభరణాలు ప్రతిదీ వేటికవే ప్రత్యేకం. సోనమ్ కపూర్ గోల్డెన్ గర్ల్ స్టైల్, గ్లామ్ అవతార్ యువతరం హృదయాలను సున్నితంగా టచ్ చేసింది.

వీరే ది వెడ్డింగ్, ఏకే వర్సెస్ ఏకే, బ్లైండ్ వంటి చిత్రాలలో నటించాక, సోనమ్ నటనకు దూరంగా ఉంది. ప్రస్తుతం భర్తతో కలిసి విదేశాల్లో వ్యాపారాలను చక్కదిద్దుకుంటోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536